



www.prajapaksham.in

# ప్రజాపక్షం


ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాలతో అభివృద్ధిని అడ్డుకోవద్దు **05**
సిజెఐ సూర్యకాంత్ హితవు

శ్రమకు తగ్గ ఫలితం రావాలని సిపిఐ పోరాటం **03**
కార్మికుల హక్కులు సాధించడంలో కీలక పాత్ర

సంపుటి 09, సంచిక: 45 | సోమవారం | 12-01-2026 | కరీంనగర్ Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00



ఢిల్లీలో సైబర్ నేరగాళ్లకు చిక్కిన వృద్ధ దంపతులు 17 రోజులు డిజిటల్ అరెస్టులో.. దాచుకున్న సొమ్ము పోగొట్టుకున్న వైనం

## రూ.15 కోట్లు హుష్‌కాకి

**న్యూఢిల్లీ :** దేశంలో సైబర్ నేరగాళ్ల రెచ్చిపోతున్నారు. వృద్ధులు, మహిళలు, పెన్షనర్లను లక్ష్యంగా చేసుకుని దోపిడీకి పాల్పడుతున్నారు. తెలంగాణలో శనివారం వెలుగులోకి వచ్చిన మాజీ ఐపిఎస్ అధికారి భార్య నుంచి రూ. 2.58 కోట్లు కొల్లగొట్టిన ఘటన మరవక ముందే తరువాయి 12లో




## ‘గ్రోక్’ అసభ్య కంటెంట్... 600 ఖాతాలు డిలీట్

3,500 అశ్లీల పోస్టులను బ్లాక్

కేంద్ర సర్కార్ ఆదేశాలతో ‘ఎక్స్’ దిద్దుబాటు చర్యలు

**న్యూఢిల్లీ :** సోషల్ మీడియా వేదికలో అసభ్యకరమైన, అశ్లీల కంటెంట్‌ను తొలగించాలని కేంద్రం ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో ‘ఎక్స్’ దిద్దుబాటు చర్యలు చేపట్టింది. తన ప్లాట్‌ఫామ్‌లో జరిగిన తప్పులను బాహాటంగా అంగీకరించింది. ఎలాన్ మస్క్‌కు చెందిన ఈ సంస్థ, తన ఏఐ టూల్ ‘గ్రోక్’ ద్వారా సృష్టిస్తున్న తరువాయి 12లో



## సైబర్ నేరాలు 18 మంది అరెస్ట్

ఆరుగురి ఖాతాల్లో నుంచి రూ. 547 కోట్లు కొల్లగొట్టిన కేటుగాళ్లు

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఖమ్మం ఎస్‌పి సూచన

ప్రజాపక్షం/పెనుబల్లి

రాష్ట్రంలో సైబర్ నేరగాళ్లు అమాయక ప్రజల నుంచి కోట్లాది రూపాయలు కొల్లగొడుతుండడంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. దాడులకు పాల్పడుతుండేవారికి ఉక్కుపాదం మోపుతోంది. తాజాగా 18 మందిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాలను ఖమ్మం జిల్లా ఎస్‌పి సునీల్ దత్ ఆదివారం మీడియాకు వెల్లడించారు. గత సంవత్సరం 2025 డిసెంబర్ 24న సత్తుపల్లి మండలం తుంబూరు గ్రామానికి చెందిన మోదుగు సాయికిరణ్ ఇచ్చిన ఫిర్యాదుతో విచారణ జరిపిన తరువాయి 2లో




# ప్రతి సోమవారం ఇందిరమ్మ నిధులు

- రాజకీయాలకతీతంగా అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు
- పేద, మధ్యతరగతి కుటుంబాలను దృష్టిలో ఉంచుకొని పాలన
- వారి జీవన ప్రమాణాల పెంపునకు ప్రభుత్వం కృషి
- సింగరేణి కార్మికుల వలే రాష్ట్రంలో ఐదులక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులకు కోటి రూపాయల బీమా
- గత బిఆర్‌ఎస్ పాలనలో స్కాములు, దోపిడీలు తప్ప చేసిందేమీ లేదు
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ధ్వజం
- సింగరేణి కార్మికులకు త్వరలో పట్టాలిస్తాం : మంత్రి పొంగులేటి
- రామగుండంలో రూ.175.47 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాపక్షం/గోదావరిఖని

ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని, పేద, మధ్య తరగతి కుటుంబాలను దృష్టిలో పెట్టుకుని పాలన కొనసాగిస్తున్నామని, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ ఎకానమీతో ఆర్థిక శక్తిగా తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తున్నదని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం డిప్యూటీ సిఎం రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు హర్కర వేణుగోపాల్‌రావు, రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్‌లతో కలిసి పెద్దపల్లి జిల్లా రామగుండంలో పర్యటించారు. రూ.175.47 కోట్ల అభివృద్ధి పనులకు, రూ.6.5 కోట్ల రహదారి విస్తరణ పనులకు డిప్యూటి సిఎం, మంత్రులు శంకుస్థాపనలు చేశారు. 633 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, 494 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు, రాష్ట్రంలోనే మొదటిసారిగా 53 మంది ట్రాన్స్‌జెండర్లకు ఇళ్ల స్థలాల పట్టాలను అందజేశారు. అనంతరం గోదావరిఖనిలో జరిగిన బహిరంగసభలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క ప్రసంగిస్తూ, గత పాలనలో ప్రజల కష్టాలను చూసి తాను ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు పీపుల్స్ మార్చ్ పేరిట పాదయాత్ర చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో రూ.22,500 కోట్లతో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులకు అందజేస్తున్నామన్నారు. ప్రతి సోమవారం నిధులు విడుదల చేస్తున్నామన్నారు. 96 లక్షల కుటుంబాలకు తరువాయి 2లో

## ఎస్‌ఎల్‌బిసి సొరంగం పనుల్లో ఆధునిక పరిజ్ఞానం

రాష్ట్ర నీటిపారుదల శాఖమంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

సొరంగం తవ్వకంపై అధికారులతో సమీక్ష




ప్రజాపక్షం/హైదరాబాద్

‘ఎస్‌ఎల్‌బిసి’ నిర్మాణానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవా లని, సొరంగం తవ్వకాలకు ఆధునిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామని నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. సొరంగ మార్గం పనుల్లో క్షేత్రస్థాయి సిబ్బందికి 25 శాతం అదనపు జీతాలు ఇవ్వాలని, సొరంగ నిర్మాణ పనులపైన ప్రతి సోమవారం తరువాయి 2లో



## చెక్‌డ్యాంలో మునిగి తల్లి, ఇద్దరు పిల్లలు మృతి 03

సిద్దిపేట జిల్లా కస్తూరిపల్లిలో విషాదం

## నేడు ఖమ్మంలో కవి సమ్మేళనం

ప్రజాపక్షం/హైదరాబాద్

భారత్ కమ్యూనిస్టు పార్టీ శతవసంతాలను పురస్కరించుకొని ఖమ్మం పట్టణంలో సోమవారం ఉదయం 10 గంటలకు ‘కవి సమ్మేళన’ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ,ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు తెలిపారు. సిపిఐ శత వసంతాలు పూర్తి చేసుకున్నందున ఈనెల 18న ఖమ్మం పట్టణంలో లక్షలాది మందితో బహిరంగ సభను ఏర్పాటు చేస్తున్నామని, ఇందులో భాగంగానే ఖమ్మం పట్టణం, డి పి అర్ పి భవన్‌లో కవి సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నామని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## సహజ వనరులు, డాలర్లపై ప్రజలదే పెత్తనం

- ప్రైవేటు పెట్టుబడికి, అగ్రరాజ్యాలకు అవకాశం ఇవ్వొద్దు
- ఆధిపత్యం, నియంతృత్వానికి వ్యతిరేకంగా చిన్న దేశాలు ఏకమవ్వాలి
- ఇస్కఫ్- తెలంగాణ రాష్ట్ర రెండవ మహాసభ పిలుపు




ప్రజాపక్షం/హైదరాబాద్

ఆయా దేశాలలోని చమురు వనరులు, డాలర్లపైన అగ్ర రాజ్యాల ఆధిపత్యం, నియంతృత్వం కొనసాగదని, దీనికి వ్యతిరేకంగా చిన్న దేశాలన్నీ ఏకమవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ చైర్మన్, హైకోర్ట్ మాజీ న్యాయమూర్తి జస్టిస్ జి.రాధారాణి అన్నారు. సహజ వనరులు, డాలర్లపైన ప్రజలదే పెత్తనమని,ప్రైవేటు, అగ్ర రాజ్యాలకు పెత్తనం లేదని స్పష్టం చేశారు. ప్రపంచ శాంతికి దేశాల మధ్య సహకారం అత్యవసరమని, ప్రపంచీకరణ నేపథ్యంలో ఒకరి సహకారం లేకుండా ఏ దేశం ఒంటరిగా మనుగడ సాగించలేదని, పరస్పర జ్ఞాన మార్పిడి, వనరుల తరువాయి 12లో

## మహానగరం ఖాళీ

- జనం లేక నిర్మానుష్యంగా హైదరాబాద్
- బోసిపోతున్న రహదారులు
- సంక్రాంతికి పల్లెబాట పట్టిన పట్నం ప్రజలు
- టోల్‌ప్లాజాల వద్ద బారులు తీరిన వాహనాలు
- బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్ల వద్ద ప్రయాణికుల రద్దీ

ప్రజాపక్షం/హైదరాబాద్

సంక్రాంతి పండుగ నేపథ్యంలో నగరవాసులు పల్లెకు పయనమయ్యారు. దీంతో నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారులు, ఐటీ కారిడార్లు, వాణిజ్య ప్రాంతాలు ప్రస్తుతం జనాలు లేని సిటీగా, ట్రాఫిక్ లేని రహదారులతో నిర్మానుష్యంగా మారిపోయింది. ఉద్యోగాలు, ఉపాధి, విద్య కోసం నగరానికి వచ్చి స్థిరపడిన లక్షలాది మంది పల్లె పిలుపుకు స్పందిస్తూ తమ కుటుంబీకులు, బంధువులు, స్నేహితులతో సంక్రాంతి పండుగకు సందడి చేయడానికి స్వగ్రామాల బాట పట్టారు. ఉదయం నుంచి రాత్రి వరకూ వాహనాలతో కిటకిటలాడే ఔటర్ రింగ్ రోడ్, హైటెక్ సిటీ, మాదాపూర్, గచ్చిబౌలి, ఎల్బీ నగర్, దిల్‌సుఖ్‌నగర్ వంటి ప్రాంతాల్లో ట్రాఫిక్ లేకుండా రహదారులు విస్తరించి కనిపిస్తున్నాయి. సిగ్నల్స్ వద్ద వాహనాల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి తరువాయి 2లో



## మాంజా ‘పంజా’

ప్రాణాల మీదికి తెస్తున్న పతంగుల దారాలు

చర్యలు తప్పవని పోలీసుల హెచ్చరిక

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం



సంక్రాంతి అంటేనే పతంగుల పండుగ, ఆకాశ గగనంలో రంగురంగుల గాలి పటాలు పోటీ పడి మరీ కను విందు చేస్తుంటాయి. అయితే చిన్నారుల సరదా పతంగుల ఆట ప్రజలు, పక్షుల ప్రాణాలకి సంకటంగా మారింది. మార్కెట్లో కి వచ్చిన పలు రకాల చైనా మాంజాలతో ప్రతీ ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని, అసలు ఆ చైనా మాంజాలను తరువాయి 12లో




## సైనిక దాడులకు పాల్పడితే దెబ్బకు దెబ్బ తీస్తాం

- అమెరికా–ఇజ్రాయెల్ దేశాలకు ఇరాన్ హెచ్చరిక
- అమెరికా వాణిజ్య కేంద్రాలు, సైనిక స్థావరాలపై న్యాయబద్ధమైన దాడులు చేస్తామని ప్రకటన
- తాము కేవలం ప్రతిస్పందనకు మాత్రమే పరిమితం కాబోమని ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మహ్మద్ బాకర్ క్వాలిబాఫ్ ప్రకటన

**వాషింగ్టన్:** తమదేశ అంతర్గత ప్రజాందోళనలో జోక్యం చేసుకుని సైనిక దాడులకు పాల్పడితే దెబ్బకు దెబ్బ తీస్తామని అమెరికా–ఇజ్రాయెల్ దేశాలకు ఇరాన్ తీవ్ర హెచ్చరిక చేసింది. అమెరికా వాణిజ్య కేంద్రాలు, సైనిక స్థావరాలపై న్యాయబద్ధమైన దాడులు చేస్తామని ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మహ్మద్ బాకర్ క్వాలిబాఫ్ పేర్కొన్నారు. అమెరికా దాడి చేశాక కేవలం ప్రతిస్పందనకు మాత్రమే తాము పరిమితం కాబోమని చెప్పారు. ఇరాన్ పెద్ద సంక్షోభంలో ఉందని, పరిస్థితులు చేయిజారితే అయతొల్లా అలీ ఖమేని రష్యాకు పారిపోయేందుకు తరువాయి 2లో

# సిరియాలో అమెరికా 'ఆపరేషన్ హకాయ్'

## 35 ఐఎస్ ఉగ్రవాద కేంద్రాలపై భారీ దాడులు



**పెంటగాన్ :** సిరియాలో ఐఎస్ఐఎస్ 35 ఉగ్రవాద కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని అమెరికా దళాలు భారీ ఎత్తున దాడులు చేశాయి. దాదాపు 90 లక్ష్యాలపై గురిపెట్టి 20 కంటే ఎక్కువ యుద్ధ విమానాలను ఉపయోగించి దాడులు చేసినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) ఆదివారం ప్రకటించింది. సిరియాలో డిసెంబరు 13వ తేదీన అమెరికా సైనిక స్థావరాలపై ఐఎస్ ఉగ్రవాదులు చేసిన దాడులకు ప్రతీకారంగా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆదేశాల మేరకు ''ఆపరేషన్ హకాయ్'' నిర్వహించినట్లు 'సెంట్‌కామ్' ఎక్స్ వేదికగా ఆదివారం పోస్టింగ్ పెట్టింది. ఎఫ్–15 ఇఎస్, ఎ–10ఎస్,ఎసి–130 జెఎస్, ఎంక్యూ–9ఎస్, జోర్డానియన్ ఎఫ్–16 యుద్ధ విమానాలు ఈ హకాయ్ ఆపరేషన్‌లో పాల్గొన్నాయి. తాము కూడా ఈ ఆపరేషన్‌లో భాగం పంచుకున్నట్లు జోర్డాన్ ప్రభుత్వం ప్రకటించింది. పశ్చిమ ఆసియాలో ఉన్న అమెరికా మిత్రదేశాల సంరక్షణకోసం, అమెరికా దళాలను రక్షించుకోవడంకోసం, ఉగ్రవాదులను మట్టు పెట్టేందుకు ఈ దాడులు చేసినట్లు సెంట్‌కామ్ ప్రకటించింది. ఐతే దాడులు ఎక్కడ జరిగాయి? ఎంతమంది ఉగ్రవాదులు మరణించారు? అనే వివరాలు ఇంకా అధికారికంగా తెలియాల్సి ఉంది. ఉగ్రవాదాన్ని సహించం, ఎడతెగని అవిశ్రాంత దాడులు చేస్తాం అని అమెరికా రక్షణ మంత్రి పీటర్ హెగ్సెత్ సోషల్ మీడియాద్వారా ప్రకటించారు. సిరియాలోని పాల్మిరా ప్రాంతంలో ఐఎస్ ఉగ్రవాది ఒకరు ఇద్దరు అమెరికా సైనికులను, ఒక అమెరికా పౌరుణ్ణి, ఒక అనువాదకుణ్ణి కాల్చి చంపిన తర్వాత గత ఏడాది డిసెంబరులో మొదటిసారి అమెరికా ''ఆపరేషన్ హకాయ్' చేపట్టింది. ఆనాడు డిసెంబరు 20,28 తేదీలలో చేసిన దాడుల్లో 25 మంది ఐఎస్ ఉగ్రవాదులు హతులయ్యారు. ''మా సందేశం చాలా స్పష్టంగాబలంగా ఉంది, మీరు గనుక మా యుద్ధ విమానాలకు హాని కలగచేసే ప్రయత్నం చేస్తే ఈ ప్రపంచంలో మీరు దాక్కుని ఉన్నాసరే, వెతికి వేటాడి మిమ్మల్ని చంపుతాం, న్యాయం నుండి తప్పించుకోవడానికి మీరు ఎంత కష్టపడినా ఎన్ని కఠినమైన చర్యలు తీసుకున్నాగానీ ప్రయోజనం లేదు'' అని సెంట్‌కామ్ ఐఎస్ ఉగ్రవాదులకు హెచ్చరిక చేసింది.

# గ్రీన్‌లాండ్‌పై దండయాత్ర ప్రణాళికకు ఆదేశం

## సైనిక కమాండర్ల అయిష్టత!



**వాషింగ్టన్:** వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన గ్రీన్‌లాండ్ స్వాధీనం చేసుకునేందుకు చాలా తీవ్రమైన నిర్ణయం తీసుకున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, ఆ దీవిపైదండయాత్రకు తగిన వ్యూహాలు రూపొందించాల్సిందిగా తన ప్రత్యేక దళాల సైనిక కమాండర్లకు ఆదేశమిచ్చారు. ఐతే ఈ దీవిపై దండయాత్రకు గల చట్టబద్ధత, సాధ్యాసాధ్యాలల విషయంపై సైనిక అధికారులు సందేహంలో పడ్డారు. గ్రీన్‌లాండ్‌పై దండయాత్ర ఆలోచనపై సీనియర్ సైనిక అధికారులు అంత నమ్మకంతో లేరని వార్తలు వెల్లడిస్తున్నాయి. గ్రీన్‌లాండ్స్ ప్రాంతాన్ని రష్యా,చైనా దేశాలు తమ అధీనంలోకి తీసుకోకముందుగానే రాజకీయ సలహాదారుడు స్టీఫెన్ మిల్లర్ నాయకత్వంలో ప్రపంచంలో అతిపెద్దదైన ఆ దీవిని తామే స్వాధీనం చేసుకోవాలని ట్రంప్ చాలా ఆత్రుత ప్రదర్శిస్తున్నారని 'దమెయిల్' పత్రిక ఒక కథనం ప్రచురించింది. అదే విధంగా దండయాత్ర చేసేందుకు జాయింట్ స్పెషల్ ఆపరేషన్స్‌కమాండర్ (జెఎస్ఓసి)కు ఆదేశాలు కూడా ఇచ్చినట్లు తెలియజేసింది. కొత్త సంవత్సరంలో మూడోరోజునే వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురోను చాలా విజయవంతంగా న్యూయార్క్‌కు కిడ్నాప్ చేసి తీసుకుపోయిన విజయగర్వంతో ఉన్న ట్రంప్ ఆ మరుక్షణం నుండి గ్రీన్‌లాండ్ స్వాధీనం గురించి తరచు కలవరిస్తున్నారు. వైట్‌హౌస్‌లో గడచిన శుక్రవారం వెనిజులాలో పెట్టుబడులకు సంబంధించి చమురు రంగం ఎగ్జిక్యూటివ్‌లతో జరిగిన సమావేశంలో ట్రంప్ మాట్లాడుతూ, ఎవరికి నచ్చినా నచ్చకపోయినా గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకోవడానికి తాము ఏదో ఒకటి చేయబోతున్నామని, ఎందుకంటే చైనా, రష్యా కంటే ముందుగానే ఆ ప్రాంతం తమ అధీనంలోకి రావాలని అన్నారు. రష్యా లేదా చైనాలను పొరుగు దేశంగా గుర్తించి సహజీవనం చేయడానికి అమెరికా సిద్ధంగా లేదని, దానిని సహించేది లేదని ఆయన అన్నారు. ''డెన్మార్ భయాందోళన గురించి కూడా ఆయన ప్రస్తావిస్తూ, ''మీకు (డెన్మార్క్‌కు) నేను చాలా పెద్ద అభిమానిని, మీకు చెప్పాల్సింది ఏమిటంటే, మీకు తెలుసా, డెన్మార్క్, గ్రీన్‌లాండ్ ప్రజలు నాతో చాలా మంచిగా ఉంటారు, 500 సంవత్సరాలక్రితం మీరు అక్కడ పడవ దిగి వెళ్ళి మనుగడ ప్రారంభించారంటే, ఆ భూభాగం మీదని కాదు'' అన్నారు. ముఖ్యంగా 1951 ఒప్పందం ప్రకారం అక్కడ సైనిక ఉనికి ఉన్నప్పటికీ, ఆ దీవిలో నివసిస్తున్న 57,000 మంది ప్రజల ఉనికి గురించి ట్రంప్ ముఖ్యంగా మాట్లాడుతున్నారు.

# ట్రంప్‌కు బహుమతి బదిలీకి నోబెల్ కమిటీ తిరస్కృతి



**వాషింగ్టన్ :** తనకు లభించిన నోబెల్ బహుమతిని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు షేర్ చేస్తానని వెనిజులా ప్రతిపక్ష నాయకురాలు, శాంతి బహుమతి గ్రహీత–2025 మారియా కొరినా మచాడో చేసిన ప్రకటనను నోబెల్ కమిటీ తిరస్కరించింది. ఈ విధంగా ఒకరికి వచ్చిన నోబెల్ బహుమతిని మరొకరికి షేర్ చేయడం సాధ్యంకాని విషయమని, అందుకు అంగీకారం లేదని నోబెల్ కమిటీ స్పష్టం చేసింది. ఒకసారి నోబెల్ బహుమతిని ఒకరికి ఇచ్చిన తర్వాత దానిని రద్దు చేయడం లేదా బదిలీ చేయడం లేదా మరొకరికి పంచి ఇవ్వడం సాధ్యంకాని విషయమని నోబెల్ కమిటీ స్పష్టం చేసింది. తాము తీసుకున్న నిర్ణయమే తుది నిర్ణయమని, అది ఎప్పటికీ అమలులో ఉంటుందని తెలియజేసింది. వెనిజులా ప్రతిపక్ష నాయకురాలు మచాడో భద్రతా కారణాల రీత్యా వెనిజులా నుండి వెళ్ళిపోయి మరోదేశంలో తలదాచుకుంటున్నారు. ఇటీవల నికొలస్ మదురోను కిడ్నాప్ చేయడాన్ని ఆమె సమర్థించారు. తాను తిరిగి వెనిజులాకు త్వరలో వెళతానన్నారు. వచ్చేవారంలో ఆమె అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌తో వైట్‌హౌస్‌లో సమావేశం కానున్నారు.

# అమెరికాలో వేలాది మంది నిరసన ప్రదర్శన



**మిన్నెపొలిస్ :** అమెరికా మిన్నెపొలిస్‌లో వరుసగా రెండోరోజు ఆదివారం కూడా వేలాదిమంది నిరసన ప్రదర్శనలు జరిపారు. అమెరికా వ్యాప్తంగా అనేక ప్రాంతాలలో కూడా ఈ ప్రదర్శనలు జరిగాయి. గడచిన బుధవారం (జనవరి 7) మిన్నెపొలిస్‌లో ఐసిఇ (ఇమ్మిగ్రేషన్,కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్) భద్రతా ఏజంట్ కారులో ఉన్న ఒక మహిళను అతి సమీపం నుండి కాల్చి చంపిన సంఘటనకు వ్యతిరేకంగా ఈ నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయి. భరించలేనంతగా చలి వాతావరణం ఉన్నప్పటికీ వేలాదిమంది ప్రజలు వీధుల్లోకి వచ్చారు. ఆస్టిన్, సీటెల్, మిన్నెపోలిస్, లాస్‌ఏంజెల్స్, న్యూయార్క్ సహా అమెరికాలోని ఇతర ప్రాంతాలలో కూడా ఈ నిరసన ప్రదర్శనలు జరిగాయి. గట్టి మంచు గడ్డలను కొందరు పోలీసులపైకి విసిరారు. దీంతో ఒక అధికారి గాయపడ్డారు. మిన్నెపొలిస్ కానోపీ హోటల్ వద్ద వందలమంది గుమిగూడారు. వారంతా డ్రమ్స్ వాయిస్తూ, ఈలలు మోగిస్తూ నిరసనలు తెలియజేశారు. పోలీసులు వారిని చట్టవిరుద్ధమైన గుంపుగా ప్రకటించింది. కానీ అనేకమంది పోలీసులకు దొరక్కుండా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మిన్నెపొలిస్ మేయర్ జాకబ్ ఫ్రే పత్రికాగోష్ఠిలో మాట్లాడుతూ, ఈ విధంగా వేలాదిమంది వీధుల్లోకి వచ్చిన నిరసన ప్రదర్శనల్లో పాల్గొనడంపట్ల హర్షం ప్రకటించారు. చాలా శాంతియుత పద్ధతులలో నిరసన ప్రదర్శనలు జరిగాయన్నారు.

అమెరికా కాంగ్రెస్‌లో డెమొక్రటిక్ పార్టీకి చెందిన మహిళా సభ్యులు ఇల్హాన్ ఒమర్, కెల్లీ మోరిసన్, అంగీ క్రెయిగ్ మాట్లాడుతూ, చట్టసభ్యులుగా తాము మిన్నెపొలిస్‌లో పర్యవేక్షణ కార్యక్రమం నిర్వహించకుండా హోంలాండ్ సెక్యూరిటీ, ఐసిఇ అధికారులు అడ్డుకున్నారని ఆరోపించారు. పోలీసుల పట్ల దుందుడుకు దాడియత్నాలకు పాల్పడిన నిరసన ప్రదర్శకులలో 30 మందిని గడచిన రెండు రోజులుగా అరెస్టు చేశారు. వలస ప్రజల ఏరివేత చర్యల్లో భాగంగా ఐసిఇ ఏజంట్లు మిన్నెపొలిస్‌లో దాడులు చేశారు. ఈ సందర్భంగా ఒక మహిళ కారులో వెళుతుండగా, ఐసిఇ ఏజంటు విజ్ఞప్తికి స్పందించకపోవడంతో ఆమెకారుపై కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో రెనీ నికోల్ గుడ్ (37) మరణించారు. ఆత్మరక్షణకోసమే ఆ అధికారి మహిళపై కాల్పులు జరిపారని ట్రంప్ పాలనాయంత్రాంగం సమర్థించింది.

# గ్రీన్‌లాండ్‌లో యూరోపియన్ యూనియన్ సైన్యం!



గ్రీన్‌లాండ్‌లో యూరోపియన్ యూనియన్ సైన్యాన్ని మోహరించే ఆలోచనలో ఉంది! ఈ విషయంపై బ్రిటన్ ప్రభుత్వం మిత్రదేశాలతో చర్చలు ప్రారంభించింది. చైనా, రష్యాలు గ్రీన్‌లాండ్‌ను ఆక్రమించుకోకముందుగానే ఆ దీవిలో సైన్యాన్ని మోహరించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పినవిధంగానే ఆయనకు ఊరట కలిగించేందుకు యూ రోపియన్ యూనియన్ సేనలను మోహరించుకుని కూర్చోవాలని భావిస్తున్నట్లు కనిపిస్తోందని విశ్లేషకులు ఈ పరిణామాలను అంచనావేశారు. ఇటీవల బ్రిటన్ అధికారులు యూరప్‌లో జర్మనీ, ఫ్రాన్స్ సహా ముఖ్యమైన మిత్రదేశాలతో సమావేశాలు జరిపారు. ఈ మేరకు రష్యా–చైనాలు దుస్సాహసం చేయకుండా మిత్రసేనల సైన్యాలు, యుద్ధనౌకలు,యుద్ధ విమానాలను తరలిస్తారని అంచనావేస్తున్నారు. బ్రిటన్ తన ప్రయత్నాలు కొనసాగిస్తుందని సంబంధిత వర్గాలు తెలిపాయి.

# దెబ్బకు దెబ్బ తీస్తాం

**(మొదటి పేజీ తరువాయి)**

ప్రయత్నిస్తున్నారని, గతంలో లేనివిధంగా ఇరాన్ ప్రజలు స్వేచ్ఛకోసం పోరాడుతున్నారని, వారికి మద్దతు ఇస్తామని ట్రంప్ చేసిన ప్రకటనకు క్వాలిబాఫ్ పైవిధంగా హెచ్చరించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా 15 రోజులుగా కొనసాగుతున్న హింసాత్మక ప్రదర్శనలు, ధరల పెరుగుదల, కరెన్సీ విలువ క్షీణత, వ్యవస్థను కుప్పకూల్చేందుకు సిఐఎ రహస్య కార్యకలాపాలు, అమెరికా ప్రత్యక్ష హెచ్చరికలపై ఇరాన్ పార్లమెంటు ఆదివారం చర్చించింది. స్పీకర్ మహ్మద్ బాకర్ క్వాలిబాఫ్ సభలో మాట్లాడుతూ, దాడియత్నాలు చేస్తే పశ్చిమ ఆసియాలో ఉన్న అమెరికా సైనిక స్థావరాలను, ఇజ్రాయెల్ సైనిక కేంద్రాలను దెబ్బతీస్తామన్నారు. ఇరాన్‌పై సైనిక చర్యలకు పాల్పడినా లేదా ప్రాంతాలను ఆక్రమించినా అమెరికా సైన్యాన్ని, నావికాదళ కేంద్రాలను చట్టబద్ధమైన దాడులకు లక్ష్యాలుగా ఎంచుకుంటామని హెచ్చరించారు. ''ఇరాన్‌లో హింసాకాండకు పాల్పడి, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసేవారికి ఉరిశిక్ష విధిస్తామని స్పష్టం చేశారు. దేశ ఆస్తులను, మౌలిక సదుపాయాలను సంరక్షించడానికి తీవ్ర అణచివేతకు, నిర్ణయాత్మకమైన చర్యలకు సిద్ధంగా ఉందని రివల్యూషనరీ ఆర్మీ కూడా ఒక హెచ్చరిక చేసింది. ఇరాన్‌లో రెండు వారాలుగా 115 మంది పైగా మరణించినట్లు చెబుతున్నప్పటికీ ఆసుపత్రివైద్యులు చెబుతున్న అనధికార సమాచారం ప్రకారం మృతులసంఖ్య 200కు పైగా ఉంది.

ఇరాన్‌పై దాడి చేసే విషయంపై గడచిన శనివారం అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో,ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ ఫోన్‌లో సంభాషణలు చేసిన తర్వాత పరిస్థితులు తారాస్థాయికి చేరాయి. ఇరాన్‌లో మరోసారి అమెరికా సైనికంగా జోక్యం చేసుకుంటుందనే ఉద్దేశంతోపాటు ఇరాన్‌లో దశాబ్దాలలో ఎన్నడూలేనంత తీవ్ర హింసాకాండ జరుగుతున్నందువల్ల ముందు జాగ్రత్త చర్యగా ఇజ్రాయెల్ తన సైన్యాలను హై ఎలర్ట్‌లో ఉంచి జాగ్రత్తలు తీసుకున్నట్లు ఆ ప్రభుత్వాన్ని ఉటంకిస్తూ రాయిటర్స్ వార్తాసంస్థ పేర్కొంది. ఇరాన్ ప్రజలు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, భవిష్యత్తుకోసం కీలకమైన పోరాటం చేస్తున్నారని ఇజ్రాయెల్ వ్యాఖ్యానించింది.

2022–23లో మాషా అమిని లాకప్ డెత్ తర్వాత ఆర్థిక సంక్షోభాన్ని తట్టుకోలేక ఇరాన్‌దేశ వ్యాప్తంగా అనేక రోజులపాటు హింసాత్మక ప్రదర్శనలు, తీవ్ర ఘర్షణలు,ప్రజాహింస చెలరేగడం ఇరాన్‌లో మళ్ళీ ఇదే. ఇరాన్‌లో డిసెంబరు 28న ప్రారంభమైన అల్లర్లు కొత్త ప్రాంతాలకు విస్తరించి కొనసాగుతున్నాయి. గడచిన 50 గంటలుగా ఇరాన్‌లో ఇంటర్నెట్ సదుపాయాన్ని రద్దుచేసి సమాచార ప్రచారం జరగకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంది. కొందరు ఉగ్రవాదులు అమెరికాను సంతృప్తిపరచడంకోసం సాయుధ ఉగ్రవాదులు హింసకు పాల్పడుతున్నారని ఇరాన్ సర్వాధినేత ఆయతొల్లా అలీ ఖమేనీ విమర్శించారు. ఐక్యరాజ్యసమితి భద్రతామండలికి కూడా ఇరాన్ ఫిర్యాదు చేసింది. ఐక్యరాజ్యసమితిలో ఇరాన్ దేశ రాయబారి అమీర్ సయీద్ ఇరవానీ భద్రతామండలికి రాసిన లేఖలో అమెరికా బెదిరింపు ధోరణి ప్రపంచదేశాలకు ప్రమాదంగా మారిందని,ఇజ్రాయెల్‌తో కలిసి హింసను ప్రేరేపిస్తోందని పేర్కొన్నారు.

కాగా తండ్రి మరణానంతరం తనను తాను ఇరాన్ యువరాజుగా ప్రకటించుకున్న రెజ్లా పహ్లవీ (60) అమెరికా మద్దతుతో ఇరాన్‌కు తిరిగివెళ్ళే ప్రయత్నాల్లో ఉన్నారు. ఖొమైనీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరగబడాలని ఇప్పటికే ఆయన అనేకసార్లు ప్రజలకు పిలుపు ఇచ్చారు.

### ఇరాన్‌లోని 100 నగరాలు, టౌన్లలో కొనసాగుతున్న హింస

ఇరాన్‌లో సైన్యం ఎన్ని హెచ్చరికలు చేసినప్పటికీ ఆదివారం 15వ రోజు కూడా వీధుల్లో ప్రజా ప్రదర్శనలు కొనసాగుతున్నాయి. ఇంటర్నెట్ సర్వీసులను ప్రభుత్వం 50 గంటలుపైగా స్తంభింపజేసినప్పటికీ కొందరు స్టార్‌లింక్ సేవలను ఉపయోగించుకుంటున్నారు. ఇరాన్‌లోని అన్ని రాష్ట్రాలలో 100 నగరాలు, పట్టణాలలో ప్రజా నిరసనలు కొనసాగుతున్నాయి. శనివారం రాత్రి పొద్దుపోయిన తర్వాత ప్రభుత్వం తీవ్రస్థాయిలో ప్రదర్శకులపై ఉక్కుపాదం మోపిందని, ప్రభుత్వ చర్యల్లో వందలమంది మరణించారని వార్తలు వెలువడుతున్నాయి. ఇరాన్ అటార్నీ జనరల్ కూడా తాజా హెచ్చరిక చేస్తూ, నిరసనలకు పాల్పడినవారిని దైవశత్రువులుగా భావించి మరణశిక్షలు విధిస్తామని ప్రకటించారు. గడచిన మూడు రోజులుగా భద్రతా దళాలు, రివల్యూషనరీ గార్డ్స్‌కు ప్రదర్శకులకు మధ్య ఘర్షణలు ఉద్ధృతరూపం దాల్చాయి. ఈ ఘర్షణల్లో అనేక మంది మరణించారు. 15 మంది భద్రతా సిబ్బంది, మరో 100 మంది ప్రజలు ప్రజాందోళనలో మరణించినట్లు అమెరికా కేంద్రంగా పనిచేస్తున్న ఇరాన్‌లోని మానవహక్కుల సంఘం (హెచ్ఆర్ఎఎన్ఎ) ప్రకటించింది. రసాత్ సిటీ ఆసుపత్రికి శుక్రవారం రాత్రి 75 మృతదేహాలను తీసుకువచ్చిపెట్టారని వీడియోలు వెరిఫై చేసిన బిబిసి ప్రతినిధి ప్రకటించారు.

# మహానగరం ఖాళీ

**(మొదటి పేజీ తరువాయి)**

లేకపోవడం నగరవాసులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

### పండుగ నిశ్శబ్దాన్ని ఆస్వాదిస్తున్న పట్నం..

సంక్రాంతి అంటే పల్లెల పండుగ. కుటుంబ సభ్యులతో కలిసి భోగి మంటలు, కనుమ సంబరాలు, గ్రామీణ వాతావరణాన్ని ఆస్వాదించేందుకు హైదరాబాద్‌లో నివసించే వారు పెద్ద ఎత్తున గ్రామాల బాట పట్టారు. ఈ ప్రభావంతో బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు గత కొన్ని రోజులుగా కిక్కిరిసిపోయాయి. ఇక నగరంలో మాత్రం వ్యతిరేక దృశ్యం కనిపిస్తోంది. ఐటీ సంస్థలకు వారంతాపు సెలవులు, విద్యాసంస్థలకు సెలవులు ఉండటంతో హాస్టళ్లు, పిజిలు ఖాళీ అయ్యాయి. సాధారణంగా రద్దీగా ఉండే ఫుడ్ పాయింట్లు, టీ స్టాల్స్ కూడా కస్టమర్ల కోసం ఎదురుచూస్తున్న పరిస్థితి నెలకొంది. నిత్యం ట్రాఫిక్ జామ్‌లతో సతమతమయ్యే ట్రాఫిక్ పోలీసులకు మాత్రం ఇది ఊరట కలిగించే పరిణామం. ప్రత్యేక ఏర్పాట్లు చేసినా, వాహనాల రాకపోకలు తక్కువగా ఉండటంతో విధులు సులభంగా మారాయి. సంక్రాంతి సంబరాలు ముగిసిన అనంతరం నగరం మళ్లీ తన అసలు రూపాన్ని సంతరించుకోనుంది. ప్రస్తుతం మాత్రం పల్లె సంబరాల ప్రభావంతో హైదరాబాద్ నగరం పండుగ నిశ్శబ్దాన్ని ఆస్వాదిస్తోంది.

### కిటకిటలాడుతున్న రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు..

పట్నం వాసులు తమ సొంతూళ్లకు పయనమయ్యేందుకు బయలుదేరడంతో బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. సంక్రాంతి నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని టిజిఎస్ఆర్‌టిసి 6,431, ఎపిఎస్ఆర్‌టిసి 600 ప్రత్యేక బస్సులను నడుపుతుంది. అలాగే సౌత్ సెంట్రల్ రైల్వే కూడా అదనపు ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసింది. కానీ, అవి కూడా సరిపోక ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్సులు వచ్చిన క్షణాల్లోనే నిండిపోవడంతో సీట్ల కోసం యుద్ధమే చేయవలసి వస్తుందని ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇదే అదునుగా ప్రైవేట్ ట్రావెల్స్ ఇష్టారీతినా చార్జీలు వసూలు చేస్తున్నారని పేర్కొంటున్నారు. రద్దీని దృష్టిలో పెట్టుకొని అదనపు బస్సులు నడపాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

### విమాన టికెట్ల ధరలకు రెక్కలు..

ప్రయాణికుల రద్దీని చూసి విమానయాన సంస్థలూ ఈ నెల 11 నుంచి 14 వరకు టికెట్ ధరలను ఒక్కసారిగా మూడింతలు పెంచేశాయి. ముఖ్యంగా శంషాబాద్ విమానాశ్రయం నుంచి విజయవాడ, విశాఖ, తిరుపతికి వెళ్లే విమానాల టికెట్ల ధరలు భారీగా పెరిగాయి. సాధారణ రోజుల్లో విజయవాడ, వైజాగ్‌లకు రూ. 2,500 నుంచి రూ. 3,500 మధ్య ఉంటుండగా, ఆదివారం ధర రూ. 9వేలు ఉంది. తిరుగు ప్రయాణంలోనూ ఇదే తరహాలో రేట్లు కనిపిస్తున్నాయి.

### ఎగ్జిట్ పాయింట్ల వద్ద ట్రాఫిక్ నరకం..

హైదరాబాద్ నుంచి బయటకు వెళ్లే ఎగ్జిట్ పాయింట్ల వద్ద ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. ముఖ్యంగా విజయవాడ వైపు వెళ్లే పంతంగి టోల్ ప్లాజా, వరంగల్ వైపు వెళ్లే రహదారులపై కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ప్రయాణికులు తమ ప్రయాణ సమయాన్ని ముందుగానే ప్లాన్ చేసుకోవాలని, ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

# 18 మంది అరెస్ట్

**(మొదటి పేజీ తరువాయి)**

వివిఎం బంజర పోలీసులు ఈ కేసులో ఇప్పటివరకు 18మందిని అరెస్టు చేయడం జరిగిందని అలాగే మరో ఆరుగురు పరారీలో ఉన్నారని, వీరి ద్వారా సుమారు 547 కోట్ల రూపాయలు సైబర్ నేరాలకు పారిపోయినట్లు గుర్తించడం జరిగిందని సిపి తెలిపారు. నిందితులలో ప్రధానంగా పోత్రు కళ్యాణ్ 114.18 కోట్లు, మోడ సతీష్ 135.48 కోట్లు, మోడ భాను ప్రియ 40.21 కోట్లు, ఉడతనేని వికాస్ చౌదరి 80.41 కోట్లు, కిన్నెర నరసింహ 92.54 కోట్లు రూపాయలను కాజేసినట్లు గుర్తించినట్లు తెలిపారు. పైన పేర్కొన్న నిందితులు మరో ఆరుగురు ఏజెంట్ల నియమించుకొని 350 అకౌంట్లు తెరిపించి వీరి ద్వారా సైబర్ క్రైమ్ సొత్తును తమ తమ అకౌం ట్లో మళ్ళించుకున్నట్లు తెలిపారు. ఈ సొత్తును మరో పదకొండు మంది అమాయకులను నమ్మించి బ్యాంకు అకౌంట్ తెరిపించి వారి అకౌంట్లో ద్వారా డబ్బులు కాజేసినట్లు గుర్తించినట్లు తెలిపారు. మొత్తం 24 మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్నారు. వీరిలో గతంలో ఆరుగురిని మరో 12 మందిని ఆదివారం అరెస్టు చేసినట్లు సిపి వివరించారు. నిందితులను 24 మందిలో 23 మంది సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని వారు ఉండటంతో ఈ కేసును పూర్తిగా క్షుణ్ణంగా దర్యాప్తు జరుగుతున్నట్లు వివరించారు. నిందితులపై దేశంలోని 10 రాష్ట్రాలలో 100కు పైగా సేవక్ క్రిమినల్ కేసులు ఉన్నాయని అలాగే వేరే దేశాలు అయినా కాంబోడియా, ఆస్ట్రేలియా లాంటి అంతర్జాతీయ సైబర్ క్రైమ్ నిరసనతో జతకట్టి విదేశాలలో కాల్ సెంటర్లు నిర్వహిస్తూ వాటి ద్వారా భారతదేశంలోని పౌరులకు పెట్టుబడి పెట్టి మ్యాట్రిమోనీ, రివార్డు పాయింట్లు, గేమింగ్ బెట్టింగు, షేర్ మార్కెట్లు పెట్టుబడులు కరెన్సీ ట్రేడింగ్ పేరుతో మోసాలకు పాల్పడినారని సిపి వివరించారు. విచారణ ద్వారా రూ.547 కోట్లు కాజేసినట్లు గుర్తించామనో, నేరస్తులు వాడిన బ్యాంక్ అకౌంట్ లను నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ దాహాతో పరిశీలించి నప్పుడు బ్యాంక్ అకౌంట్‌లో పైన దేశ వ్యాప్తంగా అప్పల రాష్ట్రాలలో వందల సంఖ్యలో సేవా ఫిర్యాదులు ఉన్నట్లు తెలిపారు. సైబర్ క్రైమ్ ద్వారా సంపాదించిన ఆస్తులను జప్తు చేయడం జరుగుతుందని కేసు విచారణలో వెలుగు చూసిన విషయాలను సైబర్ క్రైమ్ సంబంధించిన దర్యాప్తు సంస్థలకు అప్పగించడం జరుగుతుందని సిపి సునీల్ దత్ తెలిపారు. సత్తుపల్లి నియోజకవర్గంలో ఈ సైబర్ క్రైమ్ నిందితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, తెలియని వ్యక్తులకు ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్‌లో ఇవ్వరాదని, మనీ ఆశ చూపిస్తే ఎవరు ప్రలోభాలకు గురి కావద్దని, నిందితులతో పాటు కేసులో బాధితులు కూడా నేరం చూపినట్లు అవుతుందని తెలిపారు. అలాగే నియోజకవర్గంలో కోడిపందాలు, పేకాటలపై పూర్తిగా నిషేధించినట్లు ఎవరైనా అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఎటువంటి జూద క్రీడలు ఆడిన శిక్షిస్తామని సిపి హెచ్చరించారు. ఈ సమావేశంలో కల్లూరు ఏసిపి వసుంధర యాదవ్, సిఐ ముత్తు లింగంతో పాటు పలువు ఎస్సైలు, ఏఎస్ఐలు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# ఆధునిక పరిజ్ఞానం

**(మొదటి పేజీ తరువాయి)**

సమీక్ష నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఎస్ఎల్‌బిసి పనుల పురోగతిపైన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆదివారం సమీక్ష నిర్వహించారు.ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్,నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. తొలగించిన టిబిఎం స్థానంలో అత్యాధునిక పద్ధతిలో టన్నెల్ తవ్వకాలు జరపనున్నారని, మిగిలిన సొరంగ మార్గం 9.8 కిలోమీటర్ల పరిస్థితులపై సమాచారం అందించే ఎలక్ట్రో మాగ్నటిక్ సర్వే పూర్తయినట్టు అధికారులు ఉత్తమ్ కుమార్ రెడ్డికి వివరించారు. భూగర్భ పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేసే విధంగా సపోర్ట్ సిస్టం కూడా ఏర్పాటు చేసినట్లు అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చినట్టు తెలిసింది. ప్రపంచంలోనే అతి పొడవైన సొరంగ మార్గం ఎస్ఎల్‌బిసిని పూర్తి చేయడాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని మంత్రి తెలిపారు. గత బిఆర్ఎస్ పదేళ్ల పాలన వల్లనే పనులల్లో ఆలస్యం జరిగిందని ఆరోపించారు. ప్రపంచంలోనే అతి పొడవైన సొరంగ మార్గం ఎస్ఎల్‌బిసిని పూర్తి చేయడాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని ఉత్తమ్ వివరించారు.

# ఇందిరమ్మ నిధులు

**(మొదటి పేజీ తరువాయి)**

6 కిలోల చొప్పున ప్రతినెల ఉచితంగా సన్న బియ్యం పంపిణి చేస్తున్నామన్నారు. రూ.8,600 కోట్లు ఖర్చు చేసి మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం కల్పించామన్నారు. రామగుండం పట్టణంలో 800 మె.వా. నూతన థర్మల్ విద్యుత్తు ప్లాంటు నిర్మాణానికి క్యాబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. పాలకుర్తిలో ఎత్తిపోతల పథకం పనులను త్వరలో ప్రారంభిస్తామన్నారు. గత పదేళ్ల కాలంలో రామగుండం ప్రాంతంలో ఏలాంటి పరిశ్రమలు, ప్రాజెక్టులను బీఆర్ఎస్ పాలకులు తీసుకురాలేదని విమర్శించారు. జెన్‌కో, డిస్కంలు, సింగరేణి కార్మికులకు కోటి రూపాయల ప్రమాద బీమా అమలు చేస్తున్నామని, అదే విధంగా రాష్ట్రంలోని 5 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులకు కూడ కోటి రూపాయల ప్రభుత్వ బీమా అమలు చేయనున్నట్లు చెప్పారు. సింగరేణి సంస్థను అన్నివిధాల కాపాడుకుంటామన్నారు. తన ఇంట్లో న్యాయం చేయనోడు ప్రజలకు ఏమి చేస్తాడని మాజీ సిఎం కెసిఆర్‌ను ఉద్దేశించి డిప్యూటి సీఎం అన్నారు. గత పదేళ్ల కాలంలో బిఆర్ఎస్ పాలనలో స్కాములు, దోపిడీలు తప్ప పేద ప్రజలకు చేసింది ఏమి లేదని ఈ విషయమై ప్రజలు కూడ ఆలోచన చేయాలన్నారు. ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ నిత్యం అభివృద్ధి కోసం పాటుపడ్తున్నారని, రాష్ట్ర మంత్రులపై ఒత్తిడి పెంచుతూ రామగుండం నియోజకవర్గానికి అవసరమైన పనులను చేయించుకుంటున్నారని, పట్టుబట్టి తనను ఈ పర్యటనకు రప్పించారంటూ మక్కన్‌సింగ్‌ను ఆయన ప్రశంసించారు.

### సింగరేణి స్థలాలకు త్వరలో పట్టాలు : మంత్రి పొంగులేటి

ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి మాట నెరవేరుస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహ, సమాచార, పౌరసంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, నూతన రేషన్ కార్డులు పంపిణి చేశామన్నారు. మొదటి విడతగా 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామన్నారు. రాబోయే మూడేళ్లలో 3విడతలుగా ఇండ్లు ఇస్తామన్నారు. గత ప్రభుత్వం ఎంపిక చేసిన లబ్ధిదారులకే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అందిస్తున్నామన్నారు. రామగుండంలో మరో 300 ఇండ్లకు లబ్ధిదారులను ఎంపిక చేస్తే నిధులు కేటాయించి పనులు పూర్తి చేయించి అందజేస్తామన్నారు. రామగుండం నగరపాలికలో మరో తహసీల్దార్‌ను నియమించేందుకు క్యాబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. వైఎస్సార్ జారీ చేసిన 76 ఉత్తర్వులను నేడు మరొసారి అమలు చేసి అర్హులైన వారికి సింగరేణి స్థలాల్లో ఇంటి పట్టాలు అందజేస్తామన్నారు.

### బాధితులకు అండగా ఉంటా, న్యాయం చేస్తా : మంత్రి శ్రీధర్‌బాబు

రామగుండంలో వాణిజ్య, వ్యాపార సంస్థలు అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో రోడ్డు విస్తరణ చేపడ్తున్నామని, ఇండ్లు, దుకాణాలు కోల్పోయిన బాధితులకు న్యాయం చేస్తామని, అందరికి స్థలాలు, పరిహారం, ఉపాధి అందేలా చూస్తామని రాష్ట్ర ఐ.టి., పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ నిత్యం అభివృద్ధి కోసం పాటుపడ్తున్నారన్నారు. రామగుండం నియోజకవర్గంలో రూ.600 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలోగా వేచి ఉండకుండా అర్హులందరికి ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. ఈ ప్రాంతంలోని ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు ఇస్తామన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.

### జర్నలిస్టులకు సొంతిల్లు నిర్మిస్తాం : మంత్రి కొండా సురేఖ

జర్నలిస్టులకు సొంతిల్లు నిర్మించి ఇస్తామని, గతంలో కెసీఆర్ మోసం చేశారని, మన ప్రజా ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పనిచేసే ప్రతి అర్హులైన జర్నలిస్టులకు సొంత ఇండ్లు మంజూరు చేస్తుందని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవదాయ, ధర్మదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. రాష్ట్రంలోనే మొట్ట మొదటి సారిగా ట్రాన్స్‌జెండర్లకు ఇంటి నివాస స్థలాలు మంజూరు చేసి రామగుండంలో పట్టాలు అందజేసినట్లు తెలిపారు. రామగుండం నియోజకవర్గంలోని దేవాలయాల అభివృద్ధికి రూ.3 కోట్లు మంజూరు చేస్తామని, ముఖ్యమంత్రి ఎస్.డి.ఎఫ్. నుంచి మరిన్ని నిధుల మంజూరుకు ప్రయత్నిస్తామన్నారు.

### సింగరేణి కార్మికుల పరిష్కారానికి కృషి : మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

సింగరేణి మెడికల్ బోర్డు నుంచి కార్మికులకు ఎదురౌతున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ, దివ్యాంగుల సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కోరారు. స్థానికంగా ఎస్.సి. గురుకుల రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు పంపాలన్నారు. తాను చదువుకున్న స్థానిక జూనియర్ కళాశాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలన్నారు. రామగుండం నియోజకవర్గం అభివృద్ధికి ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ చిత్తశుద్ధితో పని చేస్తున్నారన్నారు.

# శ్రమకు తగ్గ ఫలితం రావాలని సిపిఐ పోరాటం

కార్మికుల హక్కులు సాధించడంలో సిపిఐ కీలకపాత్ర

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి




**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** స్వేచ్ఛ, హక్కు, స్వాతంత్రం కావాలని ఎఐటియుసిచే అనేక కార్మిక సంఘాలు స్థాపించి ప్రజలను చైతన్యపరిచి జమీందార్ జాగిర్ధర్ పాలన అంతం కావాలని, శ్రమకు తగ్గ ఫలితం రావాలని సిపిఐ పోరాటం చేసిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి అన్నారు. సిపిఐ శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని సిరిసిల్ల కొత్త బస్టాండ్ నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు సిపిఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్ అధ్యక్షతన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఎఐటియుసి ద్వారా అనేక పోరాటాలు చేసి 29 చట్టాలను సాధించుకుంటే కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం నాలుగు కోడ్‌లుగా విభజించి చట్టాలను నిర్వీర్యం చేసిందని అన్నారు. సిపిఐ వందేళ్ళ కాలంలో రాజపాలన రద్దు, బ్యాంకుల జాతీయ కరణ, పేదలకు లక్షల ఎకరాల భూమి పంపిణీ, కార్మికులకు చట్టాలు సాధించి రైతులకు పోడు భూములను పంచిందన్నారు. శ్రమకు తగ్గ ఫలితం, ఉపాధి హామీ , సమాచార హక్కు చట్టం ఇవన్నీ సాధించడంలో సిపిఐ తల్లి పార్టీగా ప్రజల పక్షాన ఉండి అనేక పోరాటాలు చేస్తుందన్నారు. అధికారం లేకున్నా ప్రజల పక్షపాతిగా అసమానతలు లేని సమాజం కోసం పోరాడుతుందన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని జి రామ్ జి చట్టంగా మార్చడం దుర్మార్గమన్నారు. 100 కేంద్ర ప్రభుత్వ నిధుల్లో 40 శాతం రాష్ట్రం భరించాలనడం ముమ్మాటికీ సరైనది కాదని, ఈ పథకం రద్దు అవుతుందన్నారు. పేరు మార్చడానికి గాంధీ ఏం పాపం చేశారన్నారు. కార్మికుల హక్కులను కాలరాస్తూ ప్రభుత్వ రంగ సంస్థల ఆస్తులను ధ్వంసం చేస్తూ కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను అప్పజెప్పుతున్నారని, అవినీతిని ప్రోత్సహిస్తూ పన్నులను అడ్డగోలుగా వసూలు చేస్తున్నారని విమర్శించారు. పెట్రోల్, డీజిల్ సిలిండర్ ధరలు పెరిగాయి అంటే మీ ప్రభుత్వమే అని మండిపడ్డారు. మోదీ ప్రభుత్వం మతోన్మాద, నియంతృత్వ ఫాసిస్టు వ్యతిరేక చర్యలకు పూనుకుంటుందని మండిపడ్డారు. రాబోయే కాలంలో ఎర్రజెండా పార్టీలు ఏకం కావాలన్నారు. ఎర్ర జెండా పార్టీలు ఒక వేదిక మీదికి రావాలని జనవరి 18న సిపిఐ 100 సంవత్సరాల ముగింపు ఉత్సవాలను ఖమ్మంలో నిర్వహిస్తున్నామని, ఎర్రజెండా పార్టీలు ఏకమై ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేని శంకర్, సిపిఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్, పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, జిల్లా కార్యవర్గ సభ్యులు కడారి రాములు, గుంటి వేణు, పంతం రవి, అజ్జ వేణు, అనసూర్య, కుర్ర రాకేష్, మంద అనిల్, మీసం లక్ష్మణ్, సోమనాగరాజు, మంత్రి చంద్రయ్య, కార్మిక సంఘాల నాయకులు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# సంస్కృతి, సంప్రదాయాలపై దాడులను తిప్పికొట్టాలి



సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు

వరంగల్‌లో సిపిఐ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

**ప్రజాపక్షం/వరంగల్ :** దేశ సంస్కృతి, సాంప్రదాయాలపై మతోన్మాద విష సంస్కృతిని ఎదిరించాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు అన్నారు. ఆదివారం వరంగల్ శివ నగర్‌లోని సిపిఐ జిల్లా కార్యాలయం తమ్మెర భవన్ ఎదుట ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీలలో గెలుపొందిన విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు పోటీలలో పాల్గొన్న మహిళలందరికీ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ మహిళలను గౌరవించే సంస్కృతిని పెంపొందించాలని, కార్పొరేట్ శక్తుల కనుసన్నల్లో మహిళలను మార్కెట్ వస్తువులుగా చిత్రీకరిస్తూ మహిళలపై చేస్తున్న దాడులను తిప్పికొట్టాలని అన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత కార్పొరేట్ శక్తుల విష సంస్కృతి పెరిగి మహిళలపై దాడులు నిత్యకృత్యంగా మారాయని అన్నారు. అనాదిగా జరుపుకుంటున్న పండుగలను కూడా బిజెపి తన స్వార్థ రాజకీయాలకు ఉపయోగించుకుంటూ మతం రంగును పులిమే ప్రయత్నం చేస్తున్నదని అన్నారు. ప్రజల విశ్వాసాలపై, నమ్మకాలపై, తీసుకునే ఆహారం, కట్టుకునే బట్టలపై జరుపుతున్న నియంతృత్వ చర్యలను వ్యతిరేకించాలన్నారు. బిజెపి తీసుకుని వస్తున్న మనువాద సంస్కృతికి వ్యతిరేకంగా మహిళలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి మాట్లాడుతూ ప్రభుత్వాల నియంత్రణ లేకపోవడంతో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటాయని, దీంతో మహిళలు పండుగను జరుపుకునే పరిస్థితి కూడా లేదన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలతో పాటు వంట గ్యాస్ ధరను భారీగా పెంచడంతో పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలపై మహిళలు పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య రాష్ట్ర నాయకులు మండ సదాలక్ష్మి, జిల్లా నాయకులు పాలక కవిత, తాళ్లపల్లి రహేలా, సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా, జిల్లా కార్యవర్గ సభ్యులు తోట చంద్రకళ, గన్నారపు రమేష్, గుండె బద్రి, మహిళా సమాఖ్య నగర కార్యదర్శి సుంకరి భవాని, షభానా, అక్బర్ పాషా, లాదెళ్ల శరత్, ఓర్సు రాజు, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

వంద సంవత్సరాల సిపిఐ ఉద్యమ ప్రస్థానం

# నిర్బంధాల నుండే ప్రారంభం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారత దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని డిమాండ్ చేయడంతోనే సిపిఐ నాయకుల పైన కాన్పూర్, మీరట్ కుట్ర కేసులు నమోదు చేసి, జైళ్లలో నిర్బంధించారని సిపిఐ హైదరాబాద్ జిల్లా సమితి కార్యదర్శి స్టాలిన్ తెలిపారు. సిపిఐ శతాబ్ధి ఉత్సవాల ప్రచార జాత కార్యక్రమం సిపిఐ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో రెండవ రోజు ఆదివారం అంబర్‌పేటలోని గోల్నాక లేబర్ అడ్డా, చార్మినార్, సనత్‌నగర్ ప్రాంతాల్లో పర్యటించింది. అనంతరం జాత ముగింపు సభను సికింద్రాబాద్‌లోని తార్నాకలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ వంద సంవత్సరాల సిపిఐ ఉద్యమ ప్రస్థానం నిర్బంధాల నుండే ప్రారంభమైందన్నారు. సిపిఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి కమతం యాదగిరి మాట్లాడుతూ భూస్వామ్య వర్గాలు ప్రజలపై పెత్తనం చేస్తూ, పండించిన పంటలపై అధిక పన్నులను వసూలు చేస్తున్న కాలంలో కమ్యూనిస్టు పార్టీ ప్రజా ఉద్యమాన్ని నిర్మించి, భూస్వాముల కోటలను బద్దలు కొట్టిందని, పేద వర్గాలకు భూములు పంపిణీ చేసిందని వివరించారు. అంబర్‌పేటలో జరిగిన కార్యక్రమంలో సిపిఐ అంబర్‌పేట్ నియోజకవర్గం కార్యదర్శి బి.వెంకటేశం, హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యులు నేర్లకంటి శ్రీకాంత్, అంబర్‌పేట్ నియోజకవర్గ సహాయ కార్యదర్శి కాశన్న, కౌన్సిల్ సభ్యులు కల్యాణ్, లింగస్వామి, శ్రీనివాస్, రాము, రవీందర్, భారతమ్మ శాంతమ్మ రేణుక లక్ష్మి పాల్గొన్నారు. చార్మినార్‌లో జరిగిన కార్యక్రమంలో సిపిఐ చార్మినార్ కార్యదర్శి ఆరుట్ల రాజ్ కుమార్, నాయకులు వినోద్, రోహిత్, జీవన్, తిలక్ దాస్, సనత్ నగర్‌లో జరిగిన కార్యక్రమంలో సనత్‌నగర్ నియోజక వర్గ కార్యదర్శి సలీం ఖాన్, కౌన్సిల్ సభ్యులు సైఫ్ ఖాన్ ,దశరథ్ ఆప్తాబ్, సల్మాన్ పాల్గొన్నారు. కాగా సిపిఐ సికింద్రాబాద్ నియోజకవర్గ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన తార్నాకలో జరిగిన జాగ ముగింపు సభలో సిపిఐ నాయకులు వలివుల్లా ఖాద్రి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉమర్ ఖాన్, సహాయ కార్యదర్శి కొమురెల్లి బాబు,తార్నాక డివిజన్ కార్యదర్శి గౌసలు ఎఐఎస్‌ఎఫ్ ఒయు కార్యదర్శి లెనిన్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# చెక్‌డ్యాంలో నీట మునిగి తల్లి, ఇద్దరు పిల్లలు మృతి

* సిద్దిపేట జిల్లా కస్తూరిపల్లిలో విషాదం






**ప్రజాపక్షం/సిద్దిపేట :** ప్రమాదవశాత్తు చెక్‌డ్యాం నీటిలో మునిగి ముగ్గురు మృతిచెందిన సంఘటన సిద్దిపేట జిల్లా కస్తూరిపల్లిలో చోటుచేసుకుంది. చేపలవేటకు వెళ్లిన చిన్నారులు ప్రమాదవశాత్తు నీటిమునిగిపోతుండగా .. వారికి రక్షించేందుకు వెళ్లిన తల్లి సైతం నీటి మునిగి తనువు చాలించిన విషాదకర ఘటన ఇది. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలావున్నాయి. కస్తూరిపల్లి గ్రామానికి చెందిన మందాల నారాయణరెడ్డి చెందిన వ్యవసాయ క్షేత్రంలో బీహార్ రాష్ట్రానికి చెందిన కూలీలు ఇక్కడే నివాసం వుంటు పనిచేస్తున్నారు. సాయంత్రం సమీపంలోని చెక్‌డ్యాంలో చేపలు పట్టడానికి ముగ్గురు చిన్నారులు వెళ్లారు. చేపలు పట్టే క్రమంలో ప్రమాదవశాత్తు ముంజేయి బీరజ్ (6), కిరణ్ కుమార్ (12)లు నీట మునిగారు. పక్కనే ఉన్న ముంజేయి సోను ఈ విషయాన్ని తన తల్లి ముంజేయి ఉమాదేవి (32)కి చెప్పాడు. అక్కడకు హుటాహుటిన చేరుకున్న ఆమె వారిని రక్షించపోయి నీట మునిగి మృతిచెందింది. ఈ విషయం తెలుసుకున్న సిద్దిపేట రూరల్ సిఐ శ్రీను, ఎస్ఐ సైఫ్ అలీ, సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృత దేహాలను బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ శ్రీను తెలిపారు. కాగా ముంజేయి బీరజ్, ముంజేయి ఉమాదేవి తల్లి కొడుకులు మృతిచెదంటంతో బోరున విలపించారు.

*** తక్షణ సహాయం కింద రూ.20వేల ఆర్థిక సహాయం**

ఘటనపై మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బతుకు దెరువు కోసం వచ్చి దురదృష్టవశాత్తు మృతిచెదటం బాధకరమన్నారు. వారి కుటుంబానికి ప్రగాడ సానుబూతిని వ్యక్తం చేశారు. తక్షణ సహాయం కింద రూ.20వేలు బిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకిషన్‌శర్మ. మండల పార్టీ అధ్యక్షుడు కాముని శ్రీనివాస్, పార్టీ సీనియర్ నేతలు శ్రీహరియాదవ్, వైకుంఠం, సర్పంచ్ స్వామి కలసి అందచేశారు. ప్రమాదవశత్తు మృతిచెందిన బీహారి వలస కుటుంబానికి బిఆర్ఎస్ పక్షాన అండగా ఉంటామన్నారు.

# మేడారం అభివృద్ధిని దేశానికి చాటి చెబుదాం

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా చూస్తాం

అన్ని ఏర్పాట్లు త్వరలో పూర్తి అవుతాయి

ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క




**ప్రజాపక్షం/ములుగు/హనుమకొండ :** ఆసియా ఖండంలోని అతి పెద్దదైన మేడారం జాతరకు దేశంలో లేని విధంగా 20051 కోటి నిధులతో పనులు ప్రారంభించామని, మేడారం ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెబుతామని మేడారం అభివృద్ధి దేశానికే చాటి చెబుతామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం మేడారం జాతరలో జరుగుతున్న అభివృద్ధి పనులను మంత్రులు పరిశీలన చేసి అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆసియా ఖండంలోని అతి పెద్దదైన మేడారం జాతర అభివృద్ధి పనులు 20051 నిధులతో పనులు ప్రారంభించగా వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా అన్ని సౌకర్యాలు చేకూర్చుతామని త్వరలో గుడి పనులు పూర్తవుతాయని అన్నారు. స్ట్రక్చర్లను త్వరగా బిగించి జాతర సమయానికి పనులు పూర్తి చేస్తామని వారు అన్నారు. ఎక్కడ లేని విధంగా మేడారం జాతరలో ఒక నైపుణ్యతవైన గుడిలు ఏర్పాటుచేస్తూ గిరిజన సాంప్రదాయాల ప్రకారం గిరిజనులు చెప్పే విధంగానే సమ్మక్క సారలమ్మ గుడిని ఏర్పాటు చేయడం జరిగిందని అలాగే జాతర సమయం వరకు గిరిజనులతో వెన్నంటే ఉండి గిరిజన సాంప్రదాయాల ప్రకారం గుడి అభివృద్ధి పనులు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనులు చేపిస్తామని వారు అన్నారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎస్‌సి, ఎస్‌టి వెల్ఫేర్ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లకు, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, పినపాక ఎంఎల్‌ఎ, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఎస్‌పి సుధీర్ రామ్ నాథ్ కేకన్, ఐటిడిఏ పిఓ చిత్ర మిశ్రా, డిఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్, తదితరులు ఉన్నారు.

**మేడారానికి బారులు తీరిన భక్తులు**

మేడారం మహా జాతర మరో 18 రోజులు ఉండగానే ఆదివారం భక్తజనం మేడారానికి పోటెత్తింది. శనివారం సాయంకాలం నాలుగు గంటల నుంచి భక్తజనం మేడారం వైపు పరుగులు పెట్టగా ఆదివారం తెల్లవారుజామున మూడు గంటల నుండి వేలాది వాహనాలు మేడారం వైపు పరుగులు పెట్టాయి. ఆదివారం మధ్యాహ్నం 12 గంటల వరకే మూడు లక్షల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకోవడానికి గద్దెల ప్రాంతంలో బారులు తీరారు. ఒకవైపు ఆరుగురు మంత్రులు మేడారంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించడానికి వస్తున్న క్రమంలో జిల్లా పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాటు చేయగా జిల్లా యంత్రాంగం భక్తుల ఏర్పాటులో నిమగ్నమైంది. గోవిందరావుపేట మండలం బాసర గ్రామం నుంచి నార్లాపూర్ వరకు వాహనాలు నిలిచిపోకుండా పలు దారుల గుండా మేడారం వైపు భక్తులను తరలించడానికి చర్యలు తీసుకున్నారు. జంపన్న వాగు కు చేరుకున్న వాహనాలను గద్దెల ప్రాంతానికి నేరుగా వెళ్లకుండా పలు ప్రాంతాల ద్వారా తరలించారు.

ఎగరాలి ఎగరాలి మన ఎర్రజెండా – ఎదురుబెదురూ లేక..
చలో ఖమ్మం
2026 జనవరి 18
సిపిఐ శతవార్షికోత్సవ సభకు
వేలాదిగా తరలి రండి!

# పార్టీ చీలికకు 60ఏళ్లు, ఏదీ ఆత్మపరిశీలన

అమృత్‌సర్ కాంగ్రెస్‌లో సిపిఐ మొట్టమొదటిసారి భారతదేశంలో సోషలిజంలోకి శాంతియుత పరివర్తన ధ్యేయాన్ని అంగీకరించింది, ఆమోదించింది. ఆ మహాసభ తదుపరి మూడు ముఖ్యమైన ఘటనలు జరిగాయి. ఒకటి, 1959లో కేరళ కమ్యూనిస్టు ప్రభుత్వం బర్తరఫ్. రెండు, ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమ సాధారణ పంథాకు వ్యతిరేకంగా మావోయిస్టు దాడి ప్రారంభం. ఇది ఈ దేశంలో కమ్యూనిస్టు పార్టీపై, ప్రజాతంత్ర ఉద్యమంపై తీవ్రంగా ప్రతికూల ప్రభావం చూపింది. 1947లో భారత్ స్వాతంత్ర్యం పొందగా, 1949లో చైనా విముక్తి జరిగింది. అనంతరం ఇరుదేశాల మధ్య స్నేహ సంబంధాలు పరిఢవిల్లాయి. ''ఇండి–చీనీ భాయి భాయి'' ఇంటింటి నినాదమైంది. సిపిఐ ఆ ఉద్యమం అగ్రభాగంలో ఉంది.



ఎస్‌ఎ డాంగే, చైర్మన్



ఇఎంఎస్ నంబూద్రిపాద్ ప్రధాన కార్యదర్శి

రెండు కమ్యూనిస్టు పార్టీల మధ్య సోదర సంబంధాలు వృద్ధి చెందుతున్నాయి. అయితే 1959 నాటికి పరిస్థితి మార్పు చెందసాగింది. చైనా కమ్యూనిస్టు పార్టీ, ప్రభుత్వం రెండూ దుస్సాహసిక వైఖరుల్లోకి, గొప్పరాజ్యమన్న దురహంకారంలోకి జారుకోవడం మొదలైంది. అది మావోయిజం ఆవిర్భావానికి దారితీసింది.

1959 మార్చిలో టిబెట్‌లో భూస్వామ్య అనుకూల తిరుగుబాటుతో మతగురువు దలైలామా భారత్‌లో ప్రవేశించారు, భారత ప్రభుత్వం ఆయనకు ఆశ్రయం కల్పించింది. ఇది ఇరుదేశాల మధ్య సంబంధాలను మరింత క్షీణింపజేసింది. ఇదిలా వుండగా, 1959నాటికి సరిహద్దు విభేదాలు బయటకు వచ్చాయి. చైనా ప్రధాని చౌన్–ఎన్–లై భారత ప్రధాని నెహ్రూకు రాసిన లేఖలో మెక్‌మహన్ రేఖను చైనా గుర్తించటంలేదని, ఆ రేఖకు దక్షిణంగా ఉన్న 90వేల కిలోమీటర్లు చైనాదేనని పేర్కొన్నారు. వాయవ్య దిక్కున ఆక్సాయ్‌చిన్ ప్రాంతంలో ఉన్న వివాదాలకు ఇది అదనం. చైనాకు, సిపిఐకి వ్యతిరేకంగా దుష్ప్రచారం పెంపు చేయటానికి ఇది అభివృద్ధి నిరోధకులకు, భారత ప్రభుత్వానికి సహాయకారి అయింది. చైనా కమ్యూనిస్టు పార్టీ వైఖరిలో వచ్చిన ఈ తీవ్రమైన మలుపు భారత్‌కు వ్యతిరేకంగా మాత్రమే కాదు, ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమ సాధారణ పంథాకు వ్యతిరేకంగా అది ప్రారంభించిన దాడిలో భాగం. ఈ అతివాద ఒంటెత్తు పోకడ పంథా ఇక్కడ పాల్ఘాట్, అమృత్‌సర్ కాంగ్రెస్‌లు ఆమోదించిన పంథాపై దాడిచేయటానికి, ముఠా కార్యకలాపాలు పెంపుచేయటానికి కొందరు సిపిఐ నాయకులను ప్రోత్సహించింది.

మూడవ ముఖ్యమైన పరిణామం – 1960లో మాస్కోలో జరిగిన 81 కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీల సమావేశం. ఆ మహాసభ ఆమోదించిన రెండు విరుద్ధ సామాజిక వ్యవస్థల మధ్య శాంతియుక సహజీవనం, శాంతియుత పోటీ, సోషలిజంలోకి శాంతియుత పరివర్తనకు అవకాశం అనే మౌలికాంశాలతో సిపిఐ నాయకులు కొందరు విభేదించారు. ''చైనా పంథా'' భారతదేశంలో ''మిలిటెంట్'' రివల్యూషనరీ పంథాను ముందుకు తీసుకువెళ్ళటానికి తోడ్పడుతుందని, మాస్కో డిక్లరేషన్ ''రివిజనిస్టు పంథా'' అని అది సిపిఐ పోరాటానికి అవరోధమని, వర్గ సంక్రమణానికి, కాంగ్రెస్ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు దారితీస్తుందని ఆ నాయకులు వాదించారు. తమ ఫ్యాక్షనల్ సమావేశాల్లో తమ పంథాను ప్రచారంలో పెట్టారు. అటు తర్వాత సిపిఐ(ఎం)గా ఏర్పడింది ప్రధానంగా వీరే.

ఈ నేపథ్యంలో 1961 ఏప్రిల్ 7–16 తేదీల్లో విజయవాడలో సిపిఐ ఆరవ కాంగ్రెస్ జరిగింది. పార్టీ చరిత్రలో తొలిసారి మిఖాయిల్ సుస్లోవ్ నాయకత్వంలో సిపిఎస్‌యు నుంచి సౌహార్ద్ర ప్రతినిధివర్గం హాజరైంది. ప్రధాన కార్యదర్శి అజయ్‌ఘోష్ తమ ప్రారంభోపన్యాసంలో 1960 మాస్కో డిక్లరేషన్‌ను హర్షిస్తూ, ప్రపంచం, భారతదేశ పరిస్థితిపై సమగ్ర విశ్లేషణ చేశారు. అయితే కాంగ్రెస్‌తో సర్వసాధారణ యునైటెడ్ ఫ్రంట్ ఉండబోదని, మన సంబంధాలు ''ఐక్యత–పోరాటం''గా ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. అయినా మాస్కో డిక్లరేషన్‌కు వ్యతిరేకంగా ''చైనా పంథాను'' బలపరుస్తున్న కామ్రేడ్స్, రాజకీయ తీర్మానం ముసాయిదాలోని అంశాలకు వ్యతిరేకంగా తీవ్రమైన పోరాటం చేశారు. సుదీర్ఘంగా, రాత్రులు పొద్దుపోయేవరకు సైతం వాదోపవాదాలు జరిగాయి. భిన్న మార్గంలోని వారు వాకౌట్లు, అరుపులు తదితర పద్ధతుల్లో ఆటంకాలు కల్పించారు. దీనివల్ల విజయవాడ కాంగ్రెస్ రాజకీయ తీర్మానం ఆమోదించలేదు. చర్చల నేపథ్యంలో తన ప్రసంగాన్ని సరిదిద్దవలసిందిగా అజయ్‌ఘోష్‌ను ఆదేశించింది. పార్టీలో చీలిక నివారణకు ఆ అసాధారణ ప్రొసీజర్ ఆమోదించబడింది. పార్టీలో ఒక విధమైన చీలిక విజయవాడ కాంగ్రెస్‌లోనే స్పష్టమైంది.

పార్టీ కార్యక్రమానికి సంబంధించి మరో ముఖ్య వివాదం భారతదేశానికి అత్యంత అనువైనది ఏది? జాతీయ ప్రజాస్వామ్యమా? లేక జనతంత్ర ప్రజాస్వామ్యమా? ప్రగతిశీల శక్తులందరితో కలిసి జాతీయ ప్రజాతంత్ర విప్లవాన్ని పరిపూర్తి చేయటం మొదటి పంథా కాగా, కార్మికవర్గ నాయకత్వాన ప్రజాస్వామ్య విప్లవం పూర్తిచేయటం రెండో పంథా.

పార్టీ సంస్థల ఎన్నికలు వచ్చేసరికి, ఆ పిడివాదుల్లో కొందరు ప్యానల్ నుంచి ఉపసంహరించుకుని పెద్ద సంక్షోభం సృష్టించే ప్రయత్నం చేశారు. జాతీయ సమితి సభ్యుల సంఖ్యను పెంచి చివరి నిమిషంలో రాజీ జరిగింది. కొత్త జాతీయ సమితి కేంద్ర కార్యవర్గ కమిటీని , కేంద్ర కార్యదర్శి వర్గాన్ని కాంగ్రెస్‌లో ఎన్నుకోలేదు. 1962లో కామ్రేడ్ అజయ్‌ఘోష్ మరణానంతరం పార్టీనాయకత్వాన్ని స్వాధీనం చేసుకోవటానికి ఆ గ్రూపు తీవ్రంగా ప్రయత్నించింది. పార్టీ ఐక్యతను కాపాడే నిమిత్తం జాతీయ సమితి పార్టీ నిబంధనావళిని సవరించి చైర్మన్ పదవిని పునరుద్ధరించింది. చైర్మన్‌గా ఎస్.ఎ. డాంగే, ప్రధాన కార్యదర్శిగా ఇ.ఎం.ఎస్. నంబూద్రిపాద్ ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు. ఇ.ఎం.ఎస్ విజయవాడ కాంగ్రెస్‌లో అతివాద ఒంటెత్తు వాద వైఖరితో లేరు. ఆయన తన సొంత పంథా ప్రతిపాదించారు. అయితే అది చర్చకు రాలేదు.

**మావోయిస్టు నాయకత్వం పిలుపు :**

చైనా కమ్యూనిస్టు పార్టీ (సిపిసి) మావోయిస్టు నాయకత్వం ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టు పార్టీల్లో చీలికకు పలుమార్లు పిలుపు ఇచ్చింది. ''రివిజనిస్టులపై'' తిరుగుబాటు చేసి, ''విప్లవ కమ్యూనిస్టు పార్టీల'' ఏర్పాటుకై బయటకు రావల్సిందిగా కోరింది. ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమంలో చీలికకు పిలుపునిచ్చింది. ''అంతర్జాతీయ రివిజనిజంపై పోరాడు'' పేరుతో సోదర కమ్యూనిస్టు పార్టీల్లో చీలికకు 1963 లో చైనా పార్టీ పిలుపు ఇచ్చింది. భారత దేశంలో నిజమైన '' మార్క్సిస్టు– లెనినిస్టు పార్టీ ఏర్పాటుకు బహిరంగా పిలుపు ఇచ్చి, ''రివిజనిస్టు డాంగే ముఠా''తో సంబంధాలు తెంచుకోమని కోరింది. కొన్ని ప్రజాసంఘాలు సహా అన్ని స్థాయిల్లో పోటీ సంఘాల ఏర్పాటుతో పార్టీ చీలికకు ప్రణాళిక సిద్ధమైంది. చైనా ప్రచారంలో చేరిన ఇండోనేషియన్ కమ్యూనిస్టు పార్టీ చైర్మన్ డిఎన్ ఐదిత్ సిపిఐని చీల్చాల్సిందిగా భారత కమ్యూనిస్టులకు బహిరంగ పిలుపు ఇచ్చారు. ప్రపంచమంతటా''చైనా విప్లవ పంథా''ను అనుసరించాలని పిలుపులు ఇవ్వబడ్డాయి. ''చైనాబాట మన బాట'' అని విరివిగా ప్రచారం చేయబడింది.

ఈలోపు,1962 అక్టోబర్ 20న భారత భూభాగంలోకి చైనా సైన్యం యుద్ధానికి తెగబడింది. దాన్ని'దురాక్రమణ' యుద్ధంగా తొలుత డాంగే , ఆతర్వాత పార్టీ ప్రకటించాయి. చీలిక వాదులు వ్యాఖ్యను గట్టిగా వ్యతిరేకించారు. నెహ్రూ ప్రభుత్వం వారిని దేశరక్షణ చట్టం కింద జైళ్లలో పెట్టింది. అస్సాంలోకి వచ్చిన చైనాసైన్యాలు 31రోజుల తర్వాత ఉపసంహరించుకున్నాయి. ఖైదీలందరూ విడుదలైనారు.

చీలిక వాదులు భారత జాతీయ పురావస్తు భాండాగారంనుంచి 'డాంగే లేఖలు' అనేదాన్ని సంపాదించి అమెరికన్ వారపత్రిక 'కరెంట్'లో ప్రచురింపజేశారు. డాంగే 1924 నుంచీ బ్రిటిష్ ఏజెంట్ అని రుజువుచేయాలనే ప్రయత్నం అది. జాతీయ సమితి మెజారిటీ ఆ నిందను తిరస్కరించారు. అయితే పార్టీ ఐక్యత పరిరక్షణకోసం దర్యాప్తు కమిటీ వేసింది. ఆ లేఖలు ఫోర్జరీ అని ఆ కమిటీ తేల్చింది.

పార్టీని చీల్చడానికి ప్రణాళికలు ముందే సిద్ధమైనాయి. అసలు సమస్యలు సిద్ధాంతపరమైనవి, రాజకీయ, నిర్మాణ సంబంధమైనవి కాగా ' డాంగే లేఖలు' అనేవి పార్టీని చీల్చటానికి సాకు మాత్రమే . మావోయిజంను అనుసరిస్తున్నవారు,లేదా దాని పట్ల సానుభూతి కలిగి ఉన్నవారు, సిపిసి వ్యూహం, ఎత్తుగడలను బలపరిచేవారు వేరే పార్టీ ఏర్పాటు చేయటానికి నిర్ణయించుకున్నారు.1964 ఏప్రిల్ 11న ముందస్తు ప్రణాళిక ప్రకారం జాతీయ సమితి సభ్యులు 101 మందిలో 32 మంది వాకౌట్ చేశారు. ఒక పత్రికా ప్రకటనలో, తమ పోటీ కార్యక్రమం ప్రకటించి, పోటీ కాంగ్రెస్‌కు పిలుపు ఇచ్చారు. ఆవిధంగా 1964లో సిపిఐలో చీలిక తెచ్చారు. వారు ఆ చీలికను ' చారిత్రక ఆవశ్యకత'గా సమర్థించారు, భారత దేశంలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని 'రక్షించామని' భావించారు. 60సంవత్సరాలు గడిచిపోయాయి.ఈ చీలిక కమ్యూనిస్టు వ్యతిరేకులు, మితవాద అభివృద్ధి నిరోధకుల పెరుగుదలకు మాత్రమే దోహద కారి అయ్యింది. కమ్యూనిస్టు ఉద్యమం తొలి చీలిక నుంచి డజన్ల చీలికల పీలికలైంది. చరిత్ర ఎన్నో అనుభవాలు ఇచ్చింది. మంచిచెడులను బేరీజు వేసుకుందాం. కమ్యూనిస్టు ఉద్యమ పునరేకీకరణకు భారత కమ్యూనిస్టు పార్టీ పిలుపు ఇస్తున్నది. అది పీడిత ప్రజల ఆకాంక్ష. మిగతా వామ పక్ష పార్టీల్లోనూ పునరాలోచన అవసరం.

**– అనిల్ రాజింవాలె**

ప్రజాపక్షం
Telugu National Daily
కరీంనగర్
సోమవారం
12-01-2026
www.prajapaksham.in




## ప్రజలకు వారధిగా 'ప్రజాపక్షం'

**ప్రజాపక్షం/గుండాల:** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలో ఆదివారం మాజీ జిల్లా వైస్ చైర్మన్ పాండరి ఆధ్వర్యంలో ప్రజాపక్షం దినపత్రిక నూతన సంవత్సరం 2026 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్రికలు ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పనిచేస్తూ ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కుసుమాని హరిచంద్ర, సిపిఐ మండల కార్యదర్శి రామచంద్రయ్య, మండల కార్యవర్గ సభ్యులు శ్రీను, సత్యనారాయణ, కృష్ణహరి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ సత్యంకు రైతుల కృతజ్ఞతలు



**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని అంతమ్మగూడెం గ్రామ సమీపంలో ఉన్న హాజాలో లాబరేటర్, శ్రీ జయ లాబరేటర్, పరిశ్రమలు చేస్తున్న కాలుష్య సమస్యలను శాసనమండలిలో ప్రస్తావించినందుకు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంను కాలుష్య బాధిత గ్రామ రైతులు ఎమ్మెల్సీని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ సమీపంలో ఉన్న పరిశ్రమల నుంచి వస్తున్న కాలుష్యం గురించి సమాచారం సేకరించి నివేదికలను ఎమ్మెల్సీకి అందజేశారు. పరిశ్రమల వ్యర్ధ వ్యాధుల కారణంగా పీల్చే గాలిలో బెంజిన్, తోలి ఇథైల్ బెంజిన్ వంటి క్యాన్సర్ కారక రసాయనాలతో పాటు అనేక రకాల విషపూరిత వ్యర్థాలు గాలిలో చేరుతాయని బోరుబావులలో నీటిలో టీడీఎస్ విలువ 50 వేలకు పైగా చేరిందని, వ్యవసాయ భూములలోని మట్టిలో కెమికల్ ఆక్సిజన్ విలువ 16 వేల వరకు చేరిందని రుజువు నివేదిక రూపంలో ఎమ్మెల్సీకి తెలిపినారు. గ్రామంలో ఉండలేక పరిశ్రమల కారణంగా వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. పిబిసి ఉన్నతాధికారులు పరిశ్రమలపై చర్యలు తీసుకోకుండా కేవలం ఆదేశాలకు పరిమితమయ్యారని, అమలు చేయడంలో పూర్తి నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గుమ్మి దామోదర్ రెడ్డి, వస్పరి నరసింహ, రేణుక, లింగయ్య, తరుణ్, సురుకంటి కృపనంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల ప్రవేశాలకు దరఖాస్తు

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** 2026/27 విద్యాసంవత్సరానికి గాను తెలంగాణ రాష్ట్రంలోని అన్ని గురుకులాల్లో ప్రవేశాలకు అర్హులైన ఎస్‌సి, ఎస్‌టి, బిసి జనరల్ విద్యార్థులు ఈనెల 21వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి ప్రవేశ పరీక్షతోపాటు 6, 7, 8, 9 తరగతులలో మిగిలిన సీట్లకు కూడా భర్తీకి అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 22న ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. దరఖాస్తును ఆన్‌లైన్‌లో సమర్పించాలని దరఖాస్తు చేసుకునేందుకు కులం, ఆదాయం, ఆధార్, బర్త్ సర్టిఫికెట్, పాస్‌ఫోటో వివరాలు సమర్పించాల్సి ఉంటుందని విద్యార్థులు అందరూ ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## సమర్థవంతంగా మున్సిపల్ ఎన్నికల నిర్వాహణ కార్యాచరణ




**ప్రజాపక్షం/చండూరు:** త్వరలో జరుగనున్న మున్సిపల్ ఎన్నికల నిర్వాహణ కార్యాచరణను సమర్థవంతంగా పూర్తిచేయుటకు ప్రణాళికబద్ధంగా సిద్ధంగా ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ అశోక్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. ఆదివారం జిల్లా అదనపు కలెక్టర్ అశోక్‌రెడ్డి చండూరు మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించారు. త్వరలో జరుగనున్న మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో చండూరు మున్సిపాలిటీలో జరుగుతున్న ఎన్నికల సన్నాహక పనులపై ఆయన సమీక్షించారు. మున్సిపాలిటీలో ఉన్న జనాభా, మొత్తం ఓటర్లు సంఖ్య తో పాటు 10 వార్డులకు గాను ఒక్కొక్క వార్డులో ఎంత మంది ఓటర్లు ఉన్నారని తెలుసుకొని ఓటర్ జాబితాను పరిశీలించారు. మున్సిపాలిటీఉన్న మొత్తం 10 వార్డులకు 20 పోలింగ్ స్టేషన్లు ప్రతిపాదింబడినట్లు తెలిపారు. ఇప్పటి వరకు మున్సిపాలిటీలో 128 అభ్యంతాలు రాగ వాటిని పరిగణలోకి తీసుకొని అభ్యంతరాలు తెలిపిన వారిని పరిగణలోకి తీసుకొని వాటిని నిర్దిష్ట ప్రొఫార్మాలో నమోదు చేయడం అవసరమని అన్నారు. రాబోయె రోజుల్లో చేపట్టవలసిన కార్యాచరణ లక్ష్యాలను సమర్ధవంతంగా పూర్తి చేయాలని సమావేశంలో స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో మున్సిపాలిటీ కమీషనర్ మల్లేశం , వార్డు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నిత్య కల్యాణ మహోత్సవం

**ప్రజాపక్షం/యాదాద్రి :** విశ్వేశ్వరుడైన శ్రీ వేంకటేశ్వర స్వామికి పట్టు పీతాంబరాలు ధరింపజేసి మరియు సుగంధ భరిత పుష్పమాలలతో అలంకరించి అర్చక స్వాములు స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు శ్రీ స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి ఆనంద పరవశులైనారు. ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర దేవస్థానంలో ధనుర్మాసము సందర్బంగా కూడారై ఉత్సవము గోదామ్మవాళ్లు సాక్షాత్తు శ్రీనివాసుడికి 108 గంగాలల తోటి పాయసాన్ని నైవేద్యంగా సమర్పించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు రామారావు, మురళీకృష్ణ, గోపీకృష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించారు.



# 'హలో కామ్రేడ్ ...చలో ఖమ్మం'

### జనవరి 18న ఖమ్మంలో సిపిఐ 100 వసంతాల ముగింపు బహిరంగ సభకు తరలిరండి...

### పార్టీ శ్రేణులకు సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి పిలుపు



**ప్రజాపక్షం/దేవరకొండ :** భారత గడ్డపై ఎర్రజెండాకు వందేళ్లు దాటిన సందర్భంగా ఖమ్మం నగరంలో జనవరి 18న లక్షలాది మందితో నిర్వహించే సిపిఐ 100ఏళ్ల ముగింపు ఉత్సవాలను జయప్రదం చేయాలని పార్టీ శ్రేణులకు సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం దేవరకొండ పట్టణంలోని కామ్రేడ్ పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన నియోజకవర్గంలోని సిపిఐ ఆయా మండల కార్యవర్గ సభ్యుల సమావేశానికి పల్లా వెంకట్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా పార్టీ శ్రేణులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ సిపిఐ వందేళ్ల ప్రస్థానంలో విప్లవ పోరాట ఘట్టాలు వెలకట్టలేని త్యాగాలు అజరామరమని అన్నారు. పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన ఎర్రజెండా పేద ప్రజలకు అండగా, దున్నేవాడికి భూమి కావాలనే నినాదంతో లక్షలాది ఎకరాల భూమిని పేదలకు పంచిన ఘనమైన చరిత్ర గల పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని అన్నారు. సామ్రాజ్యవాద వ్యతిరేక భూస్వామ్య పెట్టుబడిదారి వర్గాలకు వ్యతిరేకంగా బలమైన ఉద్యమాలు నిర్వహించిన చరిత్ర సిపిఐదని అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ 1925 డిసెంబర్ 26న ఆవిర్భవించి దేశంలో 100సంవత్సరాల ఉద్యమ పార్టీగా సిపిఐ ఖ్యాతి పొందిందని, స్వాతంత్ర్యం కొరకు జరిగిన పోరాటంలో ఆనాడే అనేక మంది ఉరికంబాలు ఎక్కి ప్రాణ త్యాగాలు చేసిన వీర చరిత్ర గలది సిపిఐ అని అన్నారు. దేశ స్వాతంత్ర్యం కొరకు ఫ్యూడల్ సంస్థానాల విముక్తి కొరకు తాడిత, పీడిత జనావళి కొరకు వేలాది మంది ప్రాణాలనుకొల్పోయిన ఏకైక పార్టీ సిపిఐ అని అన్నారు. భారత స్వాతంత్ర్యం పొందిన తర్వాత దేశంలో రైతుల కొరకు వ్యవసాయ సంస్కరణలు, కార్మికుల కొరకు వ్యవసాయ సంస్కరణలు, కార్మికులకు కొరకు కార్మిక చట్టాలు, ప్రైవేట్ రంగంలో ఉన్న బొగ్గు గనులు, బ్యాంకులు, బీమా రంగం, ఆర్టీసి లాంటి సంస్థలను జాతీయికరణ కొరకు ఉద్యమాలు చేపట్టి సాధించటంలోనూ , స్టీలు, సిమెంట్, దేశ రక్షణకు సంబంధించిన అనేక ప్రభుత్వ రంగ పరిశ్రమలు ఏర్పాటు చేయడంలో సిపిఐ నిర్వహించిన పాత్ర మరువలేనిదని, భారత పార్లమెంటరీ చరిత్రలో ఆనాడు ప్రధాన ప్రతిపక్షంగా ఉంటూ దేశ, ఆర్థిక, పారిశ్రామిక, వ్యవసాయ రంగాల అభివృద్ధికి ఆనాటి కమ్యూనిస్టు పార్టీ పార్లమెంట్ సభ్యులు భూపేష్ గుప్తా, హిరెన్ ముఖర్జీ, ఇంద్రజిత్ గుప్తా లాంటి కమ్యూనిస్టు మేధావులు విలువైన సూచనలు దేశాభివృద్ధికి అందించిన ఘన చరిత్ర సిపిఐ దని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతానికి నీళ్లు నిధులు నియామకంలో జరుగుతున్న అన్యాయాలను ఎప్పటికప్పుడు పార్లమెంట్ లోనూ, అసెంబ్లీలోనూ గళమెత్తిన పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని, ప్రజా సమస్యలపైన, భూ సంస్కరణలు, ఇళ్ల స్థలాలు, పారిశ్రామికీకరణ, వ్యవసాయ అభివృద్ధి తదితర అంశాలపై ఉద్యమాలు చేపట్టిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీదని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కొరకు మొట్టమొదటగా అంగీకారం తెలియజేసి తెలంగాణ సాధనలో ప్రముఖ పాత్ర వహించిన పార్టీ సిపిఐ అన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, మాజీ ఎంఎల్‌ఏ యాదగిరిరావు, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ్మా, జిల్లా కార్యవర్గ సభ్యుల బుచ్చిరెడ్డి, మండల కార్యదర్శులు, జిల్లా కౌన్సిల్ సభ్యులు సుదర్శన్ రెడ్డి, వెంకటయ్య, వెంకటరమణ, జయరాములు, వెంకటయ్య, మండల కార్యవర్గ సభ్యులు రామస్వామి, ఆంజనేయులు, విజేందర్‌రెడ్డి, శైలేష్, రమేష్, అంజల్, వెంకట్రాములు, వెంగలయ్య, యాదయ్య, వెంకటయ్య ఉన్నారు.




## ఆటో కార్మికుల సంక్షేమానికి కృషి

**ప్రజాపక్షం/నకిరేకల్ :** ఆటో డ్రైవర్ల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం పేర్కొన్నారు. ఆదివారం నకిరేకల్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గుత్తా మంజుల మాధవ రెడ్డి, మునిసిపల్ చైర్మన్ చౌగోని రజిత శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

## చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రతి ఒక్కరు సీఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్ అన్నారు. ఆదివారం పట్టణంలోని విద్యానగర్‌లో గల ఆయన నివాసంలో మిర్యాలగూడ నియోజకవర్గ వ్యాప్తంగా 16 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.10లక్షల విలువ గల సీఎం సహాయ నిధి చెక్కులను అందచేసి ఆయన మాట్లాడారు. ఆపద సమయంలో వైద్య ఖర్చుల నిమిత్తం పేదలు సీఎం ఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



# కార్మిక, కర్షకుల కోసం సిపిఐ రాజీలేని పోరాటాలు

### సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు జాతీయ బహిరంగ సభను జయప్రదం చేయాలి : శ్రావణ్ కుమార్



**ప్రజాపక్షం/చిట్యాల:** ఈనెల 18న ఖమ్మంలో జరిగే సిపిఐ శతాబ్ది ఉత్సవాల జాతీయ బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రావణ్ కుమార్ పిలుపునిచ్చారు.ఆదివారం గుండ్రాంపల్లిలో జరిగిన సిపిఐ గ్రామ శాఖ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ సిపిఐ భారత దేశంలో శతాబ్ది కాలంలో ఎన్నో పోరాటాలు నిర్వహించి కార్మిక,విద్యార్థి,రైతు,మహిళ తదితర ప్రజా సంఘాలను నిర్మించి వెట్టి చాకిరి విముక్తి కొరకు, కార్మికులను కర్షకులను దోపిడి నుండి విముక్తి చేయడానికి రాజీలేని పోరాటాలు నిర్వహించిందని ఆయన అన్నారు.ఈ శతాబ్ది కాలంలో ఎన్నో పోరాటాలు ఎన్నెన్నో త్యాగాలు, ఎంతోమంది అమరవీరుల రక్త తర్పణంతో ఎన్నో విజయాలు సాధించి భారతదేశ రాజకీయ చరిత్రలో సిపిఐ తనకంటూ ఒక ప్రత్యేక స్థానం సంపాదించుకుందని ఆయన అన్నారు. జనవరి 18న ఖమ్మంలో నిర్వహించే సిపిఐ శతాబ్ది జాతీయ ఉత్సవాల ముగింపు బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆయన కోరారు.ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు బోడిగే సైదులు,జిల్లా యాదయ్య,శాఖ కార్యదర్శి జిల్లా సత్యం,నాయకులు బొడిగె బక్క శెట్టి,బొబ్బల శంకర్ రెడ్డి,పానుగుల శివ,రత్నం లింగస్వామి, సర్గాల అశోక్, బెదరకోట సైదులు పాల్గొన్నారు.

### సిపిఐ ఖమ్మం బహిరంగ సభ గోడ పత్రిక ఆవిష్కరణ



**ప్రజాపక్షం/గుండాల:** భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 18న ఖమ్మం పట్టణంలో లక్షలాది మందితో నిర్వహించే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆదివారం గుండాల మండల కేంద్రంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కుసుమాని హరిచంద్ర ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులతో కలిసి సిపిఐ గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి అనంతులు రామచంద్రయ్య, కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ, శ్రీను, స్వామి, కృష్ణ హరి తదితరులు పాల్గొన్నారు.

### శతాబ్ది ఉత్సవాల వేడుకలను జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/రామన్నపేట :** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జనవరి 18వ తేదీన ఖమ్మం పట్టణంలో లక్షలాది మందితో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు రామన్నపేట సిపిఐ మండల కార్యదర్శి ఊట్కూరి నరసింహ రామన్నపేట పట్టణ కేంద్రంలో గోడపత్రిక ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు ఎర్ర రమేష్ గౌడ్, సిపిఐ మండల సహాయ కార్యదర్శి రామచంద్రం, సిపిఐ పట్టణ కార్యదర్శి రచ్చ యాదగిరి, సీనియర్ నాయకులు బాలగోని మల్లయ్య, ఊట్కూరి భగవంత, గంగాపురం వెంకటయ్య, గంగాపురం యాదయ్య, వీరమల్ల ముత్తయ్య, సంగిశెట్టి పాండు పాల్గొన్నారు.





## పచ్చని పైరు దున్నేశారు!

### అధికారులు ముడుపులు తీసుకుని తమకు న్యాయం చేయడం లేదని రైతులు ఆందోళన

**ప్రజాపక్షం/కోదాడ:** వారసత్వంగా వచ్చిన తమ పొలంలో సాగు చేసిన పచ్చని పసి పైరును రాత్రికే రాత్రే దున్ని నాశనం చేశారని కోదాడ పట్టణ పరిధిలోని శ్రీరంగాపురం గ్రామానికి చెందిన రైతులు మల్లు భిక్షారెడ్డి, వెంకటరెడ్డి లు కుటుంబ సభ్యులతో కలిసి పురుగుమందు డబ్బాలతో పొలం వద్ద ఆందోళనకు దిగారు. వారసత్వంగా వచ్చిన తమ భూమిని మల్లు వీరారెడ్డి కుమారులు మల్లు వెంకటరెడ్డి, సైదిరెడ్డి, ఏసి రెడ్డిలు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. గతం కొంతకాలంగా ఈ వివాదం జరుగుతుందని ఇదే విషయాన్ని కోదాడ తహసిల్దార్ దృష్టికి తీసుకెళ్లమన్నారు. ఇటీవల రెవిన్యూ ఇన్స్‌పెక్టర్ సర్వే చేసి ఆ 30 కుంటల భూమి తమది అని రిపోర్టు కూడా ఇచ్చారన్నారు. కాగా కొందరి ఒత్తిడి ప్రలోభాలకు లొంగి తహసిల్దార్ ఆర్‌ఐ రాసిన రిపోర్టును మార్చి ఈ భూమి తమకు చెందకుండా నివేదికలు రూపొందించారని కన్నీరు మున్నీరయ్యారు. ఈ విషయం కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశానని, ఇటీవల కాలంలో తమపై దాడులు కూడా జరగడంతో పోలీసులు మరణ వాంగ్మూలంతో కూడా ఆశ్రయించామని అయినప్పటికీ పోలీసు అధికారులు సైతం తమకు న్యాయం చేయకుండా ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. తమపై దాడి చేసి అక్రమించుకోవాలని చూస్తున్న వారిపై అధికారులు నాయకుల ఒత్తిడితొ ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని వాపోయారు. భూ రికార్డుల ప్రకారం గతంలో వారి భాగా పంపిణీ వచ్చిన భూమి ఎన్ఎస్‌పి కాల్వ కింద పోయిందని వీరు ఆదే పోయిన భూమిని అధికారులకు ముడుపులు అప్పగించి రికార్డులోకి ఎక్కించుకుని తమ భూమిపైకి దౌర్జన్యంగా వస్తున్నారని కలెక్టర్ జోక్యం చేసుకుని విచారణ జరిపించి తమకు న్యాయం చేయాలని కోరారు. లేని పక్షంలో కుటుంబ సభ్యులతో కలిసి కోదాడ తహసిల్దార్ కార్యాలయం ముందు పురుగుమందు తాగి ఆత్మహత్యలు చేసుకోవడం తప్ప మరోదారి లేదని వాపోయారు.

## దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరిస్తా



**ప్రజాపక్షం/హాలియా:** నూతనంగా ఎన్నికైన ఇబ్రహీంపేట, కొత్తపల్లి సర్పంచులు ఆదివారం స్థానిక ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డిని కలుసుకున్నారు. కొత్తగా పదవి బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఇబ్రహీంపేట సర్పంచి ఎడవల్లి వంశీకృష్ణారెడ్డి, కొత్తపల్లి సర్పంచ్ బ్రహ్మానందరెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిసి తమ ప్రాంతంలో ఉన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. గత కొన్నాళ్లుగా గ్రామపంచాయతీలలో నెలకొన్న సమస్యలను ప్రజలు తాము గెలిచిన వెంటనే తమ దృష్టికి తీసుకు వస్తున్నారని ఎమ్మెల్యే దృష్టికి వీరు తీసుకెళ్లారు. దీర్ఘకాలికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని వారు ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు వినతి చేశారు. వీరి వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్ రెడ్డి,జడ్‌పి మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి,జిల్లా కాంగ్రెస్ నాయకులు ఎడవల్లి నరేందర్ రెడ్డి,విద్యాసాగర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## చైనా మాంజా అమ్మినా,కొన్నా చర్యలు

**ప్రజాపక్షం/నకిరేకల్:** సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రభుత్వం నిషేధించిన చైనా మాంజాను అమ్మినా, కొనినా కఠిన చర్యలు తప్పవని శాలిగౌరారం సీఐ కె.కొండల్ రెడ్డి హెచ్చరించారు.నిషేధిత చైనా మాంజా వల్ల పశువులు, పక్షులు, మనుషులకు తీవ్ర ప్రమాదం పొంచి ఉందని, మాంజా దారం తగిలి ప్రాణాపాయం జరిగే అవకాశం ఉందన్నారు. ఎవరికి తెలియకుండా దుకాణదారులు చైనా మాంజాను అమ్మాలని ప్రయత్నించినా, కొనుగోలు చేసినా బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.చైనా మాంజా అమ్మకం లేదా కొనుగోలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. అలాగే పండగ సెలవుల్లో సొంత ఊర్లు లేదా ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు తమ ఇళ్లలో బంగారం, వెండి వంటి విలువైన వస్తువులు ఉంచకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైతే వెంట తీసుకువెళ్లాలని సూచించారు.

# అభివృద్ధి కావాలో అరాచకాలు కావాలో నిర్ణయించుకోవాలి

### మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్‌ఎస్‌కు మద్దతివ్వాలి
### మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట :** అభివృద్ధి కావాలో అరాచకాలు కావాలో ప్రజలే నిర్ణయించుకోవాల్సిన అవసరం ఉందని, మున్సిపల్ ఎన్నికల్లో మోసకారి కాంగ్రెస్‌ను ఓడించి అభివృద్ధి చేసే బిఆర్‌ఎస్‌కు మద్దతివ్వాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ప్రజలను కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బిఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై బిఆర్‌ఎస్ శ్రేణులకు దిశానిర్దేశం చేసిన అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్‌ఎస్ సైనికుల స్లోగన్ 2014కు ముందు ఏట్లున్నదో ఈ రెండేళ్ళ కాంగ్రెస్ పాలన అట్లనే ఉన్నదని ప్రచారం చేయాలన్నారు. ఆరాచకాలు, కబ్జాలు, బెదిరింపులు, అక్రమ కేసులు పెరిగినయాని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రెండేండ్ల కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర ప్రజలంతా విసిగి వేసారిపోయింద్రని చెప్పారు. కాంగ్రెస్ హామీ ఇచ్చిన గ్యారెంటీ కార్డుల్లోని హామీలను ఇంకెప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించాలని ప్రజలను కోరారు. ప్రజలు మోసకారి కాంగ్రెస్‌ను ఓడగొట్టాలనే కంకణబద్దులై ఉన్నారని తెలిపారు. సంక్రాంతి కంటే ముందే పట్టణాల్లో పండుగ వాతావరణం మొదలైందని కారు గుర్తు కనబడితే చాలు ఓటేసేందుకు అంతా సిద్ధమైనట్లు ధీమా వ్యక్తం చేశారు. చంద్రబాబు రేవంత్‌వి చీకటి ఒప్పందాలని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమ రాజకీయ అవసరాల కొరకే అమ్ముడుపోతున్నాడని ఎద్దేవా చేశారు. కృష్ణా గోదావరి జలాలను ఆంధ్రకు దోచిపెడుతున్నాడని ఆరోపించారు. బణకచర్ల పేరుమార్చి నల్లమల్ల సాగర్ అంటున్నారు దానికి ఏపేరు పెట్టినా జరిగేది తెలంగాణ నీళ్ళ దోపిడే తప్ప మరొకటి లేదన్నారు. చంద్రబాబును సంతృప్తి పరచడమే రేవంత్ లక్ష్యంగా ఉందన్నారు. ఈ సమావేశంలో మాజీ ఉన్నత విద్యామండలి చైర్మన్ ఒంటెద్దు నర్సింహారెడ్డి, రాష్ట్ర నాయకులు వై వెంకటేశ్వర్లు, సూర్యాపేట మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ, పెన్‌పహాడ్ మాజీ ఎంపిపి నెమ్మాది బిక్షం పాల్గొన్నారు.

# సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబాలు ముగ్గులు

### కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ముగ్గులు ప్రతిబింబాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుకూరు బాలకృష్ణ, ప్రముఖ వ్యాపారవేత్త గుడిపాటి నవీన్ అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ 27వ ఇన్‌చార్జి గొట్టిముక్కల లక్ష్మణాచారి ఆధ్వర్యంలో ఆదివారం మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. పోటీలో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందచేసి మాట్లాడారు. మహిళల్లో అంతర్లీనంగా దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ముగ్గుల పోటీలు దోహదపడుతాయని అన్నారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా మహిళలు ముగ్గులు వేశారన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే దేశాభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. వార్డుల్లో నెలకొన్న సమస్యలపై అనునిత్యం వాటి పరిష్కారం కోసం కృషి చేస్తున్న లక్ష్మణ్‌ను జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. న్యాయ నిర్ణేతలుగా వైద్యురాలు సరిత, దివ్య రేణుక, ఉపాధ్యాయురాలు విమల, కస్తూరి సరితలు వ్యవహరించారు. పోటీలో 400మందికి పైగా పాల్గొన్నారు. మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు కొంపల్లి గోవర్ధన్, విశ్రాంత ఉపాధ్యాయులు సన్నాల వెంకయ్య, రాయపాటి వెంకటేశ్వర్లు, రాపోలు శ్రీనివాస్, శశి, రాజేందర్, సూర్యం, వార్డు పెద్దలు పాల్గొన్నారు.

## పంజాబ్‌లో అశాంతిని సృష్టించేందుకు బిజెపి కుట్ర

### ముఖ్యమంత్రి భగవంత్‌సింగ్ మాన్ మండిపాటు
### ఢిల్లీ మాజీ సిఎం అతిషీ వీడియోను కాషాయ పార్టీ వక్రీకరించిందని ధ్వజం

**బఠిండా:** బిజెపిపై పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్‌సింగ్ మాన్ విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో మతపరమైన అశాంతిని సృష్టించే కుట్రలో భాగంగా ఆమ్ ఆద్మీ పార్టీ నాయకురాలు అతిషీకి సంబంధించిన ఒక వీడియోను కాషాయ పార్టీ వక్రీకరించిందన్నారు. అయితే ఇటువంటి ప్రయత్నాలను తన ప్రభుత్వం విజయవంతం కానివ్వదని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం బఠిండాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాన్ మాట్లాడుతూ భారతీయ ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి చేసిన అసెంబ్లీ ప్రసంగాన్ని బిజెపి ఎడిట్ చేసి, తప్పుడు సబ్‌టైటిల్స్‌ను, గురు తేజ్ బహదూర్ పేరును చొప్పించిందని ఆరోపించారు. ఆయన ఈ చర్యను 'దైవదూషణ'గా అభివర్ణించారు. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నాయకుడు మాట్లాడుతూ అతిషీ ఆ వీడియోలో 'గురు' అనే పదాన్ని ఎప్పుడూ ఉపయోగించలేదని ఫోరెన్సిక్ దర్యాప్తు స్పష్టంగా నిర్ధారించిందని చెప్పారు. 'బిజెపి మతం, ద్వేష రాజకీయాలను అనుసరిస్తుంది, ఇది ఇప్పుడు మళ్లీ పూర్తి స్థాయిలో కనిపిస్తోంది. అతిషీ గురువుకు వ్యతిరేకంగా అభ్యంతరకరమైన పదాలను ఉపయోగించారనే అభిప్రాయాన్ని సృష్టించడానికి బిజెపి ప్రయత్నించింది, కానీ వాస్తవానికి ఆమె అలా చేయలేదు' అని మాన్ అన్నారు. ఢిల్లీ మంత్రి కపిల్ మిశ్రాపై పంజాబ్ పోలీసులు తీసుకున్న చర్యను ముఖ్యమంత్రి మాన్ సమర్థించారు. వక్రీకరించిన క్లిప్ అసెంబ్లీ అధికారిక రికార్డులలో ఎక్కడా లేదని అన్నారు. అటువంటి ప్రకటన చేసి ఉంటే, అది అసెంబ్లీ కార్యకలాపాలలో భాగంగా ఉండేదని, స్పీకర్‌కు తెలిసి ఉండేదని అన్నారు. అతిషీకి సంబంధించిన ఎడిట్ చేసిన, వక్రీకరించిన వీడియోను అప్‌లోడ్ చేసి, ప్రచారం చేసినందుకు జలంధర్ పోలీస్ కమిషనరేట్ ఎఫ్ఐఆర్ నమోదు చేసిందని మాన్ చెప్పారు. ఇక్బాల్ సింగ్ అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు ఈ ఎఫ్ఐఆర్ నమోదైందని, అతిషీ ఆడియో ఉన్న వీడియో క్లిప్‌ను మిశ్రా సోషల్ మీడియా ఖాతా నుండి డౌన్‌లోడ్ చేసి, పరీక్ష కోసం ఎస్ఎఎస్ నగర్‌లోని ఫోరెన్సిక్ సైన్సెస్ లాబొరేటరీ డైరెక్టర్‌కు పంపినట్లు జలంధర్ పోలీసు ప్రతినిధి శుక్రవారం తెలిపారు. 'మేము దానిని పరిశీలించాము. అతిషీ అలాంటి పదాన్ని ఏదీ మాట్లాడలేదని తేలింది. ఇది బిజెపి నీచమైన మనస్తత్వాన్ని చూపిస్తుంది. గతంలో కూడా ఇది ఇలాంటి పనులకు పాల్పడింది. ప్రజలకు తప్పుడు సమాచారం ఇచ్చి వారిని రెచ్చగొట్టడం దాని విధానం. మేము దీనిని తీవ్రంగా ఖండిస్తున్నాము' అని మాన్ అన్నారు.

## వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాలతో అభివృద్ధిని అడ్డుకోవద్దు

### సిజెఐ సూర్యకాంత్ హితవు



**గువహతి :** కొత్త మౌలిక సదుపాయాల అభివృద్ధిని వ్యతిరేకించడానికి 'వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాలు చెల్లుబాటు అయ్యే కారణాలు కాకూడదు' అని భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్ హితవు పలికారు. ఆదివారం ఆయన ఇక్కడ బార్ అసోసియేషన్ నిరసనల మధ్య సిజెఐ సూర్యకాంత్ అసోంలో కొత్త కోర్టు సముదాయానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన నిరసనల పట్ల ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. అసోం రాష్ట్రం కామ్‌రూప్ జిల్లాలోని ఉత్తర గువహతిలో గౌహతి హైకోర్టు బార్ అసోసియేషన్ నిరసనల మధ్య సిజెఐ సూర్యకాంత్ సమీకృత జ్యుడీషియల్ కోర్టు కాంప్లెక్స్‌కు శంకుస్థాపన చేశారు. న్యాయవాదుల నిరసనల నేపథ్యంలో అస్సాం, అరుణాచల్ ప్రదేశ్, మిజోరాం, నాగాలాండ్‌లకు హైకోర్టుగా పనిచేసే గౌహతి హైకోర్టు కొత్త సముదాయాన్ని జ్యుడీషియల్ టౌన్‌షిప్‌లో భాగంగా ప్రతిపాదించారు. ఇది న్యాయవాదుల నుండి నిరసనలకు దారితీసింది. ఈ నిరసనల పట్ల ఆశ్చర్యచకితులైన సిజెఐ సూర్యకాంత్ 'కొత్త కోర్టు సముదాయాన్ని వ్యతిరేకించే వారు అవగాహనలేనివారు లేదా బార్ కొత్త సభ్యుల అవసరాలను గ్రహించనివారు అయ్యి ఉంటారు. భవిష్యత్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధిని వ్యతిరేకించడానికి వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాలు చెల్లుబాటు అయ్యే కారణాలు కాకూడదు' అని నిరసనకారులకు ఉద్బోధించారు. 'ఇంటిగ్రేటెడ్ జ్యుడీషియల్ కోర్టు కాంప్లెక్స్ భవిష్యత్తు ఆకాంక్షలకు అనుగుణంగా రూపొందించబడింది' అని ఆయన చెప్పారు. ఈ కొత్త కాంప్లెక్స్ స్థలం వ్యూహాత్మకంగా ఉంచబడిందని, అన్ని సౌకర్యాలను ఒకే కప్పు కింద అందించబడ్డాయని సిజెఐ జోడించారు. దేశ న్యాయవ్యవస్థ అధిపతి అయిన సూర్యకాంత్ ఈ న్యాయవాద వృత్తిలోకి వచ్చే వారి అవసరాలను తీర్చడానికి తాను సిద్ధంగా ఉన్నానని సిజెఐ నొక్కిచెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ, కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్, సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు, పలువుర ప్రముఖులు కూడాహాజరయ్యారు. అయితే ఈ సమయంలో గౌహతి హైకోర్టు బార్ అసోసియేషన్ (జిహెచ్‌సిబిఎ) ఈ కార్యక్రమాన్ని బహిష్కరించి గురువారం గౌహతి హైకోర్టు పాత భవనం ముందు నిరాహారదీక్షను ప్రారంభించి నాలుగు గంటలపాటు కొనసాగించింది. 'నగరానికి గుండెకాయ అయిన ప్రస్తుత స్థానం నుండి హైకోర్టును మార్చడాన్ని మేం పూర్తిగా వ్యతిరేకిస్తున్నాం. మేం ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు నిరాహార దీక్ష ప్రారంభించాము. మా సభ్యులు ఎవరూ ఈ కార్యక్రమానికి హాజరుకాము' అని జిహెచ్‌సిబిఎ ఉపాధ్యక్షుడు సౌంతాను ఉపాధ్యక్షుడు సౌంతాను బోర్తాకూర్ ఆదివారం ఈ కార్యక్రమానికి ముందు 'పిటిఐ'కి చెప్పారు. కోర్టు సముదాయాన్ని మార్చే చర్యను జిహెచ్‌సిబిఎ మొదటి నుండి వ్యతిరేకిస్తోందన్నారు. కానీ ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయించి ఇప్పుడు కొత్త న్యాయ మౌలిక సదుపాయాలను నిర్మించడానికి ముందుకు వెళుతోందని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ చర్యను కోర్టులో సవాల్ చేస్తామని జిహెచ్‌సిబిఎ తెలిపింది. ప్రభుత్వం రంగమహల్ వద్ద 48 బిఘాల (దాదాపు 49 ఎకరాలు) భూమిలో కొత్త జ్యుడీషియల్ టౌన్‌షిప్‌ను నిర్మించాలని యోచిస్తోంది. గత ఏడాది నవంబర్‌లో ఉత్తర గౌహతిలో ఒక జ్యుడీషియల్ టౌన్‌షిప్ నిర్మించడానికి రాష్ట్ర మంత్రివర్గం మొదటి దశలో రూ.479 కోట్లను ఆమోదించింది. అందరు వాటాదారులు, ప్రజల ప్రయోజనాల దృష్ట్యా ఈ ప్రాజెక్ట్‌ను వెంటనే నిలిపివేయాలని అంతకుముందు జిహెచ్‌సిబిఎ డిమాండ్ చేసిన విషయం తెలిసిందే.

## కేంద్ర సర్కార్ 'గాలి నాణ్యత'ను గాలికొదిలేసింది

### దేశవ్యాప్త సమస్యపై సరైన స్పందన లేదు: కాంగ్రెస్



**న్యూఢిల్లీ:** గాలి నాణ్యత అనేది దేశ వ్యాప్త సమస్య అని, దానిపై కేంద్ర ప్రభుత్వ స్పందన ఏ మాత్రం ప్రభావవంతంగా లేదని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. దేశంలోని చాలా ప్రాంతాల్లో గాలి నాణ్యత సమస్యాత్మకంగానే ఉందని, దీనిపై సర్కారు సరిగ్గా స్పందించడం లేదని విమర్శించారు. గాలి నాణ్యతను గాడిన పెట్టేందుకు 'జాతీయ స్వచ్ఛ గాలి కార్యక్రమం' (ఎన్‌సిఎపి) ద్వారా పకడ్బందీగా సంస్కరణలను అమలు చేయాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు మాజీ పర్యావరణ శాఖ మంత్రి, కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఓ ప్రకటన విడుదల చేశారు. 'నేషనల్ క్లియర్ ఎయిర్ ప్రోగ్రాం'ను కేంద్ర ప్రభుత్వం 'నోషనల్ క్లియర్ ఎయిర్ ప్రోగ్రాం'గా మార్చిందని ఆయన మండిపడ్డారు. 'నేషనల్ క్లియర్ ఎయిర్ ప్రోగ్రాం'ను ఊహాజనిత అంశంగా మోదీ సర్కారు మిగిల్చిందన్నారు. దాని అమలుపై అస్సలు ఫోకస్ పెట్టలేదన్నారు. 'గాలి నాణ్యత అనేది దేశవ్యాప్త సమస్యగా ఉందనే రహస్యాన్ని చాలాకాలం పాటు దాచారు. ఇటీవలే సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్ ఎయిర్ (సిఆర్‌ఇఎ) విశ్లేషణలో ఈ వాస్తవాన్ని వెల్లడించారు. అయినప్పటికీ ఈ నిర్మాణాత్మక సంక్షోభంపై కేంద్ర ప్రభుత్వం స్పందిస్తున్న తీరు సరిగ్గా లేదు. గత ఐదేళ్లుగా (2019–2024) మన దేశ గాలిలో 'పర్టిక్యులేట్ మేటర్ 2.5' (పిఎం 2.5) స్థాయి కాలుష్య ఉద్గారాల మోతాదు పెరుగుతూపోతోంది. దేశంలోని దాదాపు 44 శాతం నగరాల్లో తీవ్ర వాయు కాలుష్యం ఉందని శాటిలైట్ సమాచారం ద్వారా సిఆర్‌ఇఎ గుర్తించింది. అంటే దేశంలోని 4,041 నగరాలు, పట్టణాలకుగానూ 1,787 చోట్ల కాలుష్యం తీవ్ర రూపం దాల్చింది. ఈ విషయం కేంద్రానికి తెలిసినా, కేవలం 130 నగరాలనే 'జాతీయ స్వచ్ఛ గాలి కార్యక్రమం' (ఎన్‌సిఎపి)లో చేర్చారు. ఈ 130 నగరాలకుగానూ 28 చోట్ల ఇప్పటివరకు నిరంతర గాలి నాణ్యతా పర్యవేక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయలేదు. 102 నగరాల్లోనే గాలి నాణ్యతా పర్యవేక్షణ కేంద్రాలు ఉండగా, వీటిలోని 100 నగరాల గాలిలో 80 శాతానికిపైగా 'పిఎం 10' స్థాయి కాలుష్య ఉద్గారాలు ఉన్నాయి. కానీ ప్రస్తుతం దేశంలో తీవ్ర కాలుష్యాన్ని ఎదుర్కొంటున్న కేవలం 4 శాతం నగరాలపైనే 'జాతీయ స్వచ్ఛ గాలి కార్యక్రమం' (ఎన్‌సిఎపి) ఫోకస్ పెడుతోంది' పకడ్బందీగా అని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ పేర్కొన్నారు.

## సిఎం కుర్చీ కోసం కుమ్ములాట లేదు

### అదంతా మీడియా సృష్టే : సిద్ధరామయ్య



**మంగళూరు:** కర్ణాటక కాంగ్రెస్‌లో ముఖ్యమంత్రి పీఠం కోసం మళ్లీ వివాదం ప్రారంభం కానుందన్న వార్తలను సిఎం సిద్ధరామయ్య ఖండించారు. రాష్ట్రంలో సిఎం కుర్చీ కోసం ఎలాంటి గొడవ లేదని, ఇదంతా కేవలం మీడియా సృష్టి మాత్రమేనన్నారు. అనవసరమైన ప్రశ్నలతో గందరగోళం సృష్టించ వద్దని మీడియాపై సిద్ధరామయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం మంగళూరులో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సంక్రాంతి తర్వాత కాంగ్రెస్‌లో అసలు సిసలైన కుర్చీ పోరు మొదలవుతుందని బిజెపి సోషల్ మీడియాలో చేస్తున్న ప్రచారాన్ని ఆయన తిప్పికొట్టారు. తన ప్రభుత్వానికి, పదవికి ఎలాంటి ఢోకా లేదని, ఐదేళ్లు తామే సుస్థిర పాలన అందిస్తామని ఆయన పరోక్షంగా స్పష్టం చేశారు.

**విద్వేష ప్రసంగాల బిల్లుపై రచ్చ**

ఈ సందర్భంగా గవర్నర్ ఆమోదం కోసం పెండింగ్‌లో ఉన్న 'ద్వేషపూరిత ప్రసంగాల నిరోధక బిల్లు' గురించి కూడా సిఎం మాట్లాడారు. ఈ బిల్లును ఆమోదించవద్దని బిజెపి గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్‌ను కోరింది. దీనిపై సిఎం స్పందిస్తూ, 'ఈ బిల్లును చట్టసభలు ఆమోదించాయి. గవర్నర్ దీన్ని తిరస్కరించలేదు, వెనక్కి పంపలేదు, అలాగని ఆమోదమూ తెలపలేదు. ఆయన ఎప్పుడు పిలిస్తే అప్పుడు రాజ్ భవన్‌కు వెళ్తాను. బిల్లు ఆవశ్యకత గురించి గవర్నర్‌కు స్వయంగా వివరిస్తాను' అని చెప్పారు. ద్వేషపూరిత ప్రసంగాలు, నేరాలకు పాల్పడితే రూ.50 వేల జరిమానాతో పాటు ఏడాది నుంచి ఏడేళ్ల వరకు జైలు శిక్ష విధించేలా ఈ బిల్లులో కఠిన నిబంధనలు ఉన్నాయి.

**బళ్లారి పాదయాత్ర, బిజెపి డ్రామా?**

బళ్లారిలో ఇటీవల జరిగిన ఘర్షణల నేపథ్యంలో బిజెపి 'బళ్లారి టు బెంగళూరు' పాదయాత్ర చేపట్టాలని నిర్ణయించింది. దీనిపై స్పందించిన సిఎం, వాళ్లను యాత్ర చేసుకోనివ్వండి. వద్దని ఎవరు చెప్పారు? అంటూ సిద్ధరామయ్య ఎద్దేవా చేశారు. 'గతంలో మేం (కాంగ్రెస్) పాదయాత్ర చేసింది ఒక నిర్దిష్ట కారణం కోసం. అప్పట్లో బళ్లారిని గాలి జనార్ధన్ రెడ్డి సోదరులు అక్రమ మైనింగ్‌తో రిపబ్లిక్ ఆఫ్ బళ్లారిగా మార్చేశారని లోకాయుక్త నివేదిక ఇచ్చింది. అసెంబ్లీలో నేను మాట్లాడితే అప్పటి సిఎం యడియూరప్ప, రెడ్డి సోదరులు అడ్డుకున్నారు. అందుకే నేను పాదయాత్ర చేసి వారి అక్రమాలను బయటపెట్టాను. అది 2013లో మా గెలుపునకు పునాది వేసింది. కానీ ఇప్పుడు బిజెపి చేస్తోంది కేవలం రాజకీయ లబ్ధి కోసమే' అని విమర్శించారు.

## ఇండోర్‌లో 'స్వచ్ఛ జల్ అభియాన్' ప్రారంభం

### ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన నీటిని అందించడం రాష్ట్ర బాధ్యత : సిఎం మోహన్ యాదవ్



**భోపాల్:** ఇండోర్‌లో కలుషిత నీటి కారణంగా సంభవించిన మరణాల నేపథ్యంలో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ మోహన్ యాదవ్ రాష్ట్రవ్యాప్తంగా స్వచ్ఛ జల్ అభియాన్‌ను ప్రారంభించారు. ఈ ప్రచారంలో నీరు, మురుగునీటి పైప్‌లైన్‌ల జిఐఎస్ మ్యాపింగ్, కూడలి పాయింట్ల గుర్తింపు, రోబోలను ఉపయోగించి లీకేజీల తనిఖీలు వంటివి ముఖ్యమైన అంశాలుగా ఉండనున్నాయి. నీటి భద్రత, పరిరక్షణ, ఫిర్యాదుల పరిష్కారాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో, ఈ ప్రచారం రెండు దశల్లో నిర్వహించనున్నారు. మొదటి దశ జనవరి 10 నుండి ఫిబ్రవరి 28 వరకు, రెండవ దశ మార్చి 1 నుండి మార్చి 31 వరకు జరుగుతుంది. ఈ ప్రచారంలో పౌరుల గళాన్ని వినే హక్కును నిర్ధారించడానికి, స్వచ్ఛమైన తాగునీటిని అందించడానికి ప్రతి మంగళవారం జల్ సున్వాయి (ప్రజా విచారణ) ఉంటుంది. సమర్థవంతమైన అమలు కోసం ప్రజల అవగాహన, సమాజ భాగస్వామ్యంపై దృష్టి సారిస్తారు. అలాగే, 181 (సిఎం హెల్ప్‌లైన్) ద్వారా తాగునీటికి సంబంధించిన ఫిర్యాదులను నమోదు చేయడానికి ప్రత్యేక సదుపాయం కల్పించబడుతుంది. ఇది తాగునీటి సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను కాలపరిమితిలోగా పరిష్కరించడంపై కూడా ప్రధానంగా దృష్టి సారిస్తుంది, అదే సమయంలో దరఖాస్తుదారులకు తగిన సమాచారం అందిస్తుంది. వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ఈ ప్రచారాన్ని ప్రారంభిస్తూ ముఖ్యమంత్రి మాట్లాడుతూ 'ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన నీటిని అందించడం రాష్ట్ర బాధ్యత. సాంకేతికతను ఉపయోగించి జవాబుదారీతనంతో విధులు నిర్వర్తించాలి. తాగునీటి నాణ్యతను క్రమం తప్పకుండా పరీక్షించాలి. నీరు కలుషితమైన సందర్భంలో తక్షణ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి. కలుషిత నీటి సరఫరా విషయంలో సున్నా సహనం పాటించాలి. ప్రచారం అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులు, ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకోవాలి' అని అన్నారు. ఇండోర్‌లోని భగీరత్‌పురా ప్రాంతంలో ప్రాణాంతక అతిసార వ్యాధి ప్రబలిన నేపథ్యంలో ఈ ప్రచారం ప్రారంభమైంది. డిసెంబర్ 24 నుండి ఈ వ్యాధి కారణంగా 21 మంది మరణించగా, 40 మందికి పైగా ఆసుపత్రిలో చేరారు.

## కేరళలో లైంగిక దాడి కేసు...

### ఎమ్మెల్యే రాహుల్ మమ్కూతతిల్ అరెస్ట్



**పతానంతిట్ట :** కేరళలో కాంగ్రెస్ బహిష్కృత ఎమ్మెల్యే రాహుల్ మమ్కూతతిల్‌ను లైంగిక దాడి కేసులో ఆదివారం తెల్లవారుజామున పాలక్కాడ్‌లో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అక్కడి నుంచి పోలీసు క్యాంపునకు తరలించారు. పోలీసుల ప్రకారం ఈనెల 8న పతానంతిట్ట జిల్లాకు చెందిన ఒక మహిళ ఫిర్యాదు మేరకు పాలక్కాడ ఎమ్మెల్యేపై ఇటీవల మూడవసారి లైంగిక దాడి కేసు నమోదైంది. ప్రస్తుతం కెనడాలో ఉన్న ఆ మహిళ, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పోలీసులకు తన వాంగ్మూలాన్ని ఇచ్చింది. వర్గాల సమాచారం ప్రకారం, ఫిర్యాదుదారు వివాహిత మహిళ. ఆమె తన వైవాహిక జీవితంలో సమస్యల కారణంగా 2024లో మమ్కూతతిల్‌తో పరిచయం ఏర్పరచుకుంది. పెళ్లి చేసుకుంటానని వాగ్దానం చేసి, ఏప్రిల్ 2024లో ఒక హోటల్‌లో మమ్కూతతిల్ తనపై అత్యాచారం చేశాడని ఆమె పోలీసులకు తెలిపింది. అత్యాచారానికి ముందు ఆమెపై దారుణంగా దాడి జరిగిందని రిమాండ్ నివేదిక పేర్కొంది. ఆమె గర్భవతి అయినప్పుడు, మమ్కూతతిల్ బాధ్యత తీసుకోవడానికి నిరాకరించి, అబార్షన్ చేయించుకోవాలని బెదిరించాడని పోలీసులు తెలిపారు. మమ్కూతతిల్ తన నుండి చాలాసార్లు డబ్బు కూడా తీసుకున్నాడని బాధితురాలు ఆరోపించింది. కేసు నమోదు చేసిన తర్వాత, పోలీసులు మమ్కూతతిల్‌పై నిఘా పెట్టారు. ఆ తర్వాత, ఒక డిప్యూటీ ఎస్పీ నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల బృందం తెల్లవారుజామున 12.15 గంటల ప్రాంతంలో అతను బస చేస్తున్న హోటల్ గదికి చేరుకుందని వర్గాలు తెలిపాయి. తెల్లవారుజామున 12.30 గంటల ప్రాంతంలో అతడిని హోటల్ నుండి అదుపులోకి తీసుకుని, ఉదయం 5.30 గంటలకు పతానంతిట్ట పోలీసు క్యాంపునకు తరలించారు. అతనిపై ఇదే తరహాలో ఉన్న మరో రెండు కేసులను దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)కే తాజా కేసు దర్యాప్తు బాధ్యతలను కూడా అప్పగించినట్లు వర్గాలు తెలిపాయి. సిట్ అధిపతి జి పూంగుజాలి పోలీసు క్యాంపునకు చేరుకుని మమ్కూతతిల్‌ను విచారిస్తున్నారు. ప్రాథమిక విచారణ అనంతరం అతన్ని అరెస్టు చేశారు. వైద్య పరీక్షల తర్వాత, అతడిని మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా, ఆయన అతడికి జ్యుడీషియల్ కస్టడీ విధించారు. సిట్ అతని కస్టడీ కోరుతూ ఒక దరఖాస్తు దాఖలు చేసింది, దీనిని సోమవారం పరిశీలించనున్నారు. మమ్కూతతిల్ బెయిల్ పిటిషన్ కూడా దాఖలు చేశాడని, దానిని కూడా అదే రోజు పరిశీలిస్తారని పోలీసులు తెలిపారు. తరువాత, అతన్ని అలప్పుజ జిల్లాలోని మావెలికర సబ్ జైలుకు తరలించారు.

## ఉత్తరాదిని చంపేస్తున్న చలి..

### కశ్మీర్‌లో పాక్షికంగా గడ్డకట్టిన దాల్ సరస్సు

**న్యూఢిల్లీ :** ఉత్తరాది రాష్ట్రాలను చలి చంపేస్తోంది. ముఖ్యంగా హిమాలయాల సమీపంలో ఉన్న రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు మైనస్ డిగ్రీలకు పడిపోయాయి. జమ్ము కశ్మీర్‌లో పరిస్థితి మరింత తీవ్రంగా ఉన్నది. వీధుల్లో, ఇండ్లపైన ఎక్కడికక్కడ మంచు పేరుకుపోయింది. కశ్మీర్ లోయలోని సరస్సులు, చెరువులు, కుంటలలో ఉన్న నీరు గడ్డ కట్టుకుపోయింది. కశ్మీర్‌లో ప్రముఖ పర్యాటక ప్రాంతమైన దాల్ సరస్సులో కూడా చలి తీవ్రతకు నీరు పాక్షికంగా గడ్డకట్టింది. సరస్సు పైభాగంలో చాలావరకు నీరు గడ్డకట్టి మంచు పొర ఏర్పడింది. ఇలాంటి సమయంలో దాల్ సరస్సును వీక్షించడం భక్తులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది.

### ఢిల్లీ 'గజగజ'

దేశ రాజధాని ఢిల్లీని 'చలి' పులి గజగజ వణికిస్తోంది. నగరంలోని కొన్ని ప్రాంతాలలో ఆదివారం తీవ్రస్థాయిలో చలిగాలులు వీచాయి. కొన్ని ప్రాంతాలలో కనిష్ట ఉష్ణోగ్రతలు 4.1 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువగా నమోదు అయ్యాయి. ఢిల్లీలో కనిష్ట ఉష్ణోగ్రత 4.8 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యింది. ఇది కాలానుగుణ సగటు కంటే 2.6 డిగ్రీల సెల్సియస్ ఎక్కువగా ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండి) తెలిపింది. తీవ్రతరమైన ఈ చలిగాలులకు 'ఎల్లో అలర్ట్' జారీ చేసింది. భారత వాతావరణ శాఖ ప్రకారం సోమవారం కూడా చలిగాలులు కొనసాగే అవకాశం ఉంది. కనిష్ట ఉష్ణోగ్రత సగటు ఉష్ణోగ్రత కంటే 4.5 నుంచి 6.5 డిగ్రీల సెల్సియస్ తక్కువగా ఉన్నప్పుడు శీతల గాలులు (కోల్డ్ వేవ్) ప్రకటిస్తారు. ఆదివారం నాడు సఫ్దర్‌జంగ్‌లో అతి తక్కువగా 4.8డిగ్రీల సెల్సియస్ నమోదు అయ్యింది. పాలంలో 3 డిగ్రీల సెల్సియస్ (సీజనల్ సగటు కంటే 4.3 నోచెస్ తక్కువ), లోధి రోడ్‌లో 4.6 డిగ్రీల సెల్సియస్ (సాధారణం కంటే 1.4 నోచెస్ ఎక్కువ), ది రిడ్జి లో 3.7 డిగ్రీల సెల్సియస్ (సాధారణం కంటే 4.4 నోచెస్ ఎగువన), అయానగర్‌లో 2.9 డిగ్రీల సెల్సియస్ (సాధారణం కంటే 4.2 నోచెస్ తక్కువ) అని భారత వాతావరణ శాఖ డేటా చూపింది. ఢిల్లీ నగరంలో సాపేక్ష ఆర్ద్రత ఉదయం 8.30గంటలకు 97 శాతంగా నమోదు



అయ్యింది. ఢిల్లీలోని వాయు నాణ్యత సూచిక (ఎక్యుఐ) ఉదయం 9గంటలకు 295 వద్ద 'పూర్' కేటగిరీ వద్ద ఉన్నదని సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ (సిపిసిబి) డేటా చూపింది. 050 మధ్య 'గుడ్' అని, 51100 మధ్య 'సంతృప్తికరం' అని, 101200మధ్య 'మోడరేట్' కేటగిరీ 201 300 మధ్య 'పూర్' అని, 301400 మధ్య 'వెరీ పూర్' కేటగిరీ, 401500 మధ్య 'తీవ్రం'గా ఉందని భావిస్తారు. వాతావరణ శాఖ ఆదివారం చల్లటి గాలుల 'ఎల్లో అలర్ట్'ను అంచనా వేసింది. గరిష్ట ఉష్ణోగ్రత 17 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకునే అవకాశం ఉందని ఐఎండి తెలిపింది.

## ప్రముఖ సింగర్ ప్రశాంత్ తమాంగ్ కన్నుమూత



**న్యూఢిల్లీ:** ప్రముఖ సింగర్, ఇండియన్ ఐడల్ మూడవ ఎడిషన్ విజేత ప్రశాంత్ తమాంగ్ కన్నుమూశారు. గుండెపోటుతో ఆయన మరణించినట్టు తెలుస్తోంది. ప్రశాంత్ మరణాన్ని ఆయన స్నేహితుడు, ఇండియన్ ఐడల్ కో కంటెస్టెంట్ భవేన్ ధనాక్ ధ్రువీకరించారు. అకస్మాత్తుగా ప్రశాంత్ ఈ లోకాన్ని వీడటం తమను షాక్‌కు గురి చేసిందని చెప్పారు. గుండెపోటుతో ప్రశాంత్ మరణించినట్టు అనుకుంటున్నామని చెప్పారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని అన్నారు. ప్రశాంత్ కొంతకాలంగా ఢిల్లీలో ఉంటున్నారని ఆయన చెప్పారు. ఇండియన్ ఐడల్ సమయంలో తాము రూమ్ మేట్స్‌గా ఉండేవాళ్లమని కూడా వివరించారు. ఇండియన్ ఐడల్ ద్వారా పాప్యులర్ కాకమునుపు ప్రశాంత్ పశ్చిమ బెంగాల్ పోలీసు శాఖలో కానిస్టేబుల్‌గా పని చేశారు. ఆయన భార్య, ఒక కూతురు ఉన్నారు. ఇక ప్రశాంత్ మృతిపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఎక్స్ వేదికగా విచారం వ్యక్తం చేశారు. ఆయన మృతి వార్త తమను కలచివేసిందని అన్నారు. ఇండియన్ ఐడల్ షోలో రాణించడంతో పాటు దేశవ్యాప్తంగా మంచి గుర్తింపును సొంతం చేసుకున్నారని తెలిపారు. డార్జిలింగ్‌కు చెందిన ప్రశాంత్ పోలీసు శాఖలో కూడా పనిచేసి రాష్ట్ర ప్రజలకు మరింత దగ్గరయ్యారని అన్నారు. ఆయన కుటుంబసభ్యులు, స్నేహితులు, అభిమానులకు సంఘీభావం తెలిపారు. సల్మాన్ ఖాన్ హీరోగా నటించిన బ్యాటిల్ ఆఫ్ గల్వాన్‌లో ప్రశాంత్ ఇటీవల తళుక్కుమన్నారు.

## 'సోమనాథ్' పునర్నిర్మాణ వ్యతిరేక శక్తులు ఇప్పటికీ చురుకుగా ఉన్నాయ్

### వాటిని ఓడించేందుకు భారత్ అప్రమత్తంగా, ఐక్యంగా, శక్తివంతంగా ఉండాలి : ప్రధాని మోదీ



**సోమనాథ్:** స్వాతంత్ర్యం తర్వాత గుజరాత్‌లోని సోమనాథ్ ఆలయ పునర్నిర్మాణాన్ని వ్యతిరేకించిన శక్తులు ఇప్పటికీ చురుకుగా ఉన్నాయని, వాటిని ఓడించడానికి భారతదేశం అప్రమత్తంగా, ఐక్యంగా, శక్తివంతంగా ఉండాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. సోమనాథ్ చరిత్ర విధ్వంసం, ఓటమికి సంబంధించినది కాదని, అది విజయం, పునరుజ్జీవనానికి సంబంధించినదన్నారు. 'ఇది కాలచక్రం, దాని కారణంగా మతతత్వ దురాక్రమణదారులు ఇప్పుడు చరిత్ర పుటలకే పరిమితమయ్యారు, కానీ సోమనాథ్ ఆలయం మాత్రం నేటికీ సగర్వంగా నిలబడి ఉంది' అని ఆయన అన్నారు. 1026వ సంవత్సరంలో గజనీ మహమూద్ సోమనాథ్ ఆలయంపై దాడి చేసి 1,000 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఇక్కడ జరిగిన సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్‌లో మోదీ ఆదివారం ప్రసంగించారు. శతాబ్దాలుగా దానిని నాశనం చేయడానికి అనేకసార్లు ప్రయత్నాలు జరిగినప్పటికీ, సోమనాథ్ ఆలయం దాని ప్రాచీన వైభవాన్ని పునరుద్ధరించడానికి చేసిన సామూహిక సంకల్పం, ప్రయత్నాల కారణంగా నేడు స్థితిస్థాపకత, విశ్వాసం, జాతీయ గర్వానికి శక్తివంతమైన చిహ్నంగా నిలుస్తోంది. 'విద్వేషం, అకృత్యం, భయ భ్రాంతుల నిజమైన చరిత్రను మన నుండి దాచిపెట్టారు. ఆ దాడి ఆలయాన్ని దోచుకోవడానికి చేసిన ప్రయత్నమని మనకు బోధించారు' అని చెప్పారు. స్వాతంత్ర్యం తర్వాత, సర్దార్ వల్లభాయ్ పటేల్ సోమనాథ్ ఆలయాన్ని పునర్నిర్మించడానికి ప్రతిజ్ఞ చేయగా, ఆయన మార్గానికి అడ్డంకులు సృష్టించారని విమర్శించారు. 'బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడిన వారు తీవ్రవాద మనస్తత్వం ఉన్న అలాంటి వ్యక్తుల ముందు మోకరిల్లారు. సోమనాథ్ ఆలయ పునర్నిర్మాణానికి అడ్డంకులు సృష్టించడానికి ప్రయత్నించిన ఆ శక్తులు ఇప్పటికీ మన మధ్యనే ఉన్నాయి. అలాంటి శక్తులను ఓడించడానికి మనం అప్రమత్తంగా, ఐక్యంగా మరియు శక్తివంతంగా ఉండాలి' అని మోదీ అన్నారు. 'సోమనాథ్ కథ భారతదేశ కథ; ఈ ఆలయం వలెనే విదేశీ దురాక్రమణదారులు భారతదేశాన్ని చాలాసార్లు నాశనం చేయడానికి ప్రయత్నించారు. ఆలయాన్ని ధ్వంసం చేయడం ద్వారా తాము గెలిచామని ఆ దురాక్రమణదారులు భావించారు. కానీ 1,000 సంవత్సరాల తర్వాత కూడా సోమనాథ్ జెండా సగర్వంగా రెపరెపలాడుతోంది' అని మోదీ అన్నారు. 1,000 సంవత్సరాల ఈ పోరాటానికి ప్రపంచ చరిత్రలో సాటి లేదని ఆయన పేర్కొన్నారు.

## మనోభావాలు దెబ్బతీసినట్లు ఆరోపణలు స్కూల్ హెచ్ఎం సస్పెన్షన్

**రాయ్‌పూర్:** దేశంలో మతవాదులు పేట్రేగిపోతున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో ఓ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మతపరమైన మనోభావాలను దెబ్బతీసినట్లు ఆరోపణలు రావడంతో ఆమెపై సస్పెన్షన్ వేటు పడింది. 4వ తరగతి ఇంగ్లీష్ ప్రశ్నాపత్రంలో అడిగిన ప్రశ్న సస్పెన్షన్‌కు దారితీసింది. కాంట్రాక్టు మహిళా ఉపాధ్యాయురాలు అయిన పేపర్ మోడరేటర్‌ను సర్వీస్ నుండి తొలగించడానికి కూడా క్రమశిక్షణా చర్యలు ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. రాయ్‌పూర్ డివిజన్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఇటీవల జరిగిన అర్ధ వార్షిక పరీక్షల సమయంలో, ఒక ఇంగ్లీష్ పేపర్‌లో మోనా కుక్క పేరు ఏమిటి? అనే ప్రశ్నకు జవాబుగా ఎంచుకునేందుకు నాలుగు ఆప్షన్లు ఇచ్చారు. ఒక ఆప్షన్‌లో 'రామ్' అనే పేరు ఉంది. ఇది హిందూ మతంలో శ్రీరాముడు గౌరవనీయమైన దేవుడు కాబట్టి అభ్యంతరాలను రేకెత్తించింది. ఇతర ఎంపికలు 'బాలా', 'షేరు', 'నో వన్' అని ఉన్నాయి. ఈ విషయం మొదట మహాసముంద్ జిల్లాలో, తరువాత రాయ్‌పూర్ డివిజన్‌లోని ఇతర జిల్లాల్లో వెలుగులోకి వచ్చింది. ఇది వివాదానికి దారితీసింది. ఉదారవాద సంస్థల నుండి నిరసనలకు దారితీసింది. ఫిర్యాదుల ఈ విషయాన్ని పరిశీలించడానికి విచారణ కమిటీని ఏర్పాటు చేశారు.

## బంగ్లాదేశీయుల నుంచి ముంబయికి విముక్తి

### సాంకేతికత ఆధారిత పాలనను అందిస్తాం మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికల మేనిఫెస్టోలో 'మహాయుతి' హామీ

**ముంబయి:** మహారాష్ట్రలో మున్సిపల్ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో బిజెపి నేతృత్వంలోని మహాయుతి కూటమి ఆదివారం మేనిఫెస్టోను విడుదల చేసింది. బంగ్లాదేశీయులు, రోహింగ్యాల నుండి ముంబయి నగరాన్ని విముక్తి చేస్తామనే హామీతో పాటు సాంకేతికత ఆధారిత పాలనను అందిస్తామని హామీనిచ్చింది. అవినీతిని అరికట్టడానికి, అనుమతులను వేగవంతం చేయడానికి, సేవా బట్వాడాను మెరుగుపరచడానికి కృత్రిమ మేధస్సు (ఎఐ)ను వినియోగిస్తామని కూడా వాగ్దానం చేసింది. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఎన్నికల ప్రణాళికా పత్రాన్ని ఆవిష్కరించారు. దీర్ఘకాలిక పౌర సమస్యలను పరిష్కరించడానికి, పౌరుల మొబైల్ ఫోన్‌లకు సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి స్థానిక అధికారయ యంత్రాంగంతో జపనీస్ టెక్నాలజీని జతపర్చాలని కూడా కూటమి ప్రణాళిక వేసిందని చెప్పారు. నగరం గత 25 సంవత్సరాలు అసమర్థ పాలనను చూసిందని, ఇప్పుడు పరిపాలనలో పారదర్శకతను తీసుకురావడానికి తమకు అవకాశం ఇవ్వాలని ప్రజలకు చెప్పాలనుకుంటున్నానన్నారు. 'అవినీతి రహిత మునిసిపల్ కార్పొరేషన్ మా లక్ష్యం' అని ఫడ్నవీస్ పేర్కొన్నారు. మొబైల్‌లో మునిసిపాలిటీ సేవలు, భవన అనుమతులను వేగంగా ట్రాక్ చేయడానికి, రియల్ ఎస్టేట్ రంగంలో పారదర్శకతను నిర్ధారించడానికి ఎఐ ఆధారిత సేవలను వినియోగిస్తామన్నారు. భవిష్యత్తులో సిద్ధంగా ఉన్న నైపుణ్యాలతో విద్యార్థులను సన్నద్ధం చేయడానికి మున్సిపల్ పాఠశాలల్లో ఎఐ ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

# కమ్యూనిజమే సాహిత్యానికి ప్రాణం..

కమ్యూనిస్టు దృక్పథం నేటి సాహిత్యంలో ఎందుకు మరింత కీలకంగా మారిందో అర్థం చేసుకోవాలంటే, ముందుగా మనం జీవిస్తున్న సామాజిక– ఆర్థిక– రాజకీయ కాలాన్ని గమనించాలి. 21వ శతాబ్దపు తొలి పావు భాగం పూర్తవుతున్న ఈ దశలో ప్రపంచం ఒక వైపు అపూర్వమైన సాంకేతిక అభివృద్ధిని చూస్తుంటే, మరో వైపు అంతకుమించిన స్థాయిలో అసమానతలు, అస్థిరతలు, యుద్ధాలు, వలసలు, వాతావరణ సంక్షోభం, ఉపాధి సంక్షోభం వంటి బహుళ సంక్షోభాల మధ్య ఊగిసలాడుతోంది. ఈ విరోధాభాసాల మధ్య సాహిత్యం ఒక సున్నితమైన సిస్మోగ్రాఫ్‌లా పనిచేస్తూ సమాజపు లోతైన కంపనాలను పట్టుకుంటోంది. ఈ సందర్భంలో కమ్యూనిస్టు ఆలోచన ఒక రాజకీయ నినాదంగా కాకుం డా, ఈ కంపనాలను అర్థం చేసుకునే ఒక విశ్లేషణాత్మక కంటి లాగా సాహిత్యంలోకి తిరిగి ప్రవేశిస్తోంది. కమ్యూనిజం గురించి మాట్లాడేటప్పుడు చాలామందికి వెంటనే 20వ శతాబ్దపు సోవియట్ యూనియన్, చైనా సాంస్కృతిక విప్లవం, తూర్పు యూరప్ నియంతృ త్వాలు గుర్తుకు వస్తాయి. అయితే అవి తీవ్రమైన లోపాలతో, మానవ హక్కుల ఉల్లంఘనలతో, రాజకీయ అణచివేతలతో గుర్తించబడిన చరిత్రాత్మక అనుభవాలన్న ఆరోపణలు కూడా లేకపోలేదు. ఆ కోణంలోనే పుంఖాను పుంఖంగా రచనలు వెలువడ్డాయి కూడా. అయితే ఆ అనుభవాలను మార్క్స్ ప్రతిపాదించిన మూల సిద్ధాంతంతో సమానంగా చూడటం ఒక మేధో తప్పిదం. మార్క్సిజం అనేది ప్రధానంగా కాపిటలిస్టు సమాజాన్ని విశ్లేషించే ఒక విమర్శాత్మక సిద్ధాంతం. అది సంపద ఎలా ఉత్పత్తి అవుతుంది, ఎలా పంపిణీ అవుతుంది, ఆ ప్రక్రియలో ఎవరు లాభపడుతున్నారు, ఎవరు నష్టపోతున్నారు అనే ప్రశ్నలను అడుగుతుంది. సాహిత్యానికి ఈ ప్రశ్నలు అత్యంత సహజమైనవి, ఎందుకంటే సాహిత్యం ఎప్పుడూ మనుషుల జీవితం, వారి పోరాటాలు, వారి ఆశలు, వారి ఓటముల గురించే మాట్లాడుతుంది. కాగా, నేటి గ్లోబల్ కాపిటలిజం ఒక విచిత్రమైన దశలో ఉంది. ఒకవైపు బిలియనీర్ల సంఖ్య పెరుగుతోంది, స్టాక్ మార్కెట్లు రికార్డులు సృష్టిస్తున్నాయి, టెక్నాలజీ కంపెనీలు అపూర్వమైన లాభాలు ప్రకటిస్తున్నాయి. మరోవైపు కోట్లాది మంది ప్రజలు నిరుద్యోగం, తక్కువ వేతనాలు, అప్పులు, ఆరోగ్య వ్యయాలు, గృహాల కొరత వంటి సమస్యలతో పోరాడుతున్నారు. మధ్యతరగతి క్రమంగా సంకుచితమవుతోంది. ఈ ఆర్థిక విరోధం సాహిత్యంలో ప్రతిధ్వనించకుండా ఉండలేదు. ఆధునిక నవలలు, కథలు, కవితలు కార్పొరేట్ ప్రపంచంలో నలిగిపోతున్న వ్యక్తులను, గిగ్ ఎకానమీ కార్మికులను, డెలివరీ బాయ్స్, కాల్ సెంటర్ ఉద్యోగులు, ఫ్రీలాన్సర్లను, స్టార్టప్ కలల వెనుక దాగి ఉన్న అనిశ్చితిని చిత్రిస్తున్నాయి. కమ్యూనిస్టు దృక్పథం ఈ కథనాలకు ఒక నిర్మాణాత్మక అర్థాన్ని ఇస్తుంది. ఈ బాధలు వ్యక్తిగత వైఫల్యాల వల్ల కాదు, వ్యవస్థలోని లోపాల వల్ల అని అది స్పష్టం చేస్తుంది. మార్క్స్ ప్రతిపాదించిన 'పరాయీకరణ' భావన నేటి డిజిటల్ యుగంలో మరింత గాఢంగా కనిపిస్తోంది. ఒకప్పుడు కార్మికుడు తన చేతులతో తయారు చేసిన వస్తువును చూసి కొంత సంతృప్తి పొందేవాడు. ఇప్పుడు అల్గారిథమ్స్, ఆటోమేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మధ్య మనిషి తన పని ఫలితాన్ని కూడా గుర్తించలేని స్థితిలో ఉన్నాడు. ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ రాసిన కోడ్ ప్రపంచంలోని ఏదో మూలలో ఎవరో ఉపయోగిస్తారు, కానీ అతనికి ఆ వినియోగం యొక్క మానవీయ కోణం కనిపించదు. ఒక గిగ్ వర్కర్ యాప్ ద్వారా ఆదేశాలు అందుకుని పనులు చేస్తాడు, కానీ తన యజమాని ఎవరో కూడా తెలియదు. ఈ అనామకత్వం, ఈ విభ్రాంతి, ఈ అర్థరహితత సాహిత్యంలో తీవ్రమైన మానసిక ఒత్తిళ్లుగా రూపాంతరం చెందుతోంది. కమ్యూనిస్టు విశ్లేషణ ఈ పరిస్థితిని ఒక వ్యక్తిగత డిప్రెషన్‌గా కాకుండా, ఉత్పత్తి సంబంధాల ఫలితంగా చూపిస్తుంది. అందువల్ల ఒక కథానాయకుడి ఒంటరితనం కూడా రాజకీయ అర్థాన్ని పొందుతుంది.

నేటి మీడియా సంస్కృతి కూడా మార్క్స్ చెప్పిన పాలక వర్గపు ఆలోచనలు భావనను గుర్తు చేస్తుంది. సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు మన దృష్టిని ఎప్పటికప్పుడు కొత్త ట్రెండ్స్, వైరల్ వీడియోలు, సెలబ్రిటీ గాసిప్‌ల వైపు మళ్లిస్తుంటాయి. వినియోగం ఒక జీవనశైలిగా మారింది. బ్రాండ్లు మన స్వీయ గుర్తింపులు అవుతున్నాయి. ఈ నేపథ్యంలో అసమానతలు, కార్మిక హక్కులు, పర్యావరణ విధ్వంసం వంటి మౌలిక ప్రశ్నలను తరచూ అంచుల్లోకి నెట్టివేయడం కళ్ల ముందు కనిపిస్తున్న వాస్తవం. సాహిత్యం, కమ్యూనిస్టు దృష్టితో, ఈ మాయాజాలాన్ని ఛేదించగలదు. ప్రకటనల వెనుక ఉన్న శక్తి సంబంధాలు, మీడియా యాజమాన్యాల రాజకీయాలు, వినోద పరిశ్రమలోని వర్గభేదాలు కథలుగా వెలుగులోకి వస్తాయి. ఈ విధంగా సాహిత్యం ఒక సాంస్కృతిక ప్రతిఘటనగా మారుతుంది. ఇటీవలి కాలంలో ప్రపంచవ్యాప్తంగా కార్మిక ఉద్యమాలు, రైతు పోరాటాలు, మహిళా హక్కుల ఉద్యమాలు, జాతి వివక్షకు వ్యతిరేక ఉద్యమాలు మళ్లీ ఊపందుకున్నాయి. ఇవి రాజకీయ వార్తలుగా మాత్రమే కాదు, సాహిత్య ఇతివృత్తాలుగా కూడా మారుతున్నాయి. నిరసనల్లో పాల్గొనే యువత, పోలీస్ అణచివేత, సోషల్ మీడియా ద్వారా



సంఘీభావం, ఉద్యమాల అంతర్గత విభేదాలు... వంటి అంశాలన్నీ రచనల్లో ప్రతిబింబిస్తున్నాయి. కమ్యూనిస్టు ఆలోచన ఈ పోరాటాలకు ఒక చారిత్రక–సిద్ధాంతాత్మక నేపథ్యాన్ని ఇస్తుంది. అది ఈ ఉద్యమాలను విడివిడిగా కాకుండా, ఒక విస్తృత తరగతి పోరాటంలో భాగంగా చూపిస్తుంది. వాతావరణ సంక్షోభం నేటి సాహిత్యంలో అత్యంత కీలక అంశంగా ఎదిగింది. వరదలు, కరువులు, అడవుల నాశనం, సముద్ర మట్టం పెరుగుదల, వలసలు తదితరాలన్నీ మనిషి–ప్రకృతి సంబంధం ఎంత అస్థిరంగా మారిందో చూపిస్తున్నాయి. కార్పొరేట్ లాభాల కోసం భూమిని, నీటిని, గాలిని దోచుకోవడం ఈ సంక్షోభానికి మూల కారణం. ఈ నేపథ్యంలో ఈకో–సోషలిస్టు ఆలోచనలు సాహిత్యంలోకి వస్తున్నాయి. సామూహిక యాజమాన్యం, స్థిరమైన వినియోగం, స్థానిక సమాజాల హక్కులు వంటి భావనలు కథలుగా రూపుదిద్దుకుంటున్నాయి. ఒక అడవి గ్రామం తన భూమిని కార్పొరేట్ మైనింగ్ నుంచి రక్షించుకునే కథ, ఒక తీరప్రాంత సమాజం వాతావరణ మార్పులతో పోరాడే గాథ వంటివన్నీ కమ్యూనిస్టు దృష్టితో ఒక పెద్ద పర్యావరణ–సామాజిక కథనంగా మారుతాయి.

భారతీయ సందర్భంలో కూడా ఈ దృక్పథం ఎంతో ప్రాసంగికం. దేశం వేగంగా అభివృద్ధి చెందుతున్నట్టు గణాంకాలు చెబుతున్నప్పటికీ, రైతుల ఆత్మహత్యలు, నిరుద్యోగ యువత, పట్టణ పేదరికం, అసంఘటిత రంగ కార్మికుల అస్థిరత వంటి వాస్తవాలు తీవ్రమైన వ్యత్యాసాన్ని చూపుతున్నాయి. తెలుగు, హిందీ, మలయాళం, తమిళం వంటి భాషల్లో వస్తున్న నేటి సాహిత్యం ఈ వ్యత్యాసాలను బలంగా పట్టుకుంటోంది. ఐటీ నగరాల మెరుపుల వెనుక ఉన్న వలస కార్మికుల కష్టాలు, గ్రామాల నుంచి నగరాలకు తరలివచ్చే యువత యొక్క కలలు–నిరాశలు, ప్రైవేటీకరణ వల్ల నష్టపోతున్న ప్రజా రంగం... ఇవన్నీ ఆధునిక కథనాల కేంద్రంగా ఉన్నాయి. కమ్యూనిస్టు విశ్లేషణ ఈ అనుభవాలను ఒక సామాజిక మ్యాప్‌లో అమర్చుతుంది.

డిజిటల్ యుగంలో సాహిత్య ఉత్పత్తి, పంపిణీ, వినియోగం కూడా మారిపోయింది. ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లు, ఈ–బుక్స్, సోషల్ మీడియా కవిత్వం, వెబ్‌సిరీస్‌ల రూపంలో కథనాలు విస్తరిస్తున్నాయి. కానీ ఈ డిజిటల్ ప్రజాస్వామ్యానికి కూడా కార్పొరేట్ యాజమాన్యాలు, అల్గారిథమ్‌లు, డేటా ఆర్థిక వ్యవస్థలు ఉన్నాయనే వాస్తవం ఉంది. ఎవరి కథలు కనిపిస్తాయి, ఎవరి కథలు కనిపించవు అన్నది కూడా మార్కెట్ లాజిక్ నిర్ణయిస్తుంది. కమ్యూనిస్టు దృష్టి ఈ కొత్త సాంస్కృతిక రాజకీయాలను విశ్లేషించడానికి సాహిత్యానికి ఉపకరిస్తుంది. ఏదిఏమైనా, కమ్యూనిస్టు భావజాలం నేటి సాహిత్యంలో ఒక సిద్ధాంతపు సంకెళ్లుగా కాదు, ఒక విమర్శాత్మక స్వేచ్ఛగా కనిపిస్తోంది. అది రచయితలకు సమాజాన్ని లోతుగా చూడడానికి, పాఠకులకు తమ అనుభవాలను పెద్ద చిత్రంలో అర్థం చేసుకోవడానికి సహాయపడుతోంది. అసమానతల కాలంలో, విభ్రాంతి కాలంలో, సంక్షోభాల కాలంలో సాహిత్యం కేవలం వినోదం కాదు; అది ఒక నైతిక, మేధో బాధ్యత. ఆ బాధ్యతను నెరవేర్చడంలో కమ్యూనిస్టు దృక్పథం ఒక కీలక మిత్రంగా నిలుస్తోంది. అందుకే నేటి సాహిత్య పత్రికలు, విమర్శకులు, రచయితలు ఈ దృష్టిని తిరిగి పరిశీలిస్తున్నారు. అది మనకు ఒకే ఒక్క రాజకీయ సమాధానాన్ని ఇవ్వకపోవచ్చు, కానీ మనం అడగాల్సిన ముఖ్యమైన ప్రశ్నలను మాత్రం స్పష్టంగా మన ముందుంచుతుంది. ఈ ప్రశ్నలే సాహిత్యాన్ని సజీవంగా ఉంచుతాయి, సమాజాన్ని కదిలిస్తాయి, భవిష్యత్తును ఊహించుకునే శక్తిని మనకు ఇస్తాయి.

– బిఎల్

## ఈ వారం కవితలు (వందేళ్ల సిపిఐ సంబురాల సందర్భంగా)

### సిపిఐ నూరేళ్ల గీతం



నెత్తుట తడిసిన జెండాను
ఎక్కుపెట్టి పిడికిళ్ళను ఎత్తింది
కమ్యూనిస్ట్ కమ్యూనిస్ట్
సిపిఐ కమ్యూనిస్ట్

కత్తులు ఎదురొస్తుంటేను
ఎదురు నిలిచి
జై కొట్టి కుత్తుకలనిచ్చింది
కమ్యూనిస్ట్ కమ్యూనిస్ట్
సిపిఐ కమ్యూనిస్ట్

మొట్టమొదట సంపూర్ణ స్వరాజ్యం
మా హక్కు చాటింది
కమ్యూనిస్ట్ కమ్యూనిస్ట్
సిపిఐ కమ్యూనిస్ట్

నిజాం దొరలను తరిమింది
ప్రజలకు గొంతుకనిచ్చింది
ప్రజాకవుల సృష్టించింది

ఇదిరా వందేళ్ల చరిత్ర
ఇదిరా నూరేళ్ళ చరిష్మా
కదులు ఈ నిజం తెలిసి
కదులు నీ భుజం కలిపి
సోదరీ... సోదరా

బ్రిటీషు కుట్ర కేసులను స్వీకరించి
చిరునవ్వుతు ఢీకొంది
కమ్యూనిస్ట్ కమ్యూనిస్ట్
సిపిఐ కమ్యూనిస్ట్
సాయుధ పోరున
నాల్గువేల ప్రాణాలనిచ్చి
తెలంగాణను ఎరుపెక్కించింది

దేశంలో కోటీ ఎకరాల భూమి
పేదలకు పంచింది
కమ్యూనిస్ట్ కమ్యూనిస్ట్
సిపిఐ కమ్యూనిస్ట్
॥ఇదిరా వందేళ్ల॥
ప్రజాసామ్యదేవాలయమనె
పార్లమెంటు ప్రారంభం చేసింది
రావి నారాయణ రెడ్డి
కమ్యూనిస్ట్ – కమ్యూనిస్ట్
సిపిఐ కమ్యూనిస్ట్
పార్లమెంటు తొలిసారి మహిళ బిల్లు
రూపొందించినది
గీత ముఖర్జీ బెంగాలీ
కమ్యూనిస్ట్ – కమ్యూనిస్ట్
సిపిఐ కమ్యూనిస్ట్
ప్రపంచాన ఎన్నిక ద్వారా
గెలిచిన తొలి కేరళ రాష్ట్రం
నంబూద్రిపాద్ సిఎం
కమ్యూనిస్ట్ కమ్యూనిస్ట్
సిపిఐ కమ్యూనిస్ట్
॥ఇదిరా వందేళ్ల॥

కార్పొరేట్ ప్రభువులను
ప్రజల చేత ఢీకొట్టి జయించేది
కమ్యూనిస్ట్ కమ్యూనిస్ట్
సిపిఐ కమ్యూనిస్ట్

మతోన్మాదుల కుట్రలను
మూటకట్టి భూమట్టం చేసేది
కమ్యూనిస్ట్ కమ్యూనిస్ట్
సిపిఐ కమ్యూనిస్ట్
కమ్యూనిస్టులను కలుపుకొని
ఢిల్లికోటపై జెండెగరేసేది
కమ్యూనిస్ట్ కమ్యూనిస్ట్
సిపిఐ కమ్యూనిస్ట్
॥ఇదిరా వందేళ్ల॥

– సుద్దాల అశోక్ తేజ

# 'నా మౌనం.. చితాభస్మం కాదు'

జనవరి 12న అలిశెట్టి ప్రభాకర్ జయంతి, వర్ధంతి సందర్భంగా

పొట్టి పొట్టి కవితలతో గట్టిగా చెప్పినవాడు అలిశెట్టి ప్రభాకర్. ప్రారంభంలో బొమ్మలు వేస్తూ ఆర్టిస్టుగా ఎదిగాడు. జగిత్యాల సాహితీ మిత్రదీప్తి సంస్థ పరిచయంతో కవిత్వరంగంలోకి ప్రవేశించాడు. 1974లో ఆంధ్రసచిత్ర వారపత్రిలో 'పరిష్కారం' మొదటి కవిత అచ్చయింది. తన కళ ప్రజల కోసమే అని చివరివరకు నమ్మినవాడు. ఎర్రపావురాలు(1978) మొదటి కవితా సంకలనం. మంటల జెండాలు, చురకలు(1979), రక్తరేఖ(1985), ఎన్నికల ఎండమావి (1989), సంక్షోభ గీతం (1990), సిటీలైఫ్ (1992) ముద్రించిన కవిత్వ సంకలనాలు. అలిశెట్టి ప్రభాకర్ స్త్రీల కోణంలో రాసిన కవితలకు పరిమితమై ఈ వ్యాసం రాయదల్చుకున్నాను.అలిశెట్టికి జీవితం పట్ల, సమాజం పట్ల ఖచ్చితమైన భౌతిక వాద దృక్పథం ఉన్నది. ఒకవైపు అనుభూతి కవిత్వం, మరోవైపు వ్యక్తివాద కవిత్వం పోటీ పడుతున్న సమయం. అభ్యుదయ కవిత్వం మరోవైపు విప్లవ కవిత్వం రావటం. ప్రజలు పోరాటం చేస్తుంటే వాళ్ళ కుటుంబాలు అనూహ్యమైన బాధలకు గురవుతున్న సమయం. అలాంటి కాలంలో తగినంత భావశక్తి, సరైన భావజాలం ఉన్నవాడు అలిశెట్టి ప్రభాకర్. అదే భావజాలాన్ని పాఠకులకు సులభంగా అందించే సంక్షిప్త భాషా పటిమ కలిగిన ప్రభాకర్ తన బలం కవిత్వమే అని నమ్మినవాడు. దానినే ఆయుధంగా చేసుకున్నవాడు. సుప్రసిద్ధ గాయని బెల్లి లలితను పద్నాలుగు ముక్కలు చేసినప్పుడు గొంతు కొస్తే/పాట ఆగిపోదు/అదిముక్తకంఠం/గొలుసు వేస్తే/పోరు నిలిచిపోదు/అదిప్రజాయుద్ధం అని రాయగల్గిన కవి. చిన్న కవితలతో ఎంత ముద్ర వేశాడో పెద్ద కవితలు కూడా అంతే బాగా రాశాడు. నేలమీద పురుగులతో సమానమైన, జనాభాలో సగం అయిన స్త్రీల గురించి కవికి చాలా గౌరవం. చాలా కవితల్లో వారి గురించి రాశాడు. 'వేశ్య'కవిత తెలియని కవి ఉండడంటే అతిశయోక్తి కాదు.



**తను శవమై/ఒకరికి వశమై**
**తనువు పుండై... ఒకడికి పండై**
**ఎప్పుడూ ఎడారై... ఎందరికో ఒయాసిసై**

వేశ్య దుర్భర జీవితాన్ని, హింసను చిన్న కవితలతో చెప్పిన పద్ధతి మనకు కన్నీళ్లు తెప్పించక మానదు. వెల(యాలు)మరో కవితలో భిన్నంగా వేశ్యలు కన్నుగొట్టి రమ్మన్నా/గుండె బిగబట్టుకు సాగిపోయేవాడు/సాధారణంగా సామాన్యుడు అని అన్నాడు. ఆమె యవ్వనం రాయని వీలునామా లో ఆమెది ఉరి బిగించుకున్న జీవితం అంటాడు.అంటే విలవిల్లాడటం.మూగబోయిన గొంతైనా పాడక తప్పదంటూ రోజుకో పదిమంది కీచకులకి స్వాగ తం పలకటంగా అభివర్ణించిన తీరులో ఒక మనోవేదన కూడా కనిపిస్తుంది. అత్యాచారం చేసి లేదా పెళ్లి చేసుకుంటానని అమ్మాయిని శారీరకంగా వాడుకొని మొహం చాటేస్తారు. ఇలాంటి వాటి ని కొన్నిచోట్ల పెద్దమనుషుల్లో పెట్టి పంచాయతీ అని చేసి కొంత డబ్బులు ఇచ్చే ప్రయత్నం చేస్తారు. ఇలాంటి వాటిని ఖండిస్తూ శీలం విలువను కొలువడానికి, కుమిలి పోడానికి కవి హృదయం లేదంటాడు. స్త్రీకి జరిగిన అన్యాయం గురించి ఆలోచించకుండా, జరగడానికి ఏర్పడిన పరిస్థితులు గమనించకుండా, డబ్బుతో ముడిపెట్టి చూడటం బాధపెట్టే అంశం. 'వీరుడితో కరచాలం' అనే కవితలో ప్రస్తావించబడింది. అందుకే అశ్రుకావ్యం కవితలో ఆమె నెత్తుటి గాయాల సంపుటి/రగిలే బాధల కుంపటి అని నిర్ధారించాడు. అంతేగాక

**కర్కశ పాదాల్ని మోస్తూ/కఠోర తపస్సులా...**
**శకలాలుగా మిగిలిన రాత్రుళ్ళపై**
**శవాసనం వేసే విషాద భరిత చిత్రంలా... ఆమె అగ్ని సముద్రం మీదే అందాల పడవ** అంటాడు. ప్రసవం స్త్రీకి పునర్జన్మ అంటాడు. ఆ సమయంలో నొప్పుల బాధ తట్టుకోలేకపోతుంది. స్త్రీ ప్రసవ వేదనను గావుకేక, చావుకేక అంటాడు. స్త్రీని సూటిగా శరీర సౌందర్యాన్ని బహిర్గతం చేసే ఉల్లి పొర లాంటి చీరనా? వెండితెరనా? ప్రశ్న తలెత్తటం కన్పిస్తుంది. నాగరిక ప్రపంచంలో స్పృహకు వచ్చి కోల్పోయిన కాలంలో ఏది ప్రేమ రాసలీల ప్రకటనల క్యాన్వసుగా మారిందనేది కూడా కవి ప్రశ్న. ముక్కు మొహం తెలియని వ్యక్తి పెళ్లి చేసుకోడానికి రావటం, కట్నం డిమాండ్ చెయ్యడం. అలాంటి ఆగాతకున్ని సునిశితంగా పరిశీలించాలనే ధోరణి కనిపిస్తుంది. మార్కెట్‌లో వస్తువును తీసుకున్నప్పుడు రేటు కట్టడం లాంటిది. ఖరీదు కట్టి తెచ్చుకున్న వస్తువు మనింటికే వస్తుంది. ఉపయోగించుకుంటాం. కానీ ఇక్కడ రివర్స్‌గా కొనసాగుతుంది. అమ్మాయే డబ్బులిచ్చి అబ్బాయి ఇంటికి వెళ్ళి వెట్టిచాకిరి చేస్తుంది. స్త్రీలు వేశ్యా గృహాల్లో బంధించబడుతున్నారు. వెండితెర అనే విషపు కోరల్లో చిక్కుకుంటున్నారు. అనేక రకాలుగా వెలివేయబడుతున్నారు. మీరెవరంటూ అబలలా?అందాల రాశులా? చిలుకలా? సీతాకోకచిలుకలా? ఏదో తేల్చుకొమ్మనట్టుగా ఉంటుంది ఈ కవిత. స్త్రీల మానభంగంకు పురాణాలు, ప్రబంధాలు వేదికలే. పురుషహంకారం ఉన్నచోటల్లా ఆడది క్షణికమైన కోరికగా మారిందనే ప్రస్తావన కనిపిస్తుంది. పగలూ, రాత్రి విలపించేది కూడా ఎవరు? ఇంకెవరూ ఆడది మెహందీలా వాడది అనటంలోనే స్త్రీల జీవితాలను అర్థం చేసుకున్న వైనం, సామాజిక పరిశీలన అర్థం అవుతుంది. జీవితాంతం సంసారంలో శక్తి హీనురాలే మొ'గుడి' ముందు చేతులెత్తి నమస్కరిస్తూ భక్తురాలుగా బ్రతుకీడుస్తుందంటాడు. స్త్రీలు శక్తివంతులుగా మారాలనేది కవి అభిప్రాయం. ఒక్క స్త్రీపై సమూహపు అత్యాచారాలను పిచ్చివాళ్ళ సామూహిక విధ్వంసకాండగా చెపుతూ నీచమైన ప్రపంచం అంటాడు. అందుకే మహిళా కళాశాలలో గానీ, హాస్టల్ గదిల్లో గానీ తాత్కాలికంగానైనా కత్తులు మెరవాలంటాడు. స్త్రీలు తమను తాము రక్షించుకోవాలనే సందేశం ఇందులో కనిపిస్తుంది. నీతి లేకుండా పోయింది. ప్రేమ లేదు. శరీరాన్ని కాంక్షిస్తున్నారు. ఆత్మసౌందర్యం వదిలి, ఆభరణాలను ఒలుచుకుంటున్నారు. ఇంద్రధనుస్సులా కలలు కన్న స్త్రీల జీవితాలు, కళ్యాణమంటపాల మంటల్లోనే బూడిదవుతున్నాయి. ఇంత దుర్మార్గం కూడా సర్వసాధారణంగా మారిందంటాడు. అమ్మపాల అమ్మక దేశ ద్రోహం, మానభంగాలు, లైంగిక దోపిడీ, వరకట్నపు చావులు, అత్యాచారాల మధ్య నలిగిపోయి అవశేషాలుగా మిగులుతున్న స్త్రీజాతి అవశేషాలే మళ్ళీ మగ సంతానం కోసం ఉవ్విళ్లూరుతున్నారని అంటాడు. కానీ ఆ మగ సంతానం కోసం కుటుంబాల్లో స్త్రీలపై ఎంత ఒత్తిడి, హింస ఉంటుందో? తెలియని విషయం కాదు. వంశం కోసం కొడుకే ఉద్ధరిస్తాడని పున్నామ నరకం తప్పిస్తాడని మూఢమైన ఆలోచనల వల్ల కూడా స్త్రీలు పుత్ర సంతానం కోసం ఆరటపడ్డారని చెప్పక తప్పదు. కవి సహచరి భాగ్యలక్ష్మిని ఉద్దేశించి ఆమెకు ప్రసిద్ధిగాంచిన బెర్నార్డ్ షా, షేక్స్‌పియర్, చలం, గురజాడ తెలియదంటాడు. అడుగంటిన కిరసనాయిలుతో స్టవ్ మీద అన్నం వండటం, గాజు కుప్పెల్లాంటి అతని కళ్ళల్లోనే ఆశల అగరొత్తులు వెలిగించుకుంది అంటాడు. ఎప్పుడూ ఐశ్వర్యం, బంగారం కోరలేదంటాడు. ఉన్నదాంతోనే సర్దుకుపోయి, ప్రభాకర్‌ని అర్థం చేసుకొని సాధారణమైన జీవితం గడిపినామెను గొప్పగా ఆవిష్కరించాడు. అలిశెట్టి యువకుడుగా ఎదిగే సమయంలోనే సిరిసిల్లా, జగిత్యాలలో రైతాంగా పోరాటాలు జరిగాయి. భావకుడుగా, కళాత్మక దృష్ట దీన్ని ప్రభాకర్ కవిగా, చిత్రకారుడిగా ముందుకు రావటం, ఈ రైతాంగం పోరాటాలు కాలానికి కంచెకు కొత్త దృష్టిని, పదునునూ నిత్యనూతన చైతన్యం అందించాయి. తనొక నిబద్ధత, పీడిత ప్రజల రచయితగా ప్రకటించుకున్నాడు. పీడిత ప్రజలలో అత్యంత పీడితులు స్త్రీలుగా గుర్తించాడు. ఈ వ్యవస్థ మీద కసితో ఆయన పదునెక్కిన కవిత్వం మనకు నిరంతరం స్పృశిస్తుంది.

– శోభ రమేష్
8978656327

# వామపక్షభావ సాహిత్య కీర్తిశిఖరం 'జాక్ లండన్'



అమెరికన్ రచయిత 'జాక్ లండన్'ను ఆయన 150వ జయంతి సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా సాహిత్య, వామపక్ష వర్గాలు స్మరించుకుంటున్నాయి. జాక్ లండన్ జీవితం ఒక అసాధారణ ప్రయాణం. అది ఒకవైపు అణగారిన వర్గాల నుంచి ఎదిగిన రచయిత కథ అయితే, మరోవైపు విప్లవాత్మక ఆలోచనల నుంచి వెనక్కి తగ్గిన ఒక విషాద గాథ కూడా. ఆయన కేవలం రచయిత మాత్రమే కాదు.. తన కాలంలోని సామాజిక అన్యాయాలపై గళమెత్తిన ఉద్యమకారుడు, సోషలిస్టు ఆలోచనల ప్రచారకుడు. జాక్ లండన్ 1876 జనవరి 12న జన్మించారు. పేదరికం, కఠినమైన శారీరక శ్రమ ఆయన బాల్యాన్ని ఆక్రమించాయి. ఫ్యాక్టరీల్లో పని చేయడం, నిరుద్యోగం, ఆకలి— ఇవన్నీ ఆయనకు పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క కఠినతను ప్రత్యక్షంగా అనుభవింపజేశాయి. ఈ అనుభవాలే ఆయనను సోషలిజం వైపు నడిపించాయి. 1894లో అమెరికాలో తీవ్రమైన ఆర్థిక మాంద్యం నెలకొన్న సమయంలో, నిరుద్యోగుల ఉద్యమంగా ప్రసిద్ధి చెందిన 'కెల్లీ ఆర్మీ'తో కలిసి వాషింగ్టన్ డిసికి చేసిన పాదయాత్ర ఆయన ఆలోచనలను మలుపు తిప్పింది. ఇది అమెరికా చరిత్రలోనే మొదటి పెద్ద నిరసన మార్చ్‌గా నిలిచింది.ఈ ప్రయాణంలో జాక్ లండన్ తొలిసారి మార్క్స్, ఎంగెల్స్ రచనలను చదివారు. ముఖ్యంగా 'కమ్యూనిస్టు మానిఫెస్టో' ఆయనపై గాఢమైన ప్రభావం చూపింది. తరగతి పోరాటం వాస్తవమని, వ్యక్తిగత యాజమాన్యం ప్రజల ప్రయోజనాలకు విరుద్ధమని, చివరికి సోషలిజం తప్పనిసరిగా విజయం సాధిస్తుందన్న నమ్మకం ఆయన జీవితాంతం నిలిచిపోయింది. ఈ అనుభవాల్ని ఆయన 'ది రోడ్' (1907) అనే రచనలో పొందుపరిచారు. ఈ దశ నుంచే జాక్ లండన్ రచయితగా, ఉద్యమకారుడిగా అత్యంత ప్రభావవంతమైన కాలంలోకి ప్రవేశించారు. సోషలిస్ట్ లేబర్ పార్టీ, తరువాత సోషలిస్ట్ పార్టీ ఆఫ్ అమెరికాలో క్రియాశీల సభ్యుడిగా మారారు. ప్రముఖ ఉపన్యాసకుడిగా యేల్, హార్వర్డ్ వంటి ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయాల్లో కూడా విప్లవం సమీపంలో ఉందని ధైర్యంగా ప్రకటించారు. ఆయనకు సాహిత్యం ఒక ఆయుధం. 'ది పీపుల్ ఆఫ్ ది అబిస్' (1903) అనే రచనలో లండన్ నగరంలోని పేదల జీవన నరకాన్ని చిత్రించి, పెట్టుబడిదారీ వ్యవస్థపై తీవ్రమైన విమర్శ చేశారు. ఈ రచనతో ఆయనకు అంతర్జాతీయ సోషలిస్టు ఉద్యమంలో గుర్తింపు వచ్చింది. ఈ కాలంలో ఆయన అనేక వ్యాసాలు, కథలు రాశారు. 'వార్ ఆఫ్ ది క్లాసెస్' (1905)లో ఆయన సోషలిస్టు ఆలోచనలను స్పష్టంగా వివరించారు. బాల కార్మికుల దోపిడీపై 'ది అపోస్టేట్', కార్మిక నాయకులపై జరిగిన కుట్రలను ప్రశ్నించిన 'సమ్థింగ్ ఈజ్ రాటెన్ ఇన్ ఐడహో', సామూహిక బలాన్ని చాటిన 'ది స్ట్రెంగ్త్ ఆఫ్ ది స్ట్రాంగ్' వంటి రచనలు ఉద్యమానికి సిద్ధాంత ఆయుధాలుగా మారాయి. ఇవి పాంప్లెట్ల రూపంలో విస్తృతంగా ప్రచారం పొందాయి. ఈ కాలానికి శిఖరంగా నిలిచిన రచన 'ది ఐరన్ హీల్' (1908). ఇది జాక్ లండన్ మేధో వారసత్వానికి ప్రతీక. ఏకాధిపత్య పెట్టుబడిదారీ వ్యవస్థ ఎలా నియంతృత్వంగా మారుతుందో, ఆర్థిక శక్తులు ఎలా ప్రజాస్వామ్యాన్ని, మీడియాను, చట్టాన్ని, మతాన్ని తమ ప్రయోజనాల కోసం వాడుకుంటాయో ఈ నవల తీవ్రంగా చూపిస్తుంది. శాంతియుత మార్గాల్లో వ్యవస్థ మారదన్న స్పష్టమైన హెచ్చరిక ఇందులో ఉంది. ఇది కేవలం విప్లవాత్మక నవలే కాదు; ఆధునిక డిస్టోపియన్ సాహిత్యానికి పునాది. 1905 రష్యా విప్లవం రక్తపాతంతో అణచివేయబడిన తర్వాత, పాలక వర్గం స్వచ్ఛందంగా అధికారాన్ని వదిలిపెట్టదన్న నిశ్చయానికి జాక్ లండన్ వచ్చారు. 1917–18 విప్లవాలు, మొదటి ప్రపంచ యుద్ధం, ఫాసిజం ఎదుగుదలను ఆయన ముందే ఊహించారు. ఇటలీ, జర్మనీలో వచ్చిన నియంతృత్వాలకు ఆయన 'ఐరన్ హీల్' స్పష్టమైన ముందస్తు హెచ్చరికగా నిలుస్తుంది. అయితే, ఆయన జీవితంలో తీవ్రమైన విరుద్ధతలు కూడా ఉన్నాయి. 'ది కాల్ ఆఫ్ ది వైల్డ్' వంటి రచనలతో వచ్చిన అపార సంపద ఆయనను విలాస జీవితం వైపు నడిపించింది. గ్లెన్ ఎలెన్‌లో రాంచ్ కొనుగోలు చేసి, వాణిజ్య రచనల వైపు మొగ్గుచూపారు. ఒకప్పుడు అంతర్జాతీయ కార్మిక ఐక్యతను ప్రచారం చేసిన ఆయన, తరువాత కాలంలో ఆంగ్లో–సాక్సన్ జాతి ఆధిక్యత భావాలను వ్యక్తం చేయడం తీవ్ర విమర్శలకు దారితీసింది. 1911లో మెక్సికన్ విప్లవాన్ని సమర్థించిన జాక్ లండన్, 1914లో అమెరికా సామ్రాజ్యవాద జోక్యాన్ని సమర్థించడం ఆయన రాజకీయ పతనానికి సంకేతం. చివరికి 1916లో సోషలిస్ట్ పార్టీ నుంచి రాజీనామా చేశారు. జీవితాంతంలో ఆయన అనారోగ్యం, ఒంటరితనం, నిరాశలో మునిగిపోయారు. 'మార్టిన్ ఈడెన్' నవలలో ఆయన వర్ణించిన నిరాశే ఆయన జీవితానికి ప్రతిబింబంగా మారింది. 1916లో కేవలం 40 ఏళ్ల వయసులో ఆయన మరణించారు. ఎన్నో వైరుధ్యాల మధ్యన కూడా జాక్ లండన్ ఒక గొప్ప కార్మిక వర్గ రచయితగానే నిలుస్తారు. పోరాటంలో పుట్టిన స్వరం, ప్రతిభతో విస్తరించిన ఆలోచన, చివరకు అదే వ్యవస్థ విరోధాభాసాల్లో మౌనమైన ఒక విప్లవాత్మక మేధావి ఆయన. ముఖ్యంగా 'ది ఐరన్ హీల్' ప్రపంచ సాహిత్యంలో సామ్రాజ్యవాద యుగాన్ని విశ్లేషించిన తొలి డిస్టోపియన్ నవలగా, నేటికీ అత్యంత ప్రాసంగికమైన రచనగా నిలిచింది.

### కమ్యూనిస్టు కంచుకోట ఖమ్మం పిలుస్తోంది పద కామ్రేడ్

కమ్యూనిస్టు కంచుకోట
ఖమ్మం పిలుస్తోంది పదకామ్రేడ్
వందేళ్ళ సిపిఐ ఉత్సవాల సభకు
రారామ్మని
ఖమ్మం పిలుస్తోంది పద కామ్రేడ్స్
నల్లబంగారు నేలపైన
ఎర్రదండు పోటెత్తినట్లు
ఎర్ర సంద్రమేదో పొంగి పొర్లి
ఖమ్మమంతా ముంచెత్తినట్లు
ఎర్ర జెండాల జాతర
సాగుతుందట
ఆ ఉత్సవాల సభ చూసొద్దాం పద
కామ్రేడ్స్
॥కమ్యూనిస్టు॥
గిరిజన లంబాడీ కోయదొరల
డప్పు దరువులుంటయంట
ఎర్రసేన కర్రసాము
కవాతులు చేస్తరంట
విప్లవగేయాల హోరులోన
ఖమ్మమంతా మారుమోగి పోతదంటా
వందేళ్ళ కమ్యూనిస్టు సభల
సంబరాలు చూసొద్దాం పద
కామ్రేడ్స్
॥కమ్యూనిస్టు॥
పోరుబిడ్డలు శేషగిరి రజబలి
నల్లమల గిరి ప్రసాదులు
నడయాడిన పుణ్యభూమి
తాకి వద్దాం పద కామ్రేడ్స్
దేశ దేశాల కమ్యూనిస్టు నేతలు
విప్లవ సందేశాలిస్తరంట
ఆ సందేశాలు విని వద్దాం పద
కామ్రేడ్స్
॥కమ్యూనిస్టు॥
అలనాటి కమ్యూనిస్టు పార్టీ
నిర్మాతలు కామ్రేడ్ ఘాటే జోషి
చంద్ర డాంగేలు తెలంగాణ
సాయుధ
పోరుకు పిలుపునిచ్చిన రావి,
బద్దం, మఖ్దూం
నైజాం జైలు గదుల్లో జంగ్ నడిపిన
ధర్మభిక్షం
ఉద్యమాల రణం మన
సురవరంలకు
జోహార్లు అర్పిద్దాం పద కామ్రేడ్స్
॥కమ్యూనిస్టు॥
ఎర్రజెండా వందేళ్ళ ఉద్యమాలకు
ఎనలేని వీరుల త్యాగాలకు
లాల్‌సలాములు చేసొద్దాం పద
కామ్రేడ్స్
ఖమ్మం ఉత్సవాల సభను
చూసొద్దాం పద కామ్రేడ్స్
॥కమ్యూనిస్టు॥

– బొమ్మగాని నాగభూషణం
9849622633

### వందేళ్ళ జెండా

వందేళ్ళ జెండా
బీదసాదల చేతుల్ల జెండా
గుండెలనిండా భరోసానిచ్చే జెండా
ఎర్రెర్రని జెండా ఎగరాలి వాడవాడల్లా!

కాన్పూర్ తొలిమెట్టై
సకల జనుల హక్కులకోసం
కదిలిన జెండా!
ఎన్నెన్ని ఒడిదుడుకులు ఎదురైనా
వెన్ను చూపని జెండా!
సామ్యవాదం ఎజెండాగా
మార్క్సిజమే సిద్ధాంతంగా పోరు
సల్పుతున్న జెండా!
॥వందేళ్ళ॥
భూమికోసం భుక్తి కోసం
పల్లెపల్లెను కదిలించిన జెండా!
వనితలంతా కొంగు నడుముకు
చుట్టి
గడీలపై తిరుగుబాటుకు
ఊతమిచ్చిన జెండా!
గడీలనే కూల్చిన జెండా!
॥వందేళ్ళ॥
తుపాకీ గుళ్ళకి నేలకొరిగిన త్యాగ
మూర్తులతో స్ఫూర్తినొందిన
జెండా!
ఊడిగం బతుకుల చెర నుండి
విముక్తి ప్రసాదించిన జెండా!
రజాకార్ల దేశ్‌ముఖ్‌ల భరతం
పట్టిన జెండా!
వూరూరా ఇంకా వెలిసిపోని ఎర్ర
జెండా దిమ్మెలు స్థూపాలు చరిత్రకి
ఆనవాళ్ళుగా!
॥వందేళ్ళ॥
ఎవడెవ్వడో
నిరక్షరకుక్షులెందరో
మత ఛాందస మెదళ్ళు పోరా
టాన్ని హైజాక్ చేయ చూసినా
చెక్కు చెదరని సిద్ధాంత వాసన
పోని పల్లెలే తరిమికొడుతున్నాయ్!
అదే! అదే! ఎర్రజెండా నిజాయితీ
అండదండగా!
॥వందేళ్ళ॥
ప్రైవేటు సంస్థల జాతీయకరణ
పోరాటాలతో మెరిసిన జెండా
అట్టడుగు వర్గాల సామాజిక
న్యాయ ఎజెండాగా జెండా
నిషేధాలు ఆంక్షలు అరెస్టులు
ఆపలేని జెండా పోరు నిరంతరం
జనంలో జనంకోసం నిలబడ్డ
జెండా!
॥వందేళ్ళ॥

- గిరిప్రసాద్ చెలమల్లు
9493388201

## నేడు 'నూరేళ్ల అరుణ కేతనం' ఆవిష్కరణ

హాజరుకానున్న సుద్దాల అశోక్‌తేజ, కూనంనేని

**ప్రజాపక్షం/ ఖమ్మం :** నూరేళ్ల అరుణ కేతనం కవితా సంకలనాన్ని సోమవారం ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ ఆవిష్కరించనున్నారు. ఖమ్మం డిపిఆర్‌సి భవనంలో ఉదయం 10 గంటలకు జరిగే ఈ ఆవిష్కరణ సభకు ముఖ్య అతిథిగా కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, నవచేతన విజ్ఞాన సమితి సభ్యులు బాగం హేమంతరావు, అభ్యుదయ రచయితల సంఘం బాధ్యులు పల్లేరు వీరస్వామి, రాపోలు సుదర్శన్, కెవిఎల్‌లతో పాటు ఖమ్మం జిల్లాకు చెందిన సాధనాల వెంకటస్వామినాయుడు, మువ్వా శ్రీనివాసరావు, లెనిన్ శ్రీనివాస్, రౌతురవి, కొంపెల్లి రామయ్య, గోపిశెట్టి వెంకటేశ్వరరావు, రవి మారుత్, సీతారాం, ప్రసేన్, ఐవి రమణారావు లతో పాటు నూరేళ్ల అరుణ కేతనం కమిటీ సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, శింగు నర్సింహారావు తదితరులు హాజరుకానున్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని ఈ కవితా సంకలనాన్ని రూపొందించారు. ఖమ్మం జిల్లాకు చెందిన అనేక మంది కవులు రచించిన కవితలను ఈ సంకలనంలో పొందుపరిచారు.

## సిపిఐ నాయకుడు సీతయ్య మృతి





**ప్రజాపక్షం/ ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ నాయకుడు రెడ్డెబోయిన సీతయ్య (71) ఆదివారం మృతి చెందారు. చింతకాని మండలం కోదుమూరు గ్రామానికి చెందిన సీతయ్య ఆది నుంచి కమ్యూనిస్టు పార్టీలో చురుకైన నాయకునిగా పనిచేశారు. వారి కుటుంబం మొత్తం సిపిఐకి అంకితమై పనిచేసింది. ఎన్ని ఇబ్బందులు వచ్చినా ఎదుర్కొని కమ్యూనిస్టు పార్టీ తరుపున పోరాటం చేశారు. ఒక అక్రమ కేసులో వీరికి జీవిత శిక్ష పడిన కమ్యూనిస్టు పార్టీతోనే తమ అనుబంధాన్ని కొనసాగించారు. సీతయ్య అనేక సార్లు ప్రజా ఉద్యమాల్లో పాల్గొని జైలుకు వెళ్లారు. ఆయన మృతి పట్ల సిపిఐ ఖమ్మం జిల్లా సమితి తీవ్ర సంతాపాన్ని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపింది. సీతయ్య మృతివార్త తెలిసిన వెంటనే సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, ఎస్‌కె జానిమియా, కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివరెడ్డి, నగర నాయకులు ఎస్‌కె సైదా, జ్వాలా నర్సింహారావు తదితరులు మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## టెట్ పరీక్ష ప్రశాంతం

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లాలో ఆదివారం నిర్వహించిన టెట్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మొదటి దఫా 100 మంది పరీక్ష రాయాల్సి ఉండగా కేవలం 89 మంది మాత్రమే హాజరయ్యారు. రెండో విడతలో వంద మందికి గానూ 88 మంది పరీక్ష రాశారు. అభ్యర్థులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలో చోటు చేసుకోకుండా కలెక్టర్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాటు చేశారు. జిల్లా అధికార యంత్రాంగం పటిష్టమైన భద్రత నడుమ పరీక్ష విజయవంతమైనట్లు కలెక్టర్ తెలిపారు.

## అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు : ఎస్‌పి



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పేకాట, కోడి పందేలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌పి రోహిత్ రాజ్ అన్నారు. ఇందు కోసం జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. నిరంతరం వాహన తనిఖీలు, సరిహద్దు ప్రాంతాల్లో గుర్తించిన ప్రదేశాలలో గస్తీలు ముమ్మరం చేసినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దుగా గల పోలీస్ స్టేషన్లలో పనిచేసే అధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశామన్నారు. పట్టుబడిన నిందితులపై చట్ట పరమైన కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడే వారి సమాచారాన్ని అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

## అర్థవంతమైన మార్పు కోసమే సిఎస్‌ఆర్ సమ్మిట్

జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

**ప్రజాపక్షం/భద్రాచలం :** జిల్లాలోని అన్ని వర్గాల ప్రజల్లో అర్థవంతమైన మార్పు కోసమే సిఎస్‌ఆర్ సమ్మిట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. సమ్మిట్ నిర్వహించేందుకు అనువైన ప్రదేశాలను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఐటిడిఏ ప్రాంగణంలోని గిరిజన భవన్, సారపాకలోని కళాభారతి భవనాన్ని పరిశీలించిన ఆయన ఐటిడిఏ ప్రాంగణంలోని గిరిజన భవన్‌లోనే సమ్మిట్ నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేరెన్నిక గల 15 కార్పొరేట్ సంస్థలు ఈ సమ్మిట్‌కు హాజరు కానున్నాయని చెప్పారు. కేవలం స్వల్ప కాలిక ప్రయోజనాలే కాకుండా సమాజం కోసం దీర్ఘ కాలిక, స్థిరమైన ప్రభావాన్ని తీసుకురావడానికి అంత ఆకలిసికట్టుగా పనిచేయాలని, ఇందు కోసం కార్పొరేట్, సిఎస్‌ఆర్ నాయకులు, పాలసీ మేకర్స్, డెవలప్మెంట్ పార్టనర్స్ హాజరై తమ ఆలోచనలు పంచుకోవాలన్నారు. ఇక్కడి వచ్చే సిఎస్‌ఆర్ సమ్మిట్ ప్రతినిధులు గిరిజన సంస్కృతి, గ్రామీణ వాతావరణాన్ని ఆస్వాదించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిసి డిజిఎం చంగల్ రావు, టిపి శ్రీనివాస్, మేనేజర్ ఆదినారాయణ, పోశాలు, అఖిల్, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

**ప్రజాపక్షం/భద్రాచలం :** సేవే లక్ష్యంగా, సమాజ హితమే ప్రధానంగా ముందుకు సాగుతున్న లయన్స్ క్లబ్ ఆఫ్ భద్రాచలం శ్రీరామ నూతన క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం జరిగింది. పట్టణంలోని కమ్మ సేవా సమితి సత్రంలో కార్యవర్గ సభ్యులు అమృతపల్లి కోటేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేయించారు. క్లబ్ అధ్యక్షునిగా చల్లగుళ్ల నాగేశ్వరరావు, కార్యదర్శిగా భూక్యా రంజిత్ నాయక్, కోశాధికారిగా గుంట్టముక్కల భరత్ కుమార్ ఎంపికయ్యారు. వీరితో పాటు పలువురు నూతన సభ్యులు సైతం ప్రమాణ స్వీకారం చేశారు. నూతన కార్యవర్గానికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అధ్యక్ష,కార్యదర్శులు చల్లగుళ్ల నాగేశ్వరరావు, భూక్యా రంజిత్ నాయక్‌లు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆఫ్ శ్రీరామ జిల్లాలోనే ఉత్తమ క్లబ్‌గా నిలిచేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. సేవా కార్యక్రమాలతో పాటు సమాజ హితాన్ని కాంక్షిస్తూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగా వైద్య చికిత్సల నిమిత్తం రూ.40 వేలు అందించామని, రాబోయే రోజుల్లో పేద విద్యార్థులకు సహాయం, పర్యావరణ పరిరక్షణ వంటి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

# ఏజెన్సీలో పెద్ద పులుల టెన్షన్

కొత్తగూడెం జిల్లా అడవుల్లో సంచరిస్తున్న టైగర్స్

నాలుగేళ్ల తర్వాత మళ్లీ భయం.. భయం...

అడవుల్లో నిఘా నేత్రాలు

19 నుండి అటవీ జంతువుల గణన

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పెద్ద పులుల టెన్షన్ జిల్లాలో మళ్లీ మొదలైంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అభయారణ్యంతో పాటు దట్టమైన అటవీ ప్రాంతం ఉంది. చాలా వరకు గ్రామాలు అటవీ ప్రాంతాల్లోనే ఉంటాయి. ఇలాంటి ఏజెన్సీ అడవుల్లో పెద్ద పులుల సంచారం పెరుగుతుండటంతో అటవీ ప్రాంతాల్లో భయం మొదలైంది. ఇప్పటికే జిల్లాలోని మణుగూరు, పినపాక అటవీప్రాంతాల్లో ఓ పులి సంచరిస్తున్నట్లు అటవీ అధికారులు చెబుతున్నారు. తాజాగా మరో రెండు పులులు జిల్లా అడవుల్లోకి ప్రవేశించినట్లు ఆశాఖ భావిస్తోంది. మహారాష్ట్ర ప్రాంతంలో అధికంగా ఉండే పులులు, వాటి పిల్లలు ఒక ప్రాంత నుండి మరో ప్రాంతానికి వలసలు పోతుంటాయి. ప్రధానంగా మగ పులి పిల్లలు పెద్దవి అయిన తర్వాత సొంతంగా జీవనాన్ని సాగించేందుకు ఇతర ప్రాంతాల్లో సంచరిస్తు వందలాది కిలోమీటర్లు ప్రయాణిస్తుంటాయి. ఇలాంటి క్రమంలో మహారాష్ట్ర అడవుల గుండా కామారెడ్డి మీదుగా ములుగు జిల్లా ద్వారా ఒక పులి, భూపాలపల్లి వైపు నుండి మరో పులి జిల్లా అడవుల్లో సంచరిస్తున్నట్లు కాలి గుర్తుల ఆధారంగా అటవీ అధికారులు ధృవీకరించినట్లు తెలుస్తోంది. దీనిని బట్టి చూస్తే ప్రస్తుతం మొత్తం మూడు పులులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అడవుల్లో తిరుగుతున్నాయి.

**నాలుగేళ్ల తర్వాత...** పెద్దపులుల సంచారం నాలుగేళ్ల క్రితం జిల్లాలో పెద్ద ఎత్తున సాగింది. ఇదిగో పులి అంటే అదిగో పులి అన్నట్లు ఏ నోట విన్నా పులులు మాటే వినిపించేది. అప్పట్లో జిల్లాలోని మణుగూరు, పినపాక, అశ్వాపురం, ఆళ్లపల్లి, గుండాల ఆడవుల్లో పులి జాడలను అటవీ అధికారులు అధికారికంగా గుర్తించారు. ఆ రోజుల్లో ఆళ్లపల్లి, గుండాల మండలాల్లోని అటవీ గ్రామాలైన పాతూరు, మర్కోడు, వెంకటాపురం గ్రామాల్లో పెద్దపులి సంచారం విపరీతంగా ఉంది. ఆ గ్రామాల్లో ఇళ్ల వద్ద కట్టేసి ఉన్న రెండు కాడెడ్లుపై దాడి చేసిన పులి రక్తం తాగి వాటిని చంపేసింది. మరో గేదెను అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లి తినేసింది. అదేవిధంగా అశ్వాపురం అడవుల్లో సైతం పశువుల మందపై దాడి చేసింది. ఆ తర్వాత ఓ పత్తి చేలో ఉన్న కూలీల సమీపం నుండి పెద్ద పులి పరుగులు తీసింది.

**అడవుల్లో నిఘా నేత్రాలు ...** అడవుల్లో జంతువుల సంచారం, వాటి స్థితిగతులను తెలుసుకునేందుకు జిల్లావ్యాప్తంగా మొత్తం 40 ట్రాక్ కెమేరాలు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా వన్య ప్రాణుల కదలికలు గమనిస్తుంటారు. మానవ జోక్యం లేకుండా అటవీ ప్రాంతంలో చోటు చేసుకునే పరిణామాలను రికార్డు చేసే సామర్థ్యం ఏర్పాటు చేసిన కెమేరాలకు ఉంది. ప్రస్తుతం జిల్లాలో మూడు పులలతో పాటు జింకలు, అడవి గేదెలు, అడవి పందులు, కొండ గొర్రెలు, దుప్పులు ఉన్నాయి. ఈ ట్రాక్ కెమేరాల ద్వారా వాటి కదిలకలను రికార్డు చేస్తారు. వన్య ప్రాణుల ఆహారపు వేట, సంచారం, పరస్పర ప్రవర్తనలు రికార్డు అయినా సన్నివేశాల ద్వారా శాస్త్రీయ పరిశోధన చేసేందుకు వీలుంటుంది.



**వేటగాళ్లకు అడ్డుకట్ట...** ఏర్పాటు చేసేట్రాక్ కెమేరాలు వేటగాళ్ల ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు కూడా ఉపయోగపడుతున్నాయి. రాత్రిపూట చోటు చేసుకునే అక్రమ కార్యకలాపాలకు ఆపేందుకు ఈ నిఘా వ్యవస్థ పెద్ద ఎత్తున సహాయపడుతోంది. వేటగాళ్ల కదలికలు రికార్డుల రూపంలో దొరకడంతో వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు అవకాశం లభిస్తోంది. ఈ నిఘా నేత్రాలు అటవీ సంపద సంరక్షణకు కూడా పెద్దఎత్తున ఉపయోగపడుతున్నాయి.

### ఈనెల 19 నుండి అటవీ జంతువుల గణన



ఈనెల 19 నుండి 25 వరకు అటవీ జంతువుల గణన జరగనుంది. ఈ గణనలో జిల్లాలో ఎన్ని అటవీ జంతువులు ఉన్నాయి. మాంసాహారం, శాఖాహారం జంతువులు ఏ మేరకు ఉన్నాయి. అనే దానిని లెక్కకట్టనున్నాము, జిల్లాలోపెద్ద పులుల సంచారం ఉంది. అటవీ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

– జిల్లా అటవీ అధికారి జి.కృష్ణ గౌడ్

# ముమ్మర ప్రచారం - భారీ ఏర్పాట్లు

శతాబ్ది ఉత్సవ ముగింపు సభకు

సన్నద్ధమవుతున్న ఖమ్మం



**ప్రజాపక్షం/ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభకు విస్తృత ప్రచారం జరుగుతుంది. అదే రీతిలో సభను జయప్రదం చేసే క్రమంలో ఏర్పాట్లను ముమ్మరం చేశారు. లక్షలాది మంది ఈ సభకు హాజరు కావడంతో పాటు 15వేల మంది జనసేవాదళ్ కార్యకర్తలు నగర వీధుల్లో కవాతు చేయనున్నారు. జనసేవాదళ్ కార్యకర్తలతో పాటు ప్రదర్శనలో పాల్గొనే సిపిఐ కార్యకర్తలు, ప్రజా సంఘాల బాధ్యులు కుడిచేతితో జెండా పట్టుకుని ఎడమ చేయి పైకెత్తి నినదించే రీతిలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకు 40వేల జెండాలను సిద్ధం చేస్తున్నారు. గడిచిన వారం రోజులుగా పార్టీ కార్యాలయంలో సిపిఐ కార్యకర్తలు కర్రలకు జెండాలను అమర్చే పనిలో నిమగ్నమయ్యారు. మరో పక్క ఖమ్మం నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా భారీ ఫ్లెక్సీలు, కటౌట్లను ఏర్పాటు చేస్తున్నారు. కమ్యూనిస్టు పార్టీ నేపథ్యం, పోరాట చరిత నేటి తరానికి తెలియజేయడంతో పాటు దేశ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు, పాలకుల వైఖరి ప్రజా పోరాటాల అవసరాలను తెలియజేస్తూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారు. అమరుల త్యాగాలను గుర్తు చేస్తూ భవిష్యత్తు పోరాటాలకు పిలుపునిచ్చేవిధంగా ప్రత్యేకంగా కటౌట్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈనెల 13న ఖమ్మం నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా భారీ బెలూన్లను ప్రచార కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేయనున్నారు. 14న జిల్లా వ్యాప్తంగా ఇంటింటిపై ఎర్రజెండాను ఎగురవేసేందుకు కార్యకర్తలను సంసిద్ధులను చేశారు. ఇప్పటికే జీపుజాతాలు ద్వారా రెండు దఫాలు జిల్లా వ్యాప్తంగా ప్రచారం నిర్వహించగా ఇప్పుడు అన్ని గ్రామాల్లోనూ ఆటోల ద్వారా శతాబ్ది సంబురాల ముగింపు సభ ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. మరో పక్క 40 దేశాల నుంచి హాజరయ్యే ప్రతినిధులకు ఆహ్వానం పలకడంతో పాటు సిపిఐ జాతీయ, రాష్ట్ర నాయకులకు స్వాగత బ్యానర్లను ఏర్పాటు చేస్తున్నారు.12న కవి సమ్మేళనం ఏర్పాటు చేశారు. మొత్తంగా ప్రచార కార్యక్రమాలతో ఒక పక్క ప్రచారం మరో పక్క ముమ్మర ఏర్పాట్లతో సభను జయప్రదం చేసేందుకు భారత కమ్యూనిస్టు పార్టీ ఖమ్మం జిల్లా యావత్ యంత్రాంగం నిమగ్నమైంది.



## ఇండ్ల ముంగిట రంగవల్లులు

దండి భాస్కర్ మెమోరియల్ ట్రస్ట్, ఏఐవైఎఫ్, మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పోటీలు

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీ వరంగల్‌క్రాస్‌రోడ్‌పరిధిలో ప్రతి ఏటా సంక్రాంతి పండుగకు ముందు దండి భాస్కర్ మెమోరియల్ ట్రస్ట్, ఏఐవైఎఫ్, మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో సిపిఐ పార్టీ పర్యవేక్షణలో నిర్వహించే ముగ్గుల పోటీలు ఆదివారం కన్నుల పండువగా జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రిబ్బన్లను సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...మహిళలలోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు అమరజీవి కామ్రేడ్ దండి భాస్కర్ ముగ్గుల పోటీలకు అంకురార్పణ చేశారన్నారు. అలాగే ప్రజలందరినీ ఐక్యంగా ఉంచగలిగే వేదికగా నిలుస్తుందని ఎలాగైతే భావించారో అది ఈ రంగవల్లుల సాక్షిగా నిజమైందన్నారు. ఇంత పెద్ద ఎత్తున హాజరై మహిళ మణులతో తోడ్పాటుతో విజయవంతంగా కొనసాగుతుండటం గర్వనీయంగా పేర్కొన్నారు. ఇదేవిధంగా ముమ్ముందు కూడా మహిళల సహాయ, సహకారాలు, ప్రోత్సాహం ఉండాలని ఆకాంక్షించారు. కాగా అట్టహాసంగా నిర్వహించిన పోటీలకు సుమారు 1500మందికి పైగా మహిళ మణులు హాజరై రంగరంగుల రంగవల్లులను తీర్చిదిద్దారు. ఇందులో భాగంగా మహిళలు చైతన్యాన్ని కలిగించేలా గీసిన ముగ్గులు ఆలోచింప చేశాయి. న్యాయ నిర్ణయేతలుగా ఖమ్మం జిల్లా కోర్ట్ లాయర్‌లతో పాటు రిటైడ్ టీచర్లు, ప్రస్తుత టీచర్లు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, సిపిఐ జిల్లా సమితి సభ్యులు చెరుకుపల్లి భాస్కర్, వెంపటి సురేందర్, 28,29,30 డివిజన్ల కార్యదర్శులు, యువజన సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ నేత చుండూరి ముత్తయ్య మృతి



నివాళులర్పించిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెం గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకుడు చుండూరి ముత్తయ్య(75) గుండెపోటుతో ఇంటి వద్ద మృతి చెందారు. విషయం తెలుసుకున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కడదాకా కమ్యూనిస్టుగా కొనసాగిన ఆయన జీవితనం ఆదర్శనీయమన్నారు. అటువంటి గొప్ప సిద్ధాంతకర్తను కోల్పోవడం సిపిఐ పార్టీకి తీరనిలోటుగా పేర్కొన్నారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్త పరిచారు. కాగా చుండూరి ముత్తయ్య మరణవార్త తెలుసుకొని, సిపిఐ కార్యకర్తలు, అభిమానులు కన్నీటి పర్యాంతమయ్యారు. తమ ఎర్ర సూరీడిని కోల్పోయమని ఆవేదన వ్యక్తం చేశారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంత్‌రావు, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహ్మద్ మౌలానా, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఐ జిల్లా కార్యరవర్గ సభ్యుడు పుచ్చకాయల కమలాకర్, సిపిఐ పాలేరునియోజకవర్గ నాయకుడు లింగా వెంకటనారాయణ(మేనల్లుడు), జిల్లా కాంగ్రెస్ నాయకుడు మద్ది మల్లారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కళ్లెం వెంకట్ రెడ్డి, బిఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బెల్లం వేణు, మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు గుర్రం అచ్చయ్య, తుమ్మల శ్రీను, కుమారుడు కోడళు చుండూరి కృష్ణ, సృజన(సర్పంచ్) తదితరులు పాల్గొన్నారు.



## తీరనున్న సాగునీటి ఇబ్బందులు

రేపు మంచుకొండ ఎత్తిపోతల పథకం ప్రారంభం

మంత్రి తుమ్మల ప్రత్యేక కృషి



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** రఘునాథపాలెం మండలంలో సాగునీటి కష్టాలు తీరనున్నాయి. రైతుల చిరకాల స్వప్నం నెరవేరనుంది. దశాబ్దాలుగా చెంతనే నాగార్జున సాగర్ కాలువ ప్రవహిస్తున్న మండలంలో సాగునీటి ఇబ్బందులు మాత్రం తీరలేదు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం శాసన సభ్యులుగా గెలిచిన తర్వాత రఘునాథపాలెం మండలానికి సాగర్ జలాలను అందించేందుకు మంచుకొండ ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టారు. రూ. 66 కోట్లతో ఈ పథకానికి రూపకల్పన చేసి గతేడాది జనవరి 13న వి. వెంకటాయపాలెం వద్ద ఈ పథకానికి శంకుస్థాపన చేశారు. ఈ పథకం ద్వారా మండలంలోని 36 చెరువులకు సాగు, త్రాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. 2400 ఎకరాలకు సాగునీటిని అందించనున్నారు. వి. వెంకటాయపాలెం వద్ద సాగర్ ప్రధాన కాలువ నుంచి మోటార్ ద్వారా నీటిని ఎత్తిపోసి పైపులైన్ ద్వారా మంచుకొండ వద్ద సంపును ఏర్పాటు చేసి అక్కడి నుంచి మండలంలోని పలు చెరువులకు నీటిని సరఫరా చేసేలా పైపులైన్లను ఏర్పాటు చేశారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిరంతరం పర్యవేక్షిస్తూ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు చేపట్టారు. రికార్డు స్థాయిలో ఏడాది కాలంలోనే లిఫ్ట్ ఇరిగేషన్ తొలిదశ పనులు పూర్తయ్యాయి. ఈ పథకం ద్వారా పూర్తి స్థాయిలో మండలంలో 64 చెరువులకు నీటిని అందించనున్నారు. తొలి దశలో 36 చెరువులకు నీటిని అందించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. వి. వెంకటాయపాలెం సాగర్ కాలువ వద్ద విద్యుత్ సరఫరాకు ఇబ్బందులు లేకుండా 33/11 కెవి సబ్ స్టేషన్ నిర్మాణం పూర్తి చేశారు. ఈనెల 13న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా ఈ పథకం ప్రారంభం కానుంది.

# కాక రేపుతున్న కల్లూరు మున్సిపాలిటీ ఎన్నికలు




**ప్రజాపక్షం/కల్లూరు:** రిజర్వేషన్ నోటిఫికేషన్ రాకముందే 20 వార్డుల్లో ఉత్కంఠ భరితంగా కల్లూరు మున్సిపాలిటీ రాజకీయం కాక రేపుతుంది. పార్టీల మధ్య పొత్తులుపై ఎత్తులు ఏ విధంగా ఉండబోతున్నాయో అనే ఉత్కంఠ భరితం కొనసాగుతోంది. మండలంలో కల్లూరు మండలం పొంగులేటి స్వగ్రామం శ్రీనివాసరెడ్డికి ప్రత్యేకత సంతరించుకుంది. తాజా సమాచారం ప్రకారం.. కాంగ్రెస్, టిడిపి, సీపీఐ కలిసి నడిచే అవకాశం ఉందని ప్రజల్లో చర్చలు కొనసాగుతుంది. ఓసీ జనరల్ అయితే ప్రముఖంగా నాలుగైదు పేర్లు వినవస్తున్నాయి. పొత్తులో మిత్రపక్షంగా సిపిఐ కి ఒక వార్డు ఇచ్చే అవకాశం ఉందని చర్చలు కొనసాగుతున్నది. టిఆర్‌ఎస్ సీపీఎం లతో పాటు, మిగిలిన కొన్ని పార్టీలు కలిసే అవకాశం ఉందని చర్చలు కొనసాగుతున్నవి. కల్లూరు మున్సిపాలిటీలో ఓసి జనరల్ అయ్యే అవకాశం ఎక్కువగా ఉందంటున్నట్లు నాయకుల్లో చర్చలు ఆశావహులు ఆరు పేర్లు ఉన్నట్లు సమాచారం. కల్లూరు మున్సిపాలిటీ ఎన్నిక రసవత్తరంగా జరిగే అవకాశం ఉన్న కూడా మంత్రి సొంత మండలం కావడం పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక దృష్టి సారించడం, ప్రస్తుత ఎమ్మెల్యే మట్టా రాగమయి, మరోవైపు మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్యకు సవాల్‌గా మారనుంది. ఈ ఎన్నిక ఓటరుపై కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక దృష్టి సారించినది. మొదటి మున్సిపాలిటీ ప్రత్యేక దృష్టి పురపోరుపై 20 వార్డుల్లో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ఇంటింటికి కార్యకర్తలు నాయకుల ద్వారా ఇప్పటికే ప్రచారం చేస్తూ ప్రారంభించారు. మరోవైపు టిఆర్‌ఎస్ కూడా వైఫల్యాలను ప్రచారం చేస్తున్నారు .కల్లూరు పై స్థానిక మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే మట్టా రాగమయిలు మొదటిసారిగా కాంగ్రెస్ జెండా ఎగరవేయాలని కంకణం కట్టుకున్నారు.

# చచ్చిన కోళ్ళతో వ్యాపారం.. ప్రజల ప్రాణాలతో చెలగాటం..

విషతుల్యమవుతున్న జలాలు...

రోగాల బారిన పడుతున్న ప్రజలు...

ఆంధ్రా నుండి తెలంగాణకు విస్తరించిన మాఫియా..

**ప్రజాపక్షం/సత్తుపల్లి :** తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో చేపల పెంపకం ఉపాధిగా నిలుస్తున్న వేళ, అదే రంగాన్ని అడ్డుపెట్టుకుని చచ్చిన కోళ్లను చేపలకు మేతగా వేయడం అనే అత్యంత ప్రమాదకర ధోరణి వెలుగుచూస్తోంది. ఇది కేవలం అక్రమ వ్యాపారమే కాకుండా, ప్రజారోగ్యంపై ప్రత్యక్ష దాడి చేస్తుందని పర్యావరణ వేత్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రా నుంచి తెలంగాణకు మాఫియా మార్గంగతంలో ఆంధ్రప్రదేశ్‌లో బట్టబయలైన కోడి వ్యర్థాల మాఫియా ఇప్పుడు తెలంగాణలోకి చొరబడినట్టు ఆరోపణలు ఉన్నాయి. సత్తుపల్లి నియోజకవర్గం పరిధిలోని ఐదు మండలాల్లోని చెరువులను వేలం ద్వారా దక్కించుకున్న ఓ ముఠా, చేపల పెంపకంలో చచ్చిన కోళ్లను మేతగా ఉపయోగిస్తూ లాభాల కోసం ప్రజల ప్రాణాలను పణంగా పెడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజారోగ్యానికి పెనుముప్పుచచ్చిన కోళ్లలో ఉండే సాల్మొనెల్లా, ఈ కోలి, క్యాంపిలోబాక్టర్ వంటి బ్యాక్టీరియా నీటిలోకి చేరితే చెరువుల నీరు కలుషితం అవ్వటమే కాకుండా చేపలలో విషపూరిత అవశేషాలు చేరే ప్రమాదం పెరుగుతుందని,ఆ నీటిని వినియోగించే గ్రామాల ప్రజల్లో జ్వరాలు, చర్మవ్యాధులు, జీర్ణకోశ సమస్యలు పెరుగుతాయని, పశువులు, మూగజీవాలు సైతం అనారోగ్యాల బారిన పడి మృతి చెందే అవకాశం ఉందని వైద్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాహనం పట్టుబడినా కేసు ఎందుకు లేదు. ఇటీవల తల్లాడ మండలం శివార్లలో పాయపూర్ స్టేజీ సమీపంలో గల వే బ్రిడ్జి వద్ద చచ్చిన కోళ్లను భారీగా తరలిస్తున్న ఏపి 39యూఎల్ 6567 బోలేరో వాహనాన్ని కొందరు యువకులు అడ్డుకుని ఇదేమిటి , ఎక్కడికి తరలిస్తున్నారు అని సదరు డ్రైవర్ ను ప్రశ్నించగా "చెరువులో చేపలకు అహారంగా వేయటానికి" తీసుకెళ్తున్నామన్న సమాధానంతో ఆగ్రహించిన యువకులు 100కి కాల్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. శుక్రవారం అర్ధరాత్రి స్టేషన్‌కు వెళ్ళిన వాహనం ఎటువంటి కేసు నమోదు కాకుండా చివరికి చచ్చిన కోళ్ళను పూడ్చమని ఆదేశించకుండా శనివారం మధ్యాహ్నం కొందరు రాజకీయ నాయకుల సిఫార్స్‌తో విడిచిపెట్టారు. మరింత దారుణం ఏమిటంటే ఆ కోళ్లను తర్వాత కల్లూరు మండలంలోని ఓ చెరువులో చేపల ఆహారంగా వేసినట్టు సమాచారం. ఇది చట్ట అమలు వైఫల్యానికి నిదర్శనం కాకపోతే ఏమిటని పర్యావరణ వేత్తలు ప్రశ్నిస్తున్నారు.






**చట్టాలున్నా అమలు ఎక్కడ..?**

మృత జంతు వ్యర్థాల రవాణా, వినియోగం నియంత్రిత, నిషేధిత చర్యలు పశుసంవర్ధక, మత్స్య, కాలుష్య నియంత్రణ నిబంధనలు స్పష్టంగా ఉన్నా అవి పేపర్లకే పరిమితం కావటం మాఫియాకు అండగా మారుతుంది. చెరువుల నిర్వహణ, మేత నాణ్యతపై మత్స్యశాఖ తనిఖీలు లేకపోవటం, ప్రజల ఫిర్యాదులు ఉన్నా కేసు నమోదు కాకపోవటం పలు అనుమానాలకు తావిస్తుంది.కాలుష్య నియంత్రణ మండలి నీటి నమూనాల పరీక్షలు జరపి చెరువులో జలాలపై జరుగుతున్న అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు, ప్రజాసంఘాల నాయకులు కోరుతున్నారు తక్షణమే బాధ్యులపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి క్రిమినల్ కేసులు నమోదు చెయ్యాలని పర్యావరణ వేత్తలు కోరుతున్నారు. ఈ విషయంపై తల్లాడ ఎస్ఐని ప్రజాపక్షం తల్లాడ ప్రతినిధి ఫోన్ లో సంప్రదించగా ఫోన్ లిఫ్ట్ చెయ్యలేదు.

# మేడారం జాతర అభివృద్ధి పనులు
# పర్యవేక్షించిన మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/ములుగు:** తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద జరుగుతున్న పనులను, హరిత హోటల్ క్రాస్ వద్ద జరుగుతున్న సర్కిల్ సుందరీకరణ పనులను, అలాగే ఊరట్టం క్రాస్ వద్ద సుందరీకరణ పనులను, జంపన్న వాగు వద్ద దుస్తులు మార్చుకునే గదులు, స్నాన ఘట్టాల వద్ద ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఎస్పి సుధీర్ రాంనాథ్ కేకన్, ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణితో మంత్రి సీతక్క పరిశీలించారు. మేడారం జాతర పర్యటనలో భాగంగా జంపన్న వాగు వద్ద జాతర పనులను పర్యవేక్షిస్తున్న సమయంలో మంత్రి సీతక్క మానవత్వానికి నిదర్శనంగా నిలిచారు. ఈ సందర్భంగా ఒక చిన్నారి తల్లిదండ్రుల నుండి తప్పిపోయి ఉన్నట్లు గమనించిన మంత్రి సీతక్క, వెంటనే ఆ చిన్నారిని చేతుల్లోకి తీసుకొని ఆమె తల్లిదండ్రులను గుర్తించేందుకు అధికారులను కోరారు. మంత్రి ఆదేశాల మేరకు స్పందించిన అధికారులు తక్షణమేన చిన్నారి తల్లిదండ్రులను గుర్తించారు. అనంతరం ఆ చిన్నారిని మంత్రి సీతక్క స్వయంగా వారి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సంఘటన అక్కడున్న భక్తులను ఎంతగానో కదిలించింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మేడారం జాతరలో చిన్న పిల్లలు, వృద్ధులను అత్యంత జాగ్రత్తగా చూసుకోవాలని ప్రజలకు సూచించారు. వారిని ఎక్కడా ఒంటరిగా వదిలివేయకూడదని, ఎవరైనా తప్పిపోయినట్లయితే వెంటనే సమీపంలో ఉన్న యూనిఫాం ధరించిన పోలీస్ సిబ్బందిని సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే మేడారం జాతరలో తప్పిపోయిన వారి కోసం ప్రత్యేకంగా మిస్సింగ్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. ఈ క్యాంపుల ద్వారా తప్పిపోయిన వారిని త్వరగా గుర్తించి వారి కుటుంబ సభ్యులకు చేర్చేలా చర్యలు తీసుకుంటున్నామని ఆమె వివరించారు. భక్తుల భద్రతే ప్రభుత్వానికి మొదటి ప్రాధాన్యమని, అందరూ సహకరించాలని జాతరను సురక్షితంగా నిర్వహించుకోవాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు.

## అక్రమంగా తరలిస్తున్న పిడిఎస్ బియ్యం పట్టివేత



**ప్రజాపక్షం/టేకుమట్ల :** మండలంలోని బుర్నపల్లి నుండి కాల్వశ్రీరాంపూర్ వెళ్లే మార్గంలో మానేరు వాగు వద్ద సివిల్ సప్లైయ్ అధికారులు తనిఖీలు నిర్వహించగా 3 వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న 90 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాదీనం చేసుకున్నారు.రేగొండ మండలం కొడవటంచ గ్రామానికి చెందిన కట్ల శ్రీనివాస్,గోరుకొత్తపల్లి మండలంలోని విజయపల్లి గ్రామానికి చెందిన బొమ్మల శ్రీధర్‌లు మండలంలోని గ్రామాలలో రేషన్ బియ్యంను తక్కువ ధరకు కొనుగోలు చేసి పక్క జిల్లాతో పాటు,రాష్ట్రలకు తరలిస్తున్న క్రమంలో బుర్నపల్లి నుండి కాల్వశ్రీరాంపూర్ వెళ్లే మార్గంలో మానేరు వాగు వద్ద పట్టుబడ్డారు .90 క్వింటాళ్ల పట్టుబడ్డ బియ్యాన్ని సివిల్ సప్లైయ్ అధికారులు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.అక్రమంగా బియ్యాన్ని తరలిస్తున్న కట్ల శ్రీనివాస్,బొమ్మల శ్రీధర్ తోపాటు 3 వాహనాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై దాసరి సుధాకర్ తెలిపారు.

## వాకర్స్ ఆధ్వర్యంలో కొత్తకొండకు సైకిల్ యాత్ర




**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** సైకిల్, వాకర్స్ అసోసియేషన్ వరంగల్ అధ్యక్షుడు జంగా గోపాలరెడ్డి ఆధ్వర్యం లో ఆదివారం పబ్లిక్ గార్డెన్ నుండి కొత్తకొండ జాతర వరకు తిరిగి పబ్లిక్ గార్డెన్ వరకు సైకిల్ మారథాన్ ను కాజీపేట పురుషోత్తం విశ్రాంత జిల్లా అటవీశాఖ అధికారి, అధ్యక్షుడు పర్యావరణ ఐక్య వేదిక వరంగల్ సైకిల్ చోదకులకు శుభాకాంక్షలు తెలిపి సైకిల్ యాత్ర ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన పురుషోత్తం సైకిల్ యాత్రలు పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించే అవగాహన కల్పిస్తాయని, సైకిల్ యాత్ర ల వల్ల మోకాళ్ళ నొప్పులు తగ్గడమే కాక గుండె కండరాలకు వ్యాయామం తో పాటు రక్త ప్రసరణ జరిగి ఆరోగ్యం చేకూరుతుంది అని ప్రశంసించారు. సైకిల్ ఆవిష్కరణ జరిగి 150 ఏళ్లు అయినా దానికి ఉన్న మోజు ,ప్రాముఖ్యత ప్రపంచ వ్యాప్తంగా ఏ మాత్రం తగ్గలేదని అన్నారు. ప్రత్యేక అతిథి గా పీవీ మదన్ మోహన్ రావు హాజరై మాట్లాడుతూ సీనియర్ పౌరులు ఇలాంటి సైకిల్ యాత్రలు చేపట్టడం యువతకు స్ఫూర్తి దాయకం అని అభినందనలు తెలిపారు. ఈ సైకిల్ యాత్రలో, సంఘం సెక్రెటరీ పులివెండ్ల అనంత్, జాయింట్ సెక్రెటరీ పాక సత్యనారాయణ, సైకిల్ చోదకులు సుధాకర్ రెడ్డి,రాంబాబు,రవి,రాజు, చంద్రమౌళి, సుదర్శన్, చైతన్య గిరి పాల్గొన్నారు.

## సంక్రాంతి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం: టిపిసిసి సభ్యుడు



**ప్రజాపక్షం/నెక్కొండ:** నెక్కొండ మండలం దీక్షకుంట్ల గ్రామంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్ భూలక్ష్మి రంజిత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సంక్రాంతి క్రికెట్ టోర్నమెంట్‌ను టిపిసిసి సభ్యులు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఐక్యతతో పాటు శారీరక ధృడత్వాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి క్రీడా కార్యక్రమాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నెక్కొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బక్కి అశోక్, మండల ప్రధాన కార్యదర్శి కుసుమ చెన్నకేశవులు, పట్టణ అధ్యక్షులు ఈదునూరి సాయికృష్ణ, రామాలయం కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్ రెడ్డి, ఓబిసి జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ రఘు, మార్కెట్ డైరెక్టర్ రావుల మహిపాల్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సింగం ప్రశాంత్, దీక్షకుంట గ్రామ సర్పంచ్ జమాండ్ల భూలక్ష్మి రంజిత్, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, యూత్ నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే టోర్నమెంట్ నిర్వహణలో మేనేజ్‌మెంట్ సభ్యులు ముసుకు రుత్విక్, పతంగి సాయికుమార్, బండారి సాయి కుమార్, పొనకంటి సూర్య ప్రకాష్, తదితరులు విశేషంగా కృషి చేశారు.

## క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



**ప్రజాపక్షం/జనగామ:** పట్టణ కేంద్రంలోని మినీ స్టేడియంలో గుర్రం నాగరాజు, ఎనగందుల కృష్ణ ఆధ్వర్యంలో యువకుల కోసం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడుతాయన్నారు. క్రీడల శారీరక దారుఢ్యంతో పాటు స్నేహభావం, క్రమశిక్షణ పెంపొందుతాయన్నారు. యువత చదువుతోపాటు క్రీడలలో చురుగ్గా పాల్గొని ఆరోగ్యవంతమైన భవిష్యత్‌ను నిర్మించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, క్రీడాభిమానులు, యువకులు పాల్గొన్నారు.

## ఇఎంఐ కట్టలేక ఆత్మహత్య

**ప్రజాపక్షం/పాలకుర్తి:** వివిధ బ్యాంకులలో తెచ్చిన రుణంతో ఇంటి నిర్మాణం, కారు కొనుగోలు చేస ఇఎంఐ కట్టలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని వల్మిడిలో ఆదివారం జరిగింది. ఎస్ఐ దూలం పవన్ కుమార్ తెలిపిన విరాలు ఇలా ఉన్నాయి. వల్మిడి గ్రామానికి చెందిన చేత సోమనర్సయ్య (45) అనే వ్యకి గత రెండేళ్ల క్రితం బ్యాంకులో రుణాలు తీసుకుని కొత్త ఇల్లు నిర్మాణంతోపాటు ఒక కారు కొనుగోలు చేశారు. కొన్ని నెలలుగా సక్రమంగా ఈఎంఐ చెల్లించాడు. పనిచేయలేక ఇంటి వద్దనే ఉంటూ తాగుడుకు బానిసయ్యాడు. ఈ క్రమంలో ఈఎంఐ చెల్లించకపోవడంతో మనోవేధనకు గురైన సోమనర్సయ్య ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని భార్య శోభారాణి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని జనగామ ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు తెలిపారు. మృతునికి ఇద్దరు కుమారులున్నారు.

## సిసిఆర్‌బిని సిపి తనిఖీ



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలోని సిసిఆర్బీ కార్యాలయాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ శనివారం సాయంత్రం తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా పోలీస్ కమిషనర్ సెక్షన్ల వారిగా పోలీస్ సిబ్బంది నిర్వహిస్తున్న విధుల వివరాలతో పాటు, వారు నిర్వహిస్తున్న రికార్డులు, అందులో నమోదు చేసిన వివరాలను సంబంధిత సంబంధిత సెక్షన్ సిబ్బంది అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీల్లో పోలీస్ కమిషనర్, రౌడీ షీట్లు, జైల్ రిలీజ్, ఎస్సీ, ఎస్.టి, మిస్సింగ్, యంసిఆర్ , విచారణలు, చోరీ కేసులు, రోడ్డు ప్రమాదాలు, నేరాలు,మహిళలపై నేరాలకు సంబంధించి రికార్డుల నిర్వహణపై పోలీస్ కమిషనర్ పరిశీలించారు. ఈ తనిఖీల్లో అదనపు డీసీపీ రవి, ఏసీపీలు డేవిడ్ రాజు, జనార్ధన్ రెడ్డి, ఇన్స్‌స్పెక్టర్లు శ్రీనివాస్, సంజీవ్, మల్లయ్య, ప్రవీణ్ కుమార్, శ్రీనివాస్ రావుతో సిసి ఆర్బీ విభాగం ఎస్.ఐలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## 'ప్రజాపక్షం' పత్రిక క్యాలెండర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/చెన్నారావుపేట :** ప్రజా సమస్యలను వెలికితీయడంలో ప్రజాపక్షం పత్రికకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సిద్ధన రమేష్ అన్నారు. ఆదివారం మండలంలోని అమీనాబాద్ గ్రామంలో ప్రజాపక్షం పత్రిక క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను రాయడంలో ముందంజలో ఉందని కొనియడారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ధారా రంజిత్, ఉప సర్పంచ్, బండి హరీష్ లతోపాటు వార్డ్ సభ్యులు పాల్గొన్నారు.

## మౌలిక వసతుల కల్పనకు ప్రజా ప్రభుత్వం కృషి

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**ప్రజాపక్షం/భూపాలపల్లి:** పట్టణ ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు ప్రజా ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధి 9వ వార్డు మహబూబ్‌పల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన రేషన్ షాప్‌ను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్, ముఖ్య నాయకులతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు అందుబాటులోకి తీసుకురావడమే సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. మహబూబ్‌పల్లి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఈ నూతన రేషన్ షాప్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. ఇకపై ఈ గ్రామ ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లకుండా తమకు అవసరమైన నిత్యావసర సరుకులను సులభంగా పొందవచ్చన్నారు. **పోచమ్మ తల్లి ఆలయ నిర్మాణ పనులకు శంకుస్థాపన :** వెంగళరావు నగర్ కాలనీలో పోచమ్మ తల్లి ఆలయ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే జీఎస్సార్ భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని వెంగళరావు నగర్ కాలనీలో నూతనంగా నిర్మించనున్న పోచమ్మ తల్లి ఆలయ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. వెంగళరావు నగర్ కాలనీ అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలతో పాటు ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికీ తమ వంతు సహకారం కొనసాగిస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. **సిసి కెమెరా లను ప్రారంభం:** లక్ష్మీనగర్‌లో సీసీ కెమెరాలను ప్రారంభించిన ఎమ్మెల్యే జీఎస్సార్ లక్ష్మీనగర్‌లో కాలనీవాసుల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజల భద్రతే ప్రభుత్వ ప్రథమ లక్ష్యమని, సీసీ కెమెరాల ద్వారా నేరాల నియంత్రణతో పాటు శాంతిభద్ర తలు మరింత బలోపేతం అవుతాయని అన్నారు.

## రెండు జిల్లాలను కలిపి వరంగల్‌ను అభివృద్ధి చేయాలి

### ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/హనుమకొండ:** అశాస్త్రీయంగా విభజించబడిన హనుమకొండ, వరంగల్ జిల్లాలను కలిపి ఒకే వరంగల్ జిల్లాగా ప్రకటించడం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. కాజీపేట, హనుమకొండ, వరంగల్ ట్రైసిటీని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి హైదరాబాదు నగరానికి సమాంతరంగా అభివృద్ధి చేయాలనే డిమాండ్ తో తెలంగాణ ఉద్యమకారుల వేదిక, ఫోరం ఫర్ బెటర్ వరంగల్, పౌర సంఘాలు సమిష్టిగా ఆదివారం హనుమకొండ జిల్లా కేంద్రం ఏకశిలా పార్క్ వద్ద ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ అధ్యక్షతన నిర్వహించిన నిరసన దీక్షలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. రాజకీయ స్వార్థంతో ఆరు ముక్కలైన వరంగల్ ఉమ్మడి జిల్లాను బాగు చేయడం కోసం జరుగుతున్న ఉద్యమానికి తన మద్దతు ఉంటుందని అన్నారు. అశాస్త్రీయ జిల్లాల విభజనతో వరంగల్ మహా నగరాన్ని ముక్కలు చేసి ప్రజలను, అధికారులను గందరగోళానికి గురిచేశారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కుడా చైర్మన్, హనుమకొండ జిల్లా డిసిసి అధ్యక్షులు ఇనుగాల వెంకటరామిరెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి (ఫోన్ ద్వారా సందేశం), మాజీ మేయర్ డాక్టర్ టీ రాజేశ్వర రావు, సాంస్కృతిక నగరాన్ని రెండు ముక్కలుగా చేశారని అన్నారు. ఈ దీక్షలో ప్రొఫెసర్ కూరపాటి వెంకట్ నారాయణ, పుల్లూరు సుధాకర్, తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర కన్వీనర్ సోమ రామమూర్తి, విసికె పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్, ఆల్ ఇండియా ఓబిసి జాక్ చైర్మన్ సాయిని నరేందర్, వివిధ సంఘాల నాయకులు బాబురావు, మల్లారెడ్డి, చాపర్తి కుమార్ గాడ్గే, సోమిడి శ్రీనివాస్, పాల్గొన్నారు.

## 300 వీధి కుక్కల సామూహిక వధ

### ఇద్దరు గ్రామ కార్యదర్శులు, ఇద్దరు సర్పంచ్ లపై కేసు నమోదు



**ప్రజాపక్షం/శాయంపేట :** కుక్కలను సామూహిక హత్యలకు గ్రామ సర్పంచులు, సెక్రటరీలు, కొందరు వ్యక్తులు బాధ్యులని ఆరోపణలతో జంతు సంరక్షణ చట్టాలను పూర్తిగా ఉల్లంఘించిన ఘోర నేరం క్రింద జంతు సంక్షేమ కార్యకర్త ఫర్జానా బేగం, స్ట్రే అనిమల్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా (ఎస్జీవో) క్రూరత్వ నివారణ మేనేజర్ ఆదులాపురం గౌతమ్ శాయంపేట పోలీస్ స్టేషన్ ను సందర్శించి అధికారిక ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేయబడిందని పోలీసులు తెలిపారు. వివరాలలోకి వెళితే హన్మకొండ జిల్లా శాయంపేట మండల కేంద్రం, ఆరెపల్లి గ్రామంలో కుక్కల బెడద వల్ల జనాలను కరుస్తున్నాయనే నేపం కారణంగా వీధి కుక్కలను జనవరి 6,7,8 తేది లలో గ్రామ కార్యదర్శులు, సర్పంచ్ లు, సర్పంచ్ భర్త, ఉప సర్పంచ్ సామూహికంగా కుక్కలను చంపమని కిందరికి చెప్పడం తో వాటిని చప్పడం జరిగింది. ఈ వ్యవహారంలో మాజీ కేంద్ర మంత్రి జోక్యం చేసుకొని సర్కిల్ ఇన్‌స్పెక్టర్, సబ్‌ఇన్‌స్పెక్టర్‌లతో మాట్లాడి ఎఫ్ఐఆర్ నమోదు చేయడం మృతిచెందిన జంతువులకు చట్ట ప్రకారం పోస్ట్‌మార్టం నిర్వహించడం కోసం ఆదేశించారని పిర్యాదు దారుడు ఆదులాపురం గౌతమ్ ఒక ప్రకటన విడుదల చేయారు. వీధి కుక్కల జనాభాను నియంత్రించడానికి ఏకైక శాస్త్రీయ, మానవీయ పరిష్కారం ఎనిమల్ బర్త్ కంట్రోల్ రూల్స్ (ఏబీసీ) మాత్రమేనని స్పష్టం చేశారు.ఎనిమల్ బర్త్ కంట్రోల్ రూల్స్ , 2023 అమలులో వైఫల్యం స్థానిక సంస్థల నిర్లక్ష్యం వల్లనే వీధి కుక్కల సంఖ్య పెరిగిందని తెలిపారు.అందువల్ల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రాష్ట్రవ్యాప్తంగా సామూహిక స్టెరిలైజేషన్ (వంధ్యకరణ) మరియు యాంటీ రేబిస్ టీకాల (ఏఆర్వీ) కార్యక్రమాలను ప్రారంభించాలని ఆయన కోరారు. చట్టవిరుద్ధ హత్యలు ఎట్టి పరిస్థితుల్లోనూ పరిష్కారం కాదు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటేనే ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నివారించవచ్చని ఆయన హెచ్చరించారు.

## లైబ్రరీ సైన్స్‌తో విస్తృత ఉద్యోగావకాశాలు: రాంచంద్రం



**ప్రజాపక్షం/కేయూ క్యాంపస్ :** కేయూ దూర విద్యా కేంద్రం లో ఆది వారం బిఎల్ ఐఎస్సీ విద్యార్థుల వీడ్కోలు సమావేశం జరిగింది. దూర విద్యా కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ బి సురేష్ లాల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రాంచంద్రం మాట్లాడుతూ లైబ్రరీ సైన్స్ కోర్సులు చేసిన విద్యార్థులకు ప్రభుత్వ ప్రైవేట్ రంగాలలో మంచి ఉద్యోగ అవకాశాలున్నాయని వాటిని అంది పుచ్చుకోవాలని అన్నారు. దూర విద్యా కేంద్రం డైరెక్టర్ ప్రొ సురేష్ లాల్ మాట్లాడుతూ గ్రంథాలయ కోర్సులు ప్రణాళిక బద్ధంగా నిర్వహిస్తున్నామని, వారికి పరీక్షలు నిర్వహించి ఫలితాలు ప్రకటిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ బి రాధికా రాణి, కౌన్సిలర్లు డాక్టర్ ఎం అంజయ్య, వి కృష్ణమా చార్య, డాక్టర్ కె ఇంద్రసేనా రెడ్డి, డాక్టర్ నిరంజన్, డాక్టర్ జగదీష్ లు ఇతరులు ప్రసంగించి విద్యార్థులకు సూచనలు చేశారు. విద్యార్థులు ఎన్ శివాజీ గౌడ్, జార్జ్, అశోక్, క్రాంతి, మంజుల, రాధిక, లావణ్య, రామ దేవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లను, అతిథులను సన్మానించారు.

## న్యాయం కోసం జీవితం అంకితం చేసిన వడ్డే ఓబన్న

### ఓబన్న చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే నాయిని



**ప్రజాపక్షం/కాజీపేట :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని కాజీపేట చౌరస్తాలో వడ్డే ఓబన్న 219వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి హాజరై వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ వడ్డే ఓబన్న కేవలం ఒక వ్యక్తి మాత్రమే కాదని, అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహనీయుడని అన్నారు. కష్టజీవుల హక్కుల కోసం, సమాజంలో సమానత్వం, న్యాయం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన యోధుడు వడ్డే ఓబన్న అని పేర్కొన్నారు. అప్పటి కాలంలోనే అన్యాయాలకు ఎదురు నిలబడి, వడ్డే (వడ్డెర) కుల స్థుల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లిన గొప్ప నాయకుడని తెలిపారు.విద్య, ఉపాధి, గౌరవమే నిజమైన అభివృద్ధి అని చాటి చెప్పిన నాయకుడు వడ్డే ఓబన్న అని, ఇలాంటి మహనీయుల జయంతులను కేవలం పూలమాలలతో ముగించకుండా, వారి ఆశయాలను జీవితాల్లో, పాలనలో అమలు చేసినప్పుడే వారికి నిజమైన నివాళి అవుతుందని ఎమ్మెల్యే అన్నారు.
ప్రజా ప్రభుత్వంలో భాగంగా, ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి నాయకత్వంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం, వడ్డే సమాజం అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. విద్య, ఉపాధి, నివాసం, ఆర్థిక స్వావలంబన దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. అలాగే వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో వడ్డే సమాజానికి సంబంధించిన సమస్యలను ప్రత్యేక దృష్టితో పరిష్కరించేందుకు తాను ఎప్పుడూ మీతో పాటు ఉంటానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వడ్డే సంఘ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## యువత క్రీడలలో ముందుండాలి: సిఐ సత్యనారాయణ రెడ్డి



**ప్రజాపక్షం/జనగామ టౌన్:** యువత క్రీడలలో ముందుండాలని సీఐ సత్యనారాయణ రెడ్డి అన్నారు. ఆదివారం డెమోక్రటిక్ యూత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జిల్లా కమిటి ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ జిల్లా కేంద్రంలోని ప్రెస్టన్ గ్రౌండ్‌లో నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి సీఐ హాజరై ప్రారంభించి మాట్లాడుతూ యువతను క్రీడల వైపు ఆకర్షించడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడం, సంప్రదాయ క్రీడలైన కబడ్డీని భవిష్యత్ తరాలకు అందించడం అనేది చాలా ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ చెన్నకేశవులు, ప్రెస్టన్ స్కూల్ కరెస్పాండెంట్ బక్క ప్రవీణ్, డీవైఎఫ్ మాజీ జిల్లా అధ్యక్షులు, రైతు సంఘం రాష్ట్ర నాయకులు మోకు కనకారెడ్డి, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బోడ నరేందర్, అధ్యక్షులు ధర్మబిక్షం, వర్కింగ్ ప్రెసిడెంట్ సాయిప్రసాద్, గోపి, ప్రకాశ్, శేఖ్, మహేందర్ నాయక్, కుమార్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



## ఉత్కంఠపోరులో..
# భారదే విజయం

న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌లో టీమ్‌ఇండియా శుభారంభం చేసింది. వడోదర వేదికగా జరిగిన తొలి మ్యాచ్‌లో 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఉత్కంఠభరితంగా సాగిన పోరులో గెలుపు కోసం ఇరు జట్లూ తీవ్రంగా పోరాడాయి. అయితే, ఆఖరికి విజయం భారత్‌నే వరించింది. దీంతో మూడు వన్డేల సిరీస్‌లో టీమ్‌ఇండియా 10 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. తొలుత బ్యాటింగ్ చేసిన



న్యూజిలాండ్ 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 300 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన భారత్ 49 ఓవర్లలో 6 వికెట్లను కోల్పోయి 306 పరుగులు చేసి విజయం సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' విరాట్ కోహ్లి (93) కొద్దిలో సెంచరీని చేజార్చుకున్నాడు. శుభ్‌మన్ గిల్ (56) హాఫ్ సెంచరీ సాధించాడు. కివీస్ బౌలర్లలో జేమీసన్ 4.. ఆదిత్య అశోక్, క్లార్క్ చెరో వికెట్ తీశారు.

### కాస్త టెన్షన్ పెట్టినా..

న్యూజిల్యాండ నిర్దేశించిన 301 పరుగుల లక్ష్య ఛేదనకు దిగిన భారత్ స్కోరు 39 ఓవర్లకు 234/2.. అప్పటికి క్రీజ్‌లో విరాట్ కోహ్లి సెంచరీకి చేరువగా ఉన్నాడు. శ్రేయస్ (49) కూడా మంచి ఫామ్ కనబరిచాడు. చివరి 66 బంతుల్లో 67 పరుగులు చేయాలి. చేతిలో ఇంకా 8 వికెట్లు. కానీ, ఇక్కడే కివీస్ బౌలర్ జేమీసన్ విజృంభించాడు. ఒకే ఓవర్‌లో విరాట్, రవీంద్ర జడేజా (4)ను ఔట్ చేసి భారత అభిమానులను కాస్త టెన్షన్‌కు గురి చేశాడు. అయితే, హర్షిత్ రాణా (29), కేఎల్ రాహుల్ (29*) దూకుడుగా ఆడి మ్యాచ్‌ను భారత్ వైపు తిప్పారు. వీరిద్దరూ కీలక సమయంలో పరుగులు రాబట్టారు. హర్షిత్ రాణా ఔటైన తర్వాత వాషింగ్టన్ సుందర్ (7*)తో కలిసి కేఎల్ ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లాడు. బౌలింగ్ చేస్తూ గాయపడిన సుందర్ కివీస్ ఇన్నింగ్స్ 20వ ఓవర్ సమయంలోనే మైదానం వీడాడు. దీంతో బ్యాటింగ్‌కు వస్తాడా? లేదా? అనే అనుమానాలు తొలుత తలెత్తాయి. కానీ, అవసరమైన సమయంలో నొప్పితోనే సుందర్ వచ్చి ఆఖరి వరకూ క్రీజ్‌లో ఉండిపోయాడు. చివరి రెండు ఓవర్లలో 12 పరుగులు అవసరం కాగా.. 49వ ఓవర్‌లోనే కేఎల్ రాహుల్ 2 ఫోర్లు, సిక్స్ బాదేసి మ్యాచ్‌ను త్వరగా ముగించాడు. భారత బ్యాటర్లలో రోహిత్ శర్మ (26) రాణించాడు.

### డారిల్ మిచెల్ దూకుడు

తొలుత బ్యాటింగ్ చేసిన కివీస్ భారీ స్కోరు చేయడంలో డారిల్ మిచెల్ (84)తోపాటు ఓపెనర్లు డేవన్ కాన్వే (56), హెన్రీ నికోల్స్ (62) కీలక పాత్ర పోషించారు. ఈ ముగ్గురూ హాఫ్ సెంచరీలతో రాణించారు. మిచెల్ దూకుడుగా ఆడి పరుగులు రాబట్టాడు. భారత బౌలర్లలో హర్షిత్ రాణా 2, సిరాజ్ 2, ప్రసిద్ధ్ కృష్ణ 2, కుల్‌దీప్ యాదవ్ ఒక వికెట్ తీశాడు.

# భారత్‌లో 'ఫిఫా' ట్రోఫీ

**ఇక మూడు రోజులు ఫ్యాన్స్‌కు పండగే!**



ఫుట్‌బాల్ అభిమానులకు గుడ్‌న్యూస్. నిరుడు 'గోట్ ఇండియా టూర్ ఆఫ్ ఇండియా 2025'లో లియోనల్ మెస్సీ భారత్‌లోని ప్రధాన నగరాలను మెరుపులా చుట్టేయగా.. ఇప్పుడు ఫిఫా వరల్డ్‌కప్ ట్రోఫీ సందడి మొదలైంది. మెగా టోర్నీకి 6 నెలల గడువే ఉండడంతో నిర్వాహకులు ట్రోఫీని అభిమానుల సందర్శన కోసం భారత్‌కు తీసుకొచ్చారు. ఆలిండియా ఫుట్‌బాల్ సమాఖ్య అధ్యక్షుడు కల్యాణ్ చౌబే ట్రోఫీని ఆవిష్కరించాడు. పుష్కర కాలం తర్వాత ఫిఫా ప్రపంచకప్ ట్రోఫీని భారత్‌లో ప్రదర్శిస్తున్నారు. మూడు రోజులు దేశంలోని ప్రధాన నగరాల్లో అభిమానుల సందర్శనార్థం ఈ ట్రోఫీని ఉంచుతారు. ఫిఫా ట్రోఫీ ఆవిష్కరణలో ఏఐఎఫ్ఎఫ్ అధ్యక్షుడు కల్యాణ్ చౌబే, కేంద్ర క్రీడల మంత్రి, యువజనుల వ్యవహారాల మంత్రి మన్సూఖ్ మాండవీయ, బ్రెజిల్ వరల్డ్‌కప్ విజేత గిల్బర్టో సిల్వా పాల్గొన్నారు. రెండు రోజు లు ఢిల్లీలోని ప్రముఖ సెంటర్లలో ఫిఫా ట్రోఫీని ప్రదర్శనకు ఉంచుతారు. అనంతరం అస్సాంలోని గౌహతిలో వరల్డ్‌కప్ ట్రోఫీ సందడి చేయనుంది. అయితే.. భారత ఫుట్‌బాల్‌ను నాశనం చేస్తున్న చౌబే.. సాకర్ కప్‌ను ఆవిష్కరించడాన్ని పలువురు తప్పుపడుతున్నారు. ఇండియన్ సూపర్ లీగ్ ప్రారంభోత్సవం సందర్భంగా కేంద్ర మంత్రి మన్సూఖ్ పాపులర్ జట్ల మోహన్ బగన్, ఈస్ట్ బెంగాల్ పేర్లను తప్పుగా పలకడం కూడా విమర్శలకు తావిచ్చింది మండిపడుతున్నారు.

### జూన్ 11 నుంచి షురూ..

ఈఏడాది ఫిఫా ప్రపంచకప్ పోటీలకు అమెరికా, కెనడా, మెక్సికో సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్నాయి. జూన్ 11వ తేదీ గురువారం ఫిఫా వరల్డ్‌కప్ ప్రారంభం కానుంది. నెల రోజులకుపైగా అభిమానులను గోల్స్ వర్షంలో ముంచెత్తనున్న ఈ టోర్నీ జూలై 19వ తేదీన ముగియనుంది. గత సీజన్‌లో విజేతగా నిలిచిన అర్జెంటీనా డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగనుంది.

## నందని శర్మ హ్యాట్రిక్




మహిళల ప్రీమియర్ లీగ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్ నందని శర్మ హ్యాట్రిక్ నమోదు చేసింది. గుజరాత్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 20వ ఓవర్లో వరుసగా మూడు వికెట్లు తీసి చరిత్రకెక్కింది. నాలుగో బంతికి కనికా ఆహూజాను వికెట్ కీపర్ లీ స్టంపౌట్ చేసింది. ఐదో బంతికి రాజేశ్వరీ గైక్వాడ్‌ను నందని బౌల్డ్ చేసింది. అనంతరం క్రీజులోకి వచ్చిన రేణుకా సింగ్‌ను బౌల్డ్ చేసి హ్యాట్రిక్ పూర్తి చేసుకుంది. మొత్తంగా ఈ లీగ్ చరిత్రలో ఈ ఫీట్ సాధించిన నాలుగో బౌలర్‌గా నందని అవతరించింది. డబ్ల్యూపీఎల్‌లో నందని కంటే ముందు ఇసీ వాంగ్(ముంబై ఇండియన్స్), దీప్తి శర్మ(యూపీ వారియర్స్), గ్రేస్ హ్యారిస్(యూపీ వారియర్స్)లు హ్యాట్రిక్ వికెట్లు పడగొట్టారు. ఆరంభ సీజన్‌లో యూపీ వారియర్స్‌పై వాంగ్ వరుసగా మూడు వికెట్లు తీసింది. కిరన్ నవ్‌గరే, సిమ్రాన్ షేక్, సోఫీ ఎకిల్‌స్టోన్‌లను ఔట్ చేసింది.

# ఆరోగ్యం



## మారథాన్‌తో గుండెకు నష్టం లేదు..

మారథాన్ పరుగు శరీరంపై తీవ్రమైన ఒత్తిడిని కలిగించినప్పటికీ, ఇది గుండెకు శాశ్వత నష్టం చేస్తుందనే భయం పెద్దగా నిజం కాదని తాజా పరిశోధన వెల్లడించింది. 'జమా' కార్డియాలజీ జర్నల్‌లో ప్రచురితమైన పది సంవత్సరాల అధ్యయనం ప్రకారం, 152 మంది సాధారణ మారథాన్ రన్నర్లలో పరుగు తర్వాత గుండె కుడి వైపు పనితీరు తాత్కాలికంగా తగ్గినా, అది కొద్ది రోజుల్లోనే పూర్తిగా కోలుకుంది. పరుగు అనంతరం రక్తంలో పెరిగే ట్రోపోనిన్ స్థాయిలు గుండెపై పడే తాత్కాలిక ఒత్తిడిని మాత్రమే సూచిస్తాయి. అవి హార్ట్ అటాక్ లేదా శాశ్వత గుండె నష్టానికి నిదర్శనం కావని అధ్యయనం స్పష్టం చేసింది. పదేళ్ల పాటు గమనించినా, రన్నర్లలో గుండె నిర్మాణం లేదా పనితీరులో దీర్ఘకాలిక హానికి ఎలాంటి ఆధారాలు కనిపించలేదు. అయితే మారథాన్ పరుగు దాగి ఉన్న గుండె వ్యాధులను బయటపెట్టే అవకాశం ఉంది. అందుకే వ్యాయామ సమయంలో లేదా తర్వాత ఛాతినొప్పి, శ్వాసకష్టం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకూడదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మొత్తంగా, సరైన శిక్షణతో సాధారణ మారథాన్ రన్నర్ల గుండె క్షీణించదు.. పరిస్థితులకు అనుగుణంగా బలపడుతుంది.





## ఔషధాలలో తేడాలు..

ఒక కొత్త మందు మన చేతికి చేరేలోపు అది ఎంతో దీర్ఘమైన ప్రయాణాన్ని పూర్తి చేస్తుంది. ప్రయోగశాలలలో మొదలైన ఆ ప్రయాణం, అనేక పరిశోధనలు, జంతు పరీక్షలు, మానవులపై జరిగే క్లినికల్ ట్రయల్స్ దాటి మార్కెట్ వరకూ వస్తుంది. ఈ మొత్తం ప్రక్రియకు ఫార్మాస్యూటికల్ కంపెనీలు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తాయి. అందుకే ఆ మందును మొదట కనుగొన్న కంపెనీకి ప్రభుత్వం సుమారు 20 సంవత్సరాల పాటు పేటెంట్ హక్కులు ఇస్తుంది. ఈ కాలంలో ఆ మందును తయారు చేసి అమ్మే హక్కు ఒక్క ఆ కంపెనీకే ఉంటుంది. ఇలాంటి మందులనే మనం 'బ్రాండెడ్ లేదా స్టాండర్డ్ డ్రగ్స్' అంటాం. పేటెంట్ ఉన్నంత కాలం అదే ఫార్ములా తెలిసినా, ఇతర కంపెనీలు ఆ మందును తయారు చేయలేవు. చేస్తే చట్టరీత్యా నేరం అవుతుంది. ఈ ప్రత్యేక హక్కు వల్ల బ్రాండెడ్ మందుల ధరలు చాలా ఎక్కువగా ఉంటాయి. అసలు తయారీ ఖర్చుతో పోలిస్తే వాటి అమ్మకపు ధరలు అనేక రెట్లు అధికంగా ఉండటం సాధారణమే. కంపెనీలు దీనికి కారణంగా తాము చేసిన పరిశోధనలు, ట్రయల్స్ ఖర్చు తిరిగి రాబట్టుకోవాలని చెబుతాయి. అయితే ఆ 20 సంవత్సరాల పేటెంట్ కాలం పూర్తయిన తర్వాత పరిస్థితి మారుతుంది. అదే రసాయనాలు, అదే ఫార్ములా ఉపయోగించి, అదే మందును ఇతర కంపెనీలు కూడా తయారు చేయవచ్చు. అలా తయారైన మందులనే 'జనరిక్ డ్రగ్స్' అంటారు. ఇవి కొత్తగా పరిశోధనలు లేదా క్లినికల్ ట్రయల్స్ చేయాల్సిన అవసరం లేకుండా తయారవుతాయి. అందువల్ల వీటి తయారీ ఖర్చు తక్కువ, దాని ఫలితంగా మార్కెట్ ధర కూడా తక్కువగా ఉంటుంది. సాధారణంగా జనరిక్ మందులు బ్రాండెడ్ మందులతో పోలిస్తే 30 నుంచి 80 శాతం వరకు తక్కువ ధరకు లభిస్తాయి.

చాలామందిలో ఒక అపోహ ఉంది. తక్కువ ధర అంటే నాణ్యత తక్కువ, లేదా అవి సరిగా పనిచేయవు అని. ఇది పూర్తిగా తప్పు. జనరిక్ మందులు కూడా అదే ప్రభుత్వ నాణ్యత ప్రమాణాల ప్రకారమే తయారవుతాయి. బ్రాండెడ్ మందులు ఎలా పనిచేస్తాయో, జనరిక్ మందులు కూడా ఖచ్చితంగా అలాగే పనిచేస్తాయి. మోతాదు, రసాయనిక సమ్మేళనం, ఔషధ ప్రభావం అన్నీ ఒకటే. తేడా కేవలం ప్యాకెట్ మీద ఉన్న పేరు, ధర మాత్రమే. అయితే ఇంత మంచిగా, తక్కువ ధరకు లభించే జనరిక్ మందులు ఎందుకు విస్తృతంగా ప్రాచుర్యం పొందడం లేదు? ఇక్కడే వ్యాపార ప్రయోజనాల కథ మొదలవుతుంది. బ్రాండెడ్ మందులు అమ్మే ఫార్మా కంపెనీలు మెడికల్ రిప్రజెంటేటివ్స్ ద్వారా డాక్టర్లను కలుస్తూ తమ బ్రాండ్లను ప్రోత్సహిస్తుంటాయి. డాక్టర్ ఎక్కువగా ఆ బ్రాండెడ్ మందులు రాస్తే, దానికి అనుగుణంగా బహుమతులు, ప్రయాణాలు, ఇతర లాభాలు అందుతాయి. ఈ ఖర్చులన్నీ చివరకు మందుల ధరలో కలుస్తాయి. అందుకే బ్రాండెడ్ మందులు అంత ఖరీదైనవిగా మారుతాయి. కొన్ని ఆస్పత్రుల్లో డాక్టర్లు జనరిక్ మందులనే సూచిస్తారు. కానీ అవి ఆస్పత్రి ప్రాంగణంలోని ఫార్మసీల్లో మాత్రమే లభిస్తాయి. వాటి మీద ముద్రించిన ధర చాలా ఎక్కువగా ఉంటుంది. కస్టమర్ అడిగితే కొద్దిగా తగ్గిస్తారు, కానీ అసలు కొనుగోలు ధరతో పోలిస్తే అది ఇంకా చాలా ఎక్కువే. వాస్తవానికి అదే మందు జన ఔషధి లేదా ఇతర జనరిక్ స్టోర్లలో చాలా తక్కువకు దొరుకుతుంది. ఉదాహరణకు, జ్వరం వచ్చినప్పుడు మనం తరచుగా వాడే డోలో 650 అనే బ్రాండెడ్ పారాసిటమాల్ ధర 15 టాబ్లెట్లకు సుమారు 29 రూపాయలు. అదే మందును మరో బ్రాండ్ పారాసిప్ 650గా 10 టాబ్లెట్లకు 18 రూపాయలకు అమ్ముతారు. కానీ జనరిక్ మెడికల్ స్టోర్‌లో అదే పారాసిటమాల్ 650 మి.గ్రా. 10 టాబ్లెట్లు సుమారు 4.50 రూపాయలకే దొరుకుతుంది. అలాగే వోవిరాన్ లాంటి బ్రాండెడ్ నొప్పి మందులు 50 రూపాయల పైగా ఉంటే, అదే డైక్లోఫెనాక్ జనరిక్ రూపంలో కొన్ని రూపాయలకే లభిస్తుంది. దగ్గు సిరప్, జ్వరం మాత్రలు... ప్రతి చోటా ఇదే తేడా కనిపిస్తుంది. జనరిక్ మందులకు, బ్రాండెడ్ మందులకు ధరలో తప్ప మిగతా విషయాల్లో చెప్పుకోదగిన తేడా లేదనే చెప్పాలి.

**ఈ శీర్షికన ఇచ్చిన సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. ఆరోగ్య సమస్యలకు వైద్యులను సంప్రదించడం తప్పనిసరి**

## రాజీలేని పోరాటాల చరిత్ర సిపిఐది

**సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు**



**ప్రజాపక్షం/చింతలపాలెం :** రాజీలేని పోరాటాల చరిత్ర సిపిఐది అని. దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని మొట్టమొదటిగా గర్జించిన ఏకైక పార్టీ సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వరు అన్నారు ఆదివారం సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండల కేంద్రంలో నిర్వహించిన మేళ్లచెరువు, చింతలపాలెం మండలాల సిపిఐ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు.భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం, నిరంకుశ నిజాంను గద్దె దించడానికి జరిగిన తెలంగాణ సాయుధ పోరాటంలో నాలుగువేల మంది ప్రాణ త్యాగాలతో, పదిలక్షల ఎకరాల భూమిని పేద ప్రజలకు పంచిన చరిత్ర సిపిఐదని తెలిపారు. ఈ వంద సంవత్సరాల కాలంలో ఎన్నో పోరాటాలు, ఎన్నో త్యాగాలు ఎంతోమంది అమరవీరుల రక్తతర్పణతో ఎన్నో విజయాలు సాధించి దేశ రాజకీయ చరిత్రలో సిపిఐ తనకంటూ ఒక ప్రత్యేక స్థానం సంపాదించుకుందన్నారు. ఇటువంటి చరిత్ర కలిగినటువంటి సిపిఐ జనవరి 18న ఖమ్మం నగరంలో భారీ ప్రదర్శన, జనసేవాదళ్ కవాతు, డిగ్రీ కళాశాల గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. ఈ బహిరంగ సభకు జిల్లానుంచి పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఉస్తెల నారాయణరెడ్డి, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు సృజన, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశ్వరి, కోటమ్మ, చింతలపాలెం, మేళ్లచెరువు మండలాల కార్యదర్శులు చింతిరాల రవి, గొంగరెడ్డి భద్రారెడ్డి, గ్రామ శాఖ కార్యదర్శి గంధం మంగయ్య, జియాలుద్దీన్, భీమిశెట్టి పద్మ, తోకల సైదులు, భీమిశెట్టి సత్యనారాయణ, గంధం కొండ, దొంగల అంకరాజు, చిలక యేసు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికచట్టాల రద్దు రాజ్యాంగ విరుద్ధం

**ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి విలాస్**

**ప్రజాపక్షం/బైంసా :** కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం కార్మికులు వందేళ్ల పోరాటంతో సాధించుకున్న చట్టాలను రద్దు చేస్తూ,వాటి స్థానంలో నాలుగు కోడ్‌లను తీసుకురావడం కార్మిక వ్యతిరేక చర్య అని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి, జిల్లా ఇన్‌ఛార్జ్ ఎస్.విలాస్ విమర్శించారు. ఆదివారం నిర్మల్ జిల్లా బైంసా పట్టణంలో టి.ప్రకాష్ అధ్యక్షతన ఎఐటియుసి పట్టణ మహాసభలు ఘనంగా జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథులుగా విలాస్‌తో పాటు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసచారి హాజరయ్యారు. ఈ సందర్భంగా విలాస్ మాట్లాడుతూ గ్రామీణ పేదల జీవనాధారమైన ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసేందుకు కేంద్రం కుట్ర చేస్తోందన్నారు. ఆటో కార్మికులకు నెలకు 12000 రూపాయల ఆర్థికభృతి ఇవ్వాలని, అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథక కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం 26,000 రూపాయలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ, సివిల్ సప్లయ్, మెడికల్ కాంట్రాక్ట్ కార్మికులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

**నూతన కమిటీ ఎన్నిక..** ఈ మహాసభలో ఎఐటియుసి బైంసా పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కాటి ప్రకాష్, పట్టణ అధ్యక్షుడిగా ఎస్.కె.లతీఫ్, పట్టణ కార్యదర్శి పరుశురాం. ముఖ్య సలహాదా ర్లుగా పెండారి ముత్యం, కోశాధికారి వై.మోహన్, ఉపాధ్యక్షులు ఎస్.విఠ్ఠల్, గడపలే సట్వాజి, విజయ్, తాడివార్ కరుణాకర్, కదం విఠ్ఠల్, ఎస్,కె.జావేద్, పి.సత్యనారాయణ, కమిటీ సభ్యులు సకల బన్సోడే, సందేశ్, బాబు, జె.రాములు తదితరులు పాల్గొన్నారు.

# పోరాటాలు, ఉద్యమాలతోనే జనాదరణ

**సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా**

**సిపిఐలో 167 కుటుంబాలు చేరిక**



**ప్రజాపక్షం/పాల్వంచ :** పేదల కష్టాలు, కన్నీళ్ళు, సమస్యలను గుర్తించేది ఎర్రజెండానే అని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా అన్నారు. భద్రాద్రి జిల్లా పాల్వంచ పట్టణ పరిధి శ్రీనివాస బంజార కాలనీకి చెందిన 167 కుటుంబాలకు చెందిన వారు ఆదివారం సాబీర్‌పాషా సమక్షంలో సిపిఐలో చేరారు. వారికి ఎర్రకండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం జరిగిన సభలో సాబీర్‌పాషా మాట్లాడుతూ పార్టీలోకి వచ్చిన ప్రతీ కార్యకర్తనూ కంటికి రెప్పలా కాపాడుకొంటామని భరోసా ఇచ్చారు. పోరాటాలు, ఉద్యమాల ఫలితంగానే సిపిఐకి జనాదరణ పొందుతుందన్నారు. పాల్వంచ బస్తీల అభివృద్ధి జరగాలంటే త్వరలో జరిగే కార్పొరేషన్ ఎన్నికలలో సిపిఐ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. పార్టీలో చేరినవారు సిపిఐ ప్రజా సంఘాలలో బాధ్యతలు తీసుకొని ప్రజా సమస్యల పరిష్కారం కోసం, పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలన్నారు. నిరంతరం ప్రజాక్షేత్రంలో ఉంటూ సేలందించే పార్టీలనే ప్రజలు ఆదరించాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సిపిఐ చేస్తున్న పోరాటాలను గుర్తించి వందలాది కుటుంబాలకు చెందిన వారు పార్టీలో చేరుతున్నారని తెలిపారు. వారి నమ్మకాన్ని నిలబెడుతూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. సమస్యల పరిష్కారమే ఏకైక ఎజెండా అని అందుకోసం ఎలాంటి త్యాగాలకైనా సిద్ధమని చెప్పారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పాల్వంచ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేయిస్తున్నారని, అభివృద్ధిని పరుగులు పెట్టించటానికి ప్రత్యేక గ్రాంట్ల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారన్నారు. కొందరి నాయకుల స్వార్థం కోసం గత 20 సంవత్సరాలుగా పాల్వంచ మున్సిపాలిటీకి ఎన్నికలు జరగలేదన్నారు. దీనితో పట్టణం అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పాల్వంచ, సుజాతనగర్, కొత్తగూడెంలను కలిపి కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఎన్నికలు తీసుకొచ్చిన ఘనత కూనంనేనిదేనన్నారు. త్వరలో జరిగే కార్పొరేషన్ ఎన్నికల్లో సిపిఐని గెలిపించి అభివృద్ధికి బాటలు వేసుకుందామన్నారు. ఈనెల 18న, ఖమ్మం పట్టణంలో జరిగే సిపిఐ నూరేండ్ల ఉత్సవాల ముగింపు భారీ బహిరంగ సభకు తండోపతండాలుగా తరలివచ్చి విజయవంతం చేయాలని సాబీర్‌పాషా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు ముత్యాల విశ్వనాథం, జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, వి.పద్మజ, డి.సుధాకర్, ఇట్టి వెంకటరావు, శనగారపు శ్రీనివాసరావు, వైఎస్.గిరి, ఎస్‌ఎ.రహెమాన్, బివి. సత్యనారాయణ, ఆదినారాయణ, నాగమణి, కరీం, ఆలకుంట శోభన్, సిలువేరు చంద్రకళ, ఆశు బత్తుల రాణి, కమ్మచెచ్చు రాంబాబు, ఎస్‌కె.. రహీమ్, మద్దినేని పద్మ, మేల శ్రీను, నారపోగు నాగరాజు, జెటపెట మహాలక్ష్మి పాల్గొన్నారు.

## అణగారినవర్గాల కోసం త్యాగాలు

**ప్రజల పక్షాన పోరాడేది ఎర్రజెండానే**

**సిపిఐ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి రాజ్ కుమార్**

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** అణగారిన వర్గాల కోసం ప్రాణాల అర్పించిన త్యాగాల చరిత్ర సిపిఐదని పార్టీ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ అన్నారు. 18న ఖమ్మం జిల్లాలో నిర్వహించే సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా భూపాలపల్లి జిల్లా కేంద్రంలో సిపిఐ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని 30 వార్డులో జీపు జాతా అన్నివార్డులలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కొరిమి రాజ్‌కుమార్ హాజరై మాట్లాడుతూ ఖమ్మంలో కనీ విని ఎరుగని రీతిలో సిపిఐ వందేళ్ల ముగింపు సభ సుమారు 5 లక్షల మందితో పెద్దఎత్తున నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రజాసమస్యలపై పేదల పక్షాన నిత్యం పోరాడేది ఎర్రజెండా పార్టీ అని అన్నారు. అధికారం లేకున్నా ప్రజల పక్షపాతిగా అసమానతలు లేని సమాజం కొరకు పోరాడుతుంది అన్నారు. రాబోయే కాలంలో ఎర్రజెండా పార్టీలు ఏకం కావాలన్నారు. ఎర్రజెండా పార్టీలు ఒక వేదిక మీదికి రావాలని జనవరి 18న సిపిఐ వందేళ్ల ముగింపు ఉత్సవాలను ఖమ్మంలో నిర్వహిస్తున్నామని ఎర్రజెండా పార్టీలు ఏకమై ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఖమ్మం సభకు జిల్లా నుండి పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా రాజ్ కుమార్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జి.సుధాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు సోతుకు ప్రవీణ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు మోటపలుకుల రమేష్, క్యాథరాజ్ సతీష్, జి.శ్రీనివాస్, నూకల చెంద్రమౌళి, కుదుదల వెంకటేష్, వేముల శ్రీకాంత్ పాల్గొన్నారు.





## విపత్తుల సమయంలో 'జనసేవా దళ్' కృషి

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బోస్**

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** విపత్తులు, ఆపదల సమయంలో జనసేవా దళ్ కార్యకర్తల కృషి వెలకట్టలేనిదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.ఎస్.బోస్ అన్నారు. భారత కమ్యునిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా జనసేవా దళ్ శిక్షణా శిబిరాన్ని మేడ్చల్ జిల్లా నిజాంపేట మండలం షాపూర్ నగర్ హెచ్‌ఎంటి గ్రౌండ్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు విఎస్ బోస్, జాతీయ సమితి సభ్యులు ఎండి యూసుఫ్‌లు హాజరై మాట్లాడుతూ ప్రకృతి విపత్తుల సమయంలో అశాంతి చెలరేగిన సమయంలో జనసేవా దళ్ కార్యకర్తలు నిస్వార్థంగా అనేక సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తారని, రానున్న రోజుల్లో వారి బాధ్యత మరింత పెరుగుతుందన్నారు. ఖమ్మంలో నిర్వహించే భారీ బహిరంగ సభ సందర్భంగా పదిహేను వేల మంది కార్యకర్తలతో జనసేవా దళ్ కవాతును నిర్వహిస్తున్నామని, అందులో ఇక్కడి కార్యకర్తలు సైతం సన్నద్ధమై కవాతును విజయవంతం చేయాలని కోరారు. ఈ బహిరంగ సభకు 42 దేశాల నుండి విదేశీ ప్రతినిధులు వస్తున్నారని, ఐదు లక్షల మంది కార్యకర్తలు వస్తున్నారని, దేశంలో, రాష్ట్రంలో ఉన్న ప్రజలకు కమ్యునిస్టు పార్టీ బలం కలిసి వచ్చి రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి మద్దతు తెలుపుతారన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేశ్ మాట్లాడుతూ కమ్యూనిజం బలహీన పడిందనే వారికి ఖమ్మంలో జరిగే బహిరంగ సభ ద్వారా కమ్యునిస్టుల బలం తెలుస్తుందన్నారు. డబ్బు, మద్యం పంపిణీ చేయకుండా స్వచ్ఛందంగా లక్షలాది కార్యకర్తలు ఖమ్మంకు తరలివచ్చి ఎర్రవనాన్ని తలపిస్తారని, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి మేడ్చల్ జిల్లా నుంచి వేలాది మంది కార్యకర్తలు, జనసేవా దళ్ కార్యకర్తలు తరలిరావాలని కోరారు. కార్యక్రమానికి సిపిఐ మండల కార్యదర్శి స్వామి అధ్యక్షత వహించగా ఇన్‌స్ట్రక్టర్‌గా అనిల్‌కుమార్ వ్యవహరించారు. కార్యక్రమంలో ఏసురత్నం, శంకర్, హరినాథ్‌రావు, సత్యప్రసాద్, యాదగిరి, బాబు, నరసింహారెడ్డి, సల్మాన్, ప్రవీన్, బాబు, సహదేవరెడ్డి, వెంకటేశ్, స్వరూప, రాములు, కృష్ణ, రాములు, మహేందర్, శ్రీనివాస్, బకర మల్లేష్, భీమేష్, రవి, సామేల్, యాదిగిరి, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.



## దేశ రాజకీయ చరిత్రలో సిపిఐది ప్రత్యేక స్థానం : ఎమ్మెల్సీ సత్యం

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** శతాబ్ద కాలంలో ఎన్నో పోరాటాలు ఎన్నెన్నో త్యాగాలు ఎంతోమంది రక్త తర్పణతో ఎన్నో విజయాలు సాధించి దేశ రాజకీయ చరిత్రలో సిపిఐ తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని ఎమ్మెల్సీ పేర్కొన్నారు. వంద సంవత్సరాల ముగింపు సందర్భంగా 18న ఖమ్మం నగరంలో నిర్వహించే 'భారీ బహిరంగ సభకు అన్నివర్గాల ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పిలుపునిచ్చారు. ఆదివారం సిపిఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాటి నుంచి నేటివరకే ప్రజా సమస్యల పరిష్కారానికి కమ్యూనిస్టులు ముందు వరుసలలో ఉంటారన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య, పల్లె శేఖర్‌రెడ్డి, సిపిఐ జిల్లా సమితి సభ్యులు దుబ్బాక భాస్కర్, పార్టీ మున్సిపల్ కార్యదర్శి పగిళ్ల మోహన్‌రెడ్డి, ఉడుత రామలింగం, పిల్లి శంకర్, టంగుటూరు రాములు, బద్దుల సుధాకర్, దాసరి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్‌లో బిఆర్ఎస్ నాయకులు చేరిక



ప్రజాపక్షం/నేరడిగొండ : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న కాంగ్రెస్ పాలనలో ప్రజలకు అందుతున్న ఫలాలను మరింత పేదలకు చేరుపచేయడానికి బోథ్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆడే గజేందర్,ఆధ్వర్యంలో మంగళవారం ధరంపూరి బిఆర్ఎస్ నాయకులు నాగనాథ్,దశరథ్,నారాయణ, తాతే రావు,గోవర్ధన్,రాందాస్,ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారిని సాదరంగా ఆహ్వానించి కాంగ్రెస్ కండువాలు కప్పి కాంగ్రెస్ ప్రభుత్వము చేస్తున్న అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని అన్నారు. ధరంపూరి గ్రామస్తులు మండల నాయకులు పాల్గొన్నారు.

## అధికారికంగా వద్దె ఒబన్న జయంతి హర్షణీయం



ప్రజాపక్షం/నిజామాబాద్ : స్వాతంత్ర్య పోరాటంలో వద్దె ఓబన్న ప్రదర్శి ంచిన ధైర్యసాహసాలు అనన్య సామాన్యమైనవని వక్తలు కీర్తించారు. ఆమ హానీయుని జయంతిని అధికారికంగా నిర్వహించుకోవటం సంతోషంగా ఉందన్నారు. వద్దె ఓబన్న జయంతిని పురస్కరించుకుని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో ఆదివారం వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అధికారికంగా జయంతి నిర్వహించారు. వద్దె ఓబన్న చిత్రపటానికి కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, ఆయా సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పిం చి మాట్లాడారు. బ్రిటిష్ పాలకులను గడగడలాడించిన స్వాతంత్ర్య సమరయోధుడు వద్దె ఓబన్న అని కొనియాడారు.వద్దె ఓబన్న ఆశయాల సాధన కోసం కృషి చేయడమే ఆయనకు నిజమైన నివాళి అన్నారు.ఆయా సంఘాల ప్రతినిధులు దండి వెంకట్, వెంకటేష్, రాము, శంకర్, సుధాకర్, సాయిలు, రాజేశ్వర్ పాల్గొన్నారు.

## పిసిసి అధ్యక్షుడిని కలిసిన సర్పంచ్



ప్రజాపక్షం / నందిపేట్ : నందిపేట్ మండలంలోని అయిలాపూర్ గ్రామ సర్పంచ్ మీసాల లక్ష్మి నారాయణ, వార్డు సభ్యులు ఆదివారం కాంగ్రెస్ పార్టీ పిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్‌ను కలిసి సన్మానించారు.ఈ సందర్భంగా గ్రామ సమస్యలు ఆయన దృష్టికి తెచ్చారు.పరిష్కారానికి తగిన నిధులు ఇవ్వాలని వారు కోరారు.వారి వెంట సహకార సంఘ అధ్యక్షులు మీసాల సుదర్శన్, నవీన్, సాయికుమార్, గంగాధర్, దశగౌడ్‌కలిశారు.

## అట్టహాసంగా మీడియా క్రికెట్ టోర్నీ



ప్రజాపక్షం/ముధోల్ : నియోజకవర్గ కేంద్రమైన ముధోల్ లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ప్రింట్‌ఎలక్ట్రానిక్ మీడియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు అట్టహాసంగా కొనసాగుతోంది.ముధోల్ నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ మండలాలకు చెందిన క్రికెట్ జట్లు పోటీల్లో పాల్గొంటున్నాయి.ఆదివారం మాజీ ఉప సర్పంచ్ సుభాష్ టాస్ ఎగురవేసి క్రీడాకారులను పరిచయం చేసుకుని టాస్ ఎగరవేసి మ్యాచ్‌ను ప్రారంభించారు.అదే విధంగా పక్క రాష్ట్రమైన మహారాష్ట్రలోని పలు పట్టణాలకు చెందిన క్రికెట్ జట్లు సైతం పాల్గొంటూ గట్టి పోటీనిస్తున్నాయి.ప్రతిరోజు నాలుగు మ్యాచ్లు నిర్వహిసుతండడంతో చూడడానికి పెద్ద సంఖ్యలో సానికులు వచ్చారు.నిర్వాహకులు ఆశించిన స్థాయి కంటే అధిక సంఖ్యలో క్రికెట్ జట్లు టోర్నీలో భాగస్వాములు అయ్యాయి.నిర్వాహకులు క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను చేశారు.

## ఏడుపాయల్లో భక్తుల సందడి



ప్రజాపక్షం/పాపన్నపేట: పవిత్ర పుణ్యక్షేత్రమైన ఏడుపాయల ఆదివారం భక్తులతో కిక్కిరిసింది , సుదూర ప్రాంతాల నుంచి భక్తులు ఏడుపాయలకు చేరుకొని దుర్గామాతను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. నూ తన సంవత్సరం ప్రారంభంలో రెండవఆదివారం కావడం కుతోడు, వారం రోజులపాటు సంక్రాంతి సెలవులు రావడంతో పెద్ద ఎత్తున భ క్తులు ఏడుపాయలకు చేరుకున్నారు. ఇందులో భాగంగా వేద పండితులు శంకర శర్మ, పార్థివ్ శర్మ, రాము, నాగరాజు, రాజశేఖర్ శర్మ ప్రత్యే క పూజ లు నిర్వహించగా, భక్తులకు ఇబ్బందులు రాకుండా ఏడుపాయల ఈవో చంద్రశేఖర్ ఆలయ సిబ్బంది, సూర్య శ్రీనివాస్, ప్రతాప్ రెడ్డి, బ్రహ్మచారి, నర్సింలు, రాజు, చారి, నరేష్, ఏర్పాట్లు చేయగా ఎలాంటి సంఘటనలు జరగకుండా ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తగిన బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

## దేశ సంస్కృతిని కాపాడుకుందాం



ప్రజాఫక్షం/సదాశివపేట : భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో సదాశివపేట సిపిఐ పట్టణ కార్యాలయం వద్ద ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం ముఖ్య అతిథులుగా హాజరైన పురం రమాదేవి, కటకం స్వప్న చేతుల మీదుగా బహుమతులు పంపిణీ చేశారు. దేశంలో నేడు యువత మన భారతదేశ సంస్కృతిని మర్చిపోయి ప్రపంచీకరణలో భాగంగా పాశ్చాత్య సంస్కృతికి అలవాటు పడి తల్లిదండ్రుల మాటలు వినకుండా చెడు వ్యసనాలకు అలవాటు పడి తెలిసి తెలియని వయస్సులో నేరాలు చేస్తూ వారి జీవనాలను నరకం చేసుకుంటూన్నారు అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో అనేక సంవత్సరాల నుండి సంస్కృతి ,యువతను కాపాడేందుకు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి తన వంతు కృషి చేస్తుందన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండిషఫీ అహ్మద్, సత్యమ్మ, అనుసూజ, గంగమ్మ, సాదకాలి, యాకూబ్ ,పూలమ్మ , మంజుల ,రజిని ,లక్ష్మి , బిపాషా,, రాజమ్మ, పాల్గొన్నారు.

# క్రీడలతో పెరగనున్న మేధస్సు

యువత మత్తు పానీయాలకు దూరంగా ఉండాలి
క్రీడల వైపు మొగ్గు చూపాలి
ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ప్రజాపక్షం/నిజామాబాద్ : క్రీడలతో మేధస్సు పెరుగుతుందని, యువత మత్తు పానీయాలకు దూరంగా ఉండాలని, క్రీడల వైపు మొగ్గు చూపాలని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. డిచ్‌పల్లి మండలంలోని సిఎంసి మెడికల్ కళాశాల గ్రౌండ్‌లో ఆర్‌పి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని, ఆటలు శారీరక దృఢత్వానికి, మానసిక ప్రశాంతతకు, విజయం సాధించేందుకు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. క్రికెట్ ఆటల్లో గెలుపోటములు సహజమని, ఓడిన వారు లోపాలు తెలుసుకుని మరింత కృషితో ముందుకు సాగాలని సూచించారు. గెలిచిన వారు కూడా మరిన్ని విజయాలు సాధించేలా మెలకువలు అలవర్చుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈగిల్ టీమ్ ఏర్పాటు చేసిందని, యువత క్రీడల వై పు ఆసక్తి పెంచితే జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పేరుప్రఖ్యాతులు తెచ్చుకోవచ్చని చెప్పారు.

### 'రూరల్'లో 10 ఎకరాల స్టేడియం మంజూరు

రూరల్ నియోజకవర్గంలో 10 ఎకరాల స్థలంలో క్రీడా స్టేడియం మంజూరైందని రానున్న రోజుల్లో రూరల్ యువత రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొనేలా అవకాశాలు పెరుగుతాయన్నారు.

### హాస్పిటల్ మేనేజ్‌మెంట్‌కు అభినందనలు

క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించిన ఆర్‌పి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజ్‌మెంట్‌ను ఎమ్మెల్యే అభినందిస్తూ యువతను మత్తు పదార్థాల నుండి దూరంగా ఉంచి క్రీడల వైపు మళ్లించ డం గొప్ప సేవ అని కొనియాడారు. గెలిచిన జట్టుకు శుభాకాంక్షలు తెలియజేసి ఓడిన వారికి కూడా ప్రోత్సాహం తెలిపారు.ఆర్‌పి మెట్రో డాక్టర్ రాజేంద్రప్రసాద్, గంగదాస్, పిసిసి డెలిగేట్ శేఖర్‌గౌడ్, పిసిసి కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, శాంసన్, రాంచందర్‌గౌడ్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు వాసుబాబు, క్రీడాకారులు పాల్గొన్నారు.







# నగర సమగ్రాభివృద్ధికి నిరంతర కృషి

ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ,
ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్
నగరంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



ప్రజాపక్షం/నిజామాబాద్ : సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తమ ప్రభుత్వం, ప్రజల సౌకర్యార్థం అభివృద్ధి పనులు నిరంతర ప్రక్రియగా చేపడుతోందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. నగరంలోని వివిధ డివిజన్లలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, అదనపు కలెక్టర్ అంకిత్ తదితరులతో కలిసి అభివృద్ధి పనులకు ఆదివారం శంకుస్థాపనలు చేశారు. అంతకుముందు రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్‌లను కలెక్టర్ త్రిపాఠి కలిసి పూలమొక్కలు అందించి స్వాగతం పలికారు. నూతనంగా జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్‌కు వారు అభినందనలు తెలిపి జిల్లా ప్రగతిపై కొద్దిసేపు చర్చించారు. నగరంలోని ఆయా డివిజన్లలో రూ. 60 కోట్ల టియుఎఫ్ఐడీసీ నిధులతో చేపడుతున్న అంతర్గత రోడ్లు, సిసి డ్రెయిన్లు, కల్వర్టుల నిర్మాణ పనులకు వినాయకనగర్ వద్ద శంకుస్థాపన చేశారు. అదేవిధంగా సుమారు రూ. 6 కోట్లను వెచ్చిస్తూ ఆధునాతన సాంకేతికతతో నిర్మిస్తున్న ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పనులకు భూమిపూజ చేసి మాట్లాడారు. ప్రజలకు మరింత మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి తేవాలనే లక్ష్యంతో కోట్లాది రూపాయల నిధులను వెచ్చిస్తూ రోడ్లు, డ్రైనేజీలు, మంచినీటి సరఫరా విస్తరణ వంటి అభివృద్ధి పనులను చేయిస్తున్నామన్నారు. నగరాన్ని ఒక మోడల్ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకెళుతున్నామన్నారు.మరిన్ని నిధులు తె చ్చి నగర సమగ్రాభివృద్ధికి నంతరం కృషిని కొనసాగిస్తామన్నారు.నుడా చైర్మన్ కేశ వేణు, మాజీ ఎమ్మె ల్సీ అరికెల నర్సారెడ్డి, కమీషనర్ దిలీప్‌కుమార్, నగేష్‌రెడ్డి, రామకృష్ణ, శ్రీశైలం పాల్గొన్నారు.

## పేదలకు పెద్ద డాక్టర్‌లా ఎమ్మెల్యే సేవలు

మెగా వైద్య శిబిరం ప్రారంభించిన బొజ్జు పటేల్



ప్రజాపక్షం/ఖానాపూర్ : మనిషి జీవితంలో ఆరోగ్యం ప్రథమమైనదని ఆరోగ్యాన్ని కాపాడటానికి వైద్యుల సేవ ఎంతో ఉత్తమైనది,ప్రధాన్యమైనదని ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ అన్నారు.ఆదివారం ఖానాపూర్ మండల పాత ఎల్లాపూర్ సర్పంచ్ ఏలేటి ప్రశాంత్ రెడ్డి ఆధ్వర్యంలో వరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్ ఏర్పాటు చేసిన ఉచిత మోగా వైద్య శిబిరానికి ముఖ్య అతిథిగా పాల్గొని మోగా క్యాంప్ ని ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉచిత మెగా వైద్య శిబిరాన్ని పాల్లాపూర్ గ్రామ ప్రజలు ఉచిత వైద్య సేవలు వినియోగించుకోవాలని ఇలాంటి సేవలు ఆగకుండా నిరంతరంగా గ్రామాల్లో సాగిస్తూ గిరిజన ఆదివాసి గ్రామాల్లో కూడా క్యాంపులు నిర్వహించి ప్రజా ఆరోగ్యాన్ని కాపాడాలని కోరారు.ఈ మెగా క్యాంప్‌లో 13 రకాల వ్యాధులకు సంబంధించిన డాక్టర్లు రావడం సంతోషదయాకమని ఇందులో ముఖ్యంగా కార్డియాలజీ,న్యూరో,దంతవైద్య స్త్రీ ప్రత్యేక గైనకాలజిస్ట్ తో పాటు జనరల్ సర్జన్ డాక్టర్స్ లు ఉన్నారు.ఉచిత వైద్య పరీక్షల్లో గుండె,చెవిముక్కు,గొంతు పరీక్షలు నిర్వహించారు జనరల్ జ్వరము తదితర తాత్కాలిక వ్యాధులను గుర్తించి మందులు ఉచితంగా అందజేశారు.

## ప్రముఖ పద్యకవి డా.వెంకట్‌కు ఘన సన్మానం

ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ : హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్తు హాల్లో 'దర్శనమ్' ఆధ్యాత్మిక సాంస్కృతిక మాసపత్రిక ఆధ్వర్యంలో నిర్వహించిన'వజ్రోత్సవ భారతిఅవధాన సంక్రాంతి' బ్రహ్మశ్రీ ఉప్పలధడియం భరతశర్మ నిర్వహించిన శతావధానంలో పృచ్ఛకునిగా పాల్గొన్న డాక్టర్ వెంకట్‌ను ముఖ్య అతిథులైన త్రి భాషా సహస్రావధాని వద్దిపర్తి పద్మాకర్,శతావధానులు రామశర్మ,ఆయుదాల మురళి,దర్శనమ్ పత్రిక సంపాదకులు మరుమాముల దత్తాత్రేయ శర్మ,వెంకటరమణ శర్మ, ఆచార్య రఘునాథశర్మ,ప్రభుత్వ పూర్వ సలహాదారులు రమణాచారి ఘనంగా సన్మానించారు.ఏకైక పృచ్ఛకునిగా హాజరైన డాక్టర్ బి.వెంకట్,అవధానిని దత్తపది ప్రక్రియలో భాగంగా స్వామి వివేకానంద విశ్వ యువతకు ఇచ్చిన సందేశాలను పద్య రూపంలో వర్ణించమని కో రారు.ఆధునిక సామాజిక అంశాలపై 25 సమస్యాపూరణలు,25 దత్తపదులు,25 వర్ణనలు,25 ఆశువుల ప్రక్రియలపై ప్రశ్నలు సంధించారు.తిరుపతికి చెందిన అవధాన తిలక భరతశర్మ పృచ్ఛకులు అడిగిన వంద ప్రశ్నలకు సమాధానంగా,కేవలం 40 నిమిషాల్లో 100 పద్యాలను అలవోకగా,రాగయుక్తంగా ధారణ చేసి ప్రతిభను చాటుకున్నారని డాక్టర్ వెంకట్ ప్రశంసించారు.

# చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు


నిర్మల్ ఎస్‌పి
డా.జి.జానకి షర్మిల హెచ్చరిక



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : జిల్లా వ్యాప్తంగా చైనా మాంజా(నైలాన్/సింథటిక్ నూలు) విక్రయాలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు.జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ ఆదేశాల మేరకు,ఈ రోజు జిల్లాలోని అన్ని ప్రధాన పట్టణాలు,మండల కేంద్రాల్లోని దుకాణాలు,స్టేషనరీ షాపులపై పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.నిబంధనలకు విరుద్ధంగా నిషేధిత మాంజా విక్రయించే వారిపై రాజీలేని చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టం చేశారు.ప్రాణాలకు ముపునిఘా తీవ్రం చైనా మాంజా వినియోగం పక్షులకే కాకుండా, ప్రజల ప్రాణాలకు కూడా తీవ్ర ప్రమాదకరమని ఎస్పీ పేర్కొన్నారు.ముఖ్యంగా ద్విచక్ర వాహనదారుల మెడకు ఈ దారం చుట్టుకొని గతంలో అనేక ప్రాణాంతక ప్రమాదాలు జరిగిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు.ఈ నేపథ్యంలో ప్రభుత్వం చైనా మాంజా విక్రయం,నిల్వ,వినియోగాన్ని పూర్తిగా నిషేధించిందని,ఈ నిషేదాన్ని ఉల్లంఘించే వారిపై కఠినమైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.తల్లిదండ్రులకు విజ్ఞప్తి జిల్లాలోని అన్ని విక్రయ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని,ఎక్కడైనా రహస్యంగా చైనా మాంజా విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్ కు లేదా డయల్ 100/112 కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.సంక్రాంతి పండుగ వేళ పిల్లలు ప్రమాదకరమైన చైనా మాంజా వైపు వెళ్లకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండి,వారికి అవగాహన కల్పించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# ఘనంగా ఒడ్డె ఓబన్న 219వ జయంతి

యువతలో దేశభక్తి, త్యాగం,సేవాభావనలు, పెంపొందించడమే లక్ష్యం : అదనపు కలెక్టర్ పాండు



ప్రజాఫక్షం/ సంగారెడ్డి : దేశభక్తి ,త్యాగం ,సేవాభావం వంటి విలువలను యువతలో పెంపొందించడమే మహనీయుల జయంతి కార్యక్రమాల ప్రధాన లక్ష్యమని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పాండు అన్నారు. దేశ స్వాతంత్రం కోసం తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాటం చేసిన స్వా తంత్ర సమరయోధుడు ఒడ్డె ఓబన్న 219వ జయంతిని పురస్కరించుకొని సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆదివారం ఘనంగా వేడుకలు నిర్వహించారు.స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పాండు ముఖ్య అతిథిగా హాజరై ఒడ్డె ఓబన్న చిత్ర పటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించి ఆయన సేవలను స్మరించుకున్నారు.బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా వడ్డె ఒబన్న చేసిన పోరాటం భారత స్వాతంత్ర ఉద్యమ చరిత్రలో మరువలేనిదని పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర ఉద్యమంలో ఆయన చూపిన ధైర్యసాహసాలు ,త్యాగాలు నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. ప్రజల్లో జాతీయ చైతాన్యాన్ని రగలించిన మహనీయుడిగా వడ్డె ఒబన్నను గుర్తు చేసుకున్నారు. ఆయన జీవితం నుంచి అందరూ స్ఫూర్తి పోందాల్సిన అవసరం ఉందన్నారు. బలహీన వర్గాల హక్కుల కోసం ఆయన చేసిన కృషి గురించి యువతకు అవగాహన కల్పించాలని అన్నారు. జీవితం చేసిన త్యాగాలు స్ఫూర్తిదాయకంగా నిలవాలని ఆకాంక్షించారు. జగదీష్, బిసి సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రభు గౌడ్, జిల్లా అధ్యక్షులు మల్లిఖార్జున్ పాటిల్ బిసి యూత్ అధ్యక్షులు రమేష్ కుమార్, కుమ్మరి సంఘం అధ్యక్షులు కుమ్మరి సాయిలు, బిసి సంఘం ప్రదాన కార్యదర్శి రాజేశ్వర్ సా ్వమి,కల్లుగీత కార్మిక సంఘం ప్రదాన కార్యదర్శి రమేష్‌గౌడ్, వసతి గృహ సంక్షేమాదికారులు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ చొరవ
# రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు



ప్రజాపక్షం/ముధోల్ : ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ సహకారంతో బోరేగాం నుండి అష్ట గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై తాత్కాలిక మరమ్మత్తు పనులు ప్రారంభమయ్యాయి.గత కొంతకాలంగా అధ్వానంగా ఉన్న ఈ రోడ్డుపై ప్రయాణించడానికి ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించిన ఎమ్మెల్యే ఎస్.డి.ఆర్.ఎఫ్ నిధుల కింద ప్రత్యేక నిధులను కేటాయించారు.ఈ నిధులతో మరమ్మతులు చేపట్టడంపై బోరేగాం,వడ్తల,అష్ట గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.బోరేగాం సర్పంచ్ కల్లెడ కిష్టయ్య,వడ్తల సర్పంచ్ రమేష్ పాల్గొన్నారు.బీజేపీ సీనియర్ నాయకులు పట్టేపూర్ మోహన్‌రెడ్డి,విశ్రాంత ఉపాధ్యాయులు నారాయణ రెడ్డి, ఆకుల కిషన్, అష్ట గ్రామ వీడీసీ అధ్యక్షుడు ముత్యం,వార్డు మెంబర్లు సాయి కిరణ్, సలీం,సంతోష్ పాల్గొన్నారు.వీరితో పాటు నిగ్గ నర్సారెడ్డి,భూషన్ రెడ్డి,దేగాం ముత్యం రెడ్డి,మధుకర్ రెడ్డి, శ్రావణ్,విజయ్,మనోహర్,నవీన్,పెంటన్న,రాజేశ్వర్,గామాల బీజేపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు

విజేతలకు బహుమతుల అందజేత



ప్రజాపక్షం/గజ్వేల్: శేరిపల్లి గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ యర్ర పావని మోహన్ రెడ్డి, జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్మన్, జాతీయ యువజన అవార్డు గ్రహీత డాక్టర్ దేశబోయిని నర్సింహులు మాట్లాడుతూ, సంక్రాంతి ప్రకృతి పండుగ కాగా, మహిళలు రంగురంగుల రంగవల్లులతో సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబింపచేసినట్లు స్పష్టం చేశారు. ఇ లాంటి పోటీలు గ్రామీణ సాంప్రదాయాలను మరింతగా వెలుగులోకి తెస్తాయని పేర్కొన్నారు. అనంతరం ప్రతిభ చాటిన మహిళలకు కార్యక్రమ నిర్వాహకులు బహుమతులు అందజేయగా, ఉప సర్పంచ్ బీరయ్య పాల్గొన్నారు.

# సంస్కృతి, సంప్రదాయాలకు ముగ్గుల పోటీలు

మార్కెట్ కమిటీ
మాజీ చైర్మన్ అన్నపూర్ణ శ్రీనివాస్

ప్రజాపక్షం/గజ్వేల్: సంస్కృతి, సాంప్రదాయాలకు సంక్రాంతి ముగ్గుల పోటీలు అద్దం పడుతున్నట్లు గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు అన్నపూర్ణ శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఆదివారం మండల పరిధిలోని అహ్మదీపూర్‌లో గ్రామ పంచాయతీ పాలక వర్గం, సంతూర్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలకు ముఖ్య అతిథిగా హాజరై డాక్టర్ శైలజ, డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ భవానిలతో కలిసి మాట్లాడారు. ముగ్గుల పోటీలతో మహిళల్లో దాగి ఉన్న నైపుణ్యం బయటకు రాగా, అన్ని రంగాల్లో ముందుండాలన్నదే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. కాగా 200 మందికి పైగా మహిళలు పాల్గొని అందమైన రంగవల్లులతో ఆహుతులను మంత్రముగ్ధులను చేయగా, తమ కళా ప్రతిభను ప్రదర్శించినట్లు అతిథులు తెలిపారు. ముఖ్యంగా ముగ్గుల పోటీలలో సంక్రాంతి పండగ కుట్టొచ్చినట్లు కనపడగా, భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని వివరించారు. అనంతరం ప్రతిభను ప్రోత్సహించే క్రమంలో ముగ్గుల పోటీల్లో ప్రతిభ చాటిన మహిళల తో పాటు గ్రామానికి చెందిన మహిళా టీచర్లు, ప్రభుత్వ ఉద్యోగులు, వైద్య విద్యార్థులు, సాఫ్ట్వేర్ ఉద్యోగులు, వివిధ రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ, ప్యాకేజి సాధించిన మహిళలను వారు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, సర్పంచ్ బ్యాగరి ప్రభాకర్, ఉప సర్పంచ్ గోపాల్ రెడ్డి, కనకరాజు, శ్రవంతి, రాజు, భాగ్యలక్ష్మి, కుమార్, రజిత, మంజుల, స్వప్న, సంతోష్, రాంచంద్రం, రాములు, నాగరాజు, పవనసుత ఏజెన్సీ నిర్వాహాకులు పుష్పలత తదితరులు పాల్గొన్నారు.



## రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

జిల్లా వ్యవసాయ అధికారిణి స్వరూపరాణి



**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:**రైతులందరూ తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారిణి స్వరూప రాణి అన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ఫార్మర్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలని,ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోని యెడల పిఎం కిసాన్ వంటి కేంద్ర ప్రభుత్వ పథకాలకు అనర్హులయ్యే అవకాశం ఏర్పడుతుందని,అందువలన తక్షణమే వ్యవసాయ విస్తరణ అధికారి వద్ద కానీ లేదా మీ సేవా కేంద్రాలలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి శ్రీనాథ్,వ్యవసాయ విస్తరణ అధికారి,గ్రామ పెద్దలు,రైతులు పాల్గొన్నారు.

## అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు 'సుడా' చైర్మన్ శంకుస్థాపన



**ప్రజాపక్షం/కరీంనగర్:**26వ డివిజన్ ఆదర్శనగర్ లో 20 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, ఇరుకు రోడ్లు ఉన్న చోట్ల అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపడుతున్నామని దీని వల్ల రోడ్లు ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటాయని అన్నారు. చాలా ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతిని ఉందని ఒక్కొక్కటిగా అన్ని రోడ్లు డ్రైనేజీలను మెరుగు పరుచుకుంటూ ముందుకు వెళ్తున్నామని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు అంజన్ కుమార్, మాజీ కార్పొరేటర్ ఆర్ల మల్లేశం, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, దండి రవీందర్, గీసా శ్రీనివాస్, మన్నె పద్మారావు, కొండలి లక్ష్మినారాయణ, మన్నె పద్మావతి, గీసా కాంతమ్మ, దినేష్, సిగిరి రవి, కుంభం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**నేషనల్ ఖోఖో ఛాంపియన్‌షిప్ పోటీ ప్రారంభోత్సవంలో పాల్గొన్న సుడా చైర్మన్**

కాచిగూడ రైల్వే స్టేడియంలో 5 రోజుల పాటు జరుగనున్న 58వ నేషనల్ సీనియర్ ఖోఖో ఛాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీల ప్రారంభోత్సవానికి మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, వాకిటి శ్రీహరితో పాటు కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ ఛాంపియన్‌షిప్‌లో దేశంలోని అన్ని రాష్ట్రాల జట్లు పాల్గొన్నాయి. ఈ నెల 15న ఫైనల్ మ్యాచ్‌తో ముగియనున్న ఈ చాంపియన్‌షిప్‌కు రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి ఆధ్వర్యంలో నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

## షాహిన్ అకాడమీ ద్వారా స్కాలర్‌షిప్ టెస్ట్ 2025



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్:** ఆదివారం రోజున షాహిన్ అకాడమీ కరీంనగర్ వారి సౌజన్యంతో పెద్దపెల్లి జిల్లా కేంద్రంలోని ఎన్ఎస్ భవన్ లో స్కాలర్ స్కాలర్‌షిప్ 2025 నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు ఇతర ప్రాంతాల్లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు ఈ టెస్ట్‌లో అత్యంత ప్రతిభ కనపరిచిన విద్యార్థిని,విద్యార్థులకు తమ పాఠశాలలో స్కాలర్‌షిప్ ద్వారా 100% ఉచిత విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్షల్లో పెద్దపల్లి పట్టణం, కమాన్ పూర్ తదితర ప్రాంతాల నుండి దాదాపు 100 మంది విద్యార్థులు పాల్గొని ఫేజ్ టు పరీక్షల ద్వారా తమ ప్రతిభను కనబరిచారని తెలిపారు. ఈ సందర్భంగా షాహిన్ అకాడమీ లో ఎంపిసి 470కు గాను 468 మార్కులు, బైపిసి లో 440 గాను 437 మార్కులుసాధించి ఎమ్‌బిబిఎస్‌లో ఎదురుకు విద్యార్థులు సీట్లు సాధించారని,షాహిన్ అకాడమీ లోని అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం, ఫలితాలపై దృష్టి పెట్టిన బోధనా విధానం మరియు క్రమశిక్షణతో కూడిన విద్యా వాతావరణానికి నిదర్శనంగా నిలుస్తున్నాయని, ఈ పరీక్ష విజయవంతంగా నిర్వహించడానికి సహకరించిన శ్రేయోభిలాషులు, వాలంటీర్లు మరియు స్థానిక మద్దతుదారులందరికీ షాహిన్ అకాడమీ యాజమాన్యం హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు.

## ఆర్యవైశ్య కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి మంత్రి శ్రీధర్ బాబు సానుకూలం



**ప్రజాపక్షం/ముత్తారం :**పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలోని ఆర్యవైశ్యుల చిరకాల కోరికైన వాసవి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి మార్గం సుగమమైంది. నేడు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుని వాసవి ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు.మండల కేంద్రంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అవసరమైన నిధులను మంజూరు చేయాలని కోరుతూ మంత్రికి వినతి పత్రం అందజేశారు. సంఘం విన్నపంపై సానుకూలంగా స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు వెంటనే నిధుల మంజూరు ప్రక్రియను చేపట్టాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ (సిఫార్సు) చేశారు.ఈ సందర్భంగా ముత్తారం ఆర్య వైశ్య సంఘం నాయకులు మాట్లాడుతూ ఆర్యవైశ్యుల విన్నపాన్ని మన్నించి తక్షణమే స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు కి టిపిసిసి ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణం వల్ల మండలంలోని ఆర్యవైశ్య కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుందని వారు ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం గౌరవ అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, అధ్యక్షుడు గద్దం శ్రీధర్, ఉపాధ్యక్షుడు లింగ ఉమా శంకర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు గౌరిశెట్టి సత్య నారాయణ, కోటగిరి శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

# 'సింగరేణి'లోని 7 వేల మందికి పట్టాలు

రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్

**ప్రజాపక్షం/గోదావరిఖని :** గతంలో వైఎస్ఆర్ పాలనలో సింగరేణి స్థలాల్లో ఇల్లు నిర్మించుకున్న 18 వేల మంది నిరుపేదలకు పట్టాలు మంజూరు చేశారని, అదే విధంగా ప్రస్తుతం సింగరేణి స్థలాల్లో ఉంటున్న మరో 7 వేల మంది పేదలకు పట్టాలు పంపిణీ చేయాలని రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌లు రామగుండం పర్యటనలో భాగంగా రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ అధ్యక్షతన గోదావరిఖనిలో జరిగిన బహిరంగసభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభలో ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ మాట్లాడుతూ, రామగుండంలో మరోతహసీల్ కార్యాలయం, జూనియర్ కళాశాల భవనం మంజూరు చేయాలన్నారు. రామగుండం జనరల్ ఆసుపత్రి నిర్మాణానికి అదనంగా రూ.50 కోట్లు మంజూరు చేసి నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. రామగుండంలో దేవాలయాలను పురావస్తుశాఖ ద్వారా అభివృద్ధి చేయాలని ఇందుకు రూ.12 కోట్లు మంజూరు చేయాలన్నారు. మరో 150 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు నిధులు మంజూరు చేయాలన్నారు. పాలకుర్తి ఎత్తిపోతలకు రూ.450 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని, దీనికి సంబంధించి డిపిఆర్‌ను త్వరలో రూపొందించాలని కోరారు. సింగరేణి మేడిపల్లి ఓపెన్‌కాస్టు వద్ద హైడల్ విద్యుత్తు ప్లాంటును పిపిఎ పద్దతిన నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.





రామగుండాన్ని వ్యాపార, వైద్య, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు హార్కర వేణుగోపాల్‌రావు మాట్లాడుతూ, రైతన్నలకు రూ.21 వేల కోట్ల రుణమాఫీ ఏకకాలంలో చేశామన్నారు. పేద ప్రజల సంక్షేమ కార్యక్రమాలు చేస్తునే ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించిందన్నారు. పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, గత పది, పదిహేనుళ్లుగా పెండింగ్‌లో ఉన్న అంశాలను పరిష్కరించినట్లు తెలిపారు. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల కాలనీలో 2 నెలల్లోగా మౌళిక వసతులు కల్పిస్తామన్నారు. నగరపాలక పరిధిలో రూ.80.52 కోట్లతో అభివృద్ధి పనులు, రూ.88.90 కోట్లతో పలు కాలనీల్లో తాగునీటి సరఫరా పైప్‌లైన్ నిర్మాణ పనులకు, రామగుండం బిపవర్‌హౌజ్ కార్నర్ నుంచి రామునిగుండాల వరకు రూ.6.5 కోట్లతో రహదారి విస్తరణ నిర్మాణ పనులకు మంత్రులు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. కాగా, ముందుగా హైదరాబాద్ నుంచి రామగుండానికి చేరుకున్న డిప్యూటి సీఎం, మంత్రులకు హెలిప్యాడ్ వద్ద రామగుండం కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షలు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆర్థికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరి సందీప్‌కుమార్ సుల్తానియా, రాష్ట్ర కనీస వేతన సలహా మండలి ఛైర్మన్ జనక్‌ప్రసాద్, అదనపు కలెక్టర్లు దాసరి వేణు, జె.అరుణశ్రీ, డిసిపి బి.రామ్‌రెడ్డి, ఆర్‌డివో బి.గంగయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, ప్రాజెక్టు డైరక్టర్(హౌసింగ్) రాజేశ్వర్‌రావు, సింగరేణి ఆర్జీ1 జీఎం డి.లలిత్‌కుమార్, కాంగ్రెస్ నగర అధ్యక్షులు బొంతల రాజేష్, మాజీ కార్పొరేటర్లు మహంకాళిస్వామి, కొలిపాక సుజాత, పట్టణ అధ్యక్షులు తిప్పారపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌తోనే పల్లెల అభివృద్ధి :మేడిపల్లి

**ప్రజాపక్షం/గంగాధర:**తెలంగాణ రాష్ట్రంలోని పల్లెల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. గంగాధర మండలం ఇస్లాంపూర్ గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మిస్తున్న నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యం మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం పల్లెల అభివృద్ధిని నిర్లక్ష్యం చేసిందని గుర్తుచేశారు. గ్రామాల్లో సర్పంచులు చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాలు అభివృద్ధి బాట పట్టాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో చొప్పదండి నియోజకవర్గంలోని ప్రతి పల్లెను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. స్థానిక సర్పంచ్ బారాజు ప్రభాకర్‌రెడ్డి, ఉపసర్పంచ్ సుంకె రవీందర్, స్థానిక తహసీల్దార్ అంబటి రజిత, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, వెలిచాల తిరుమల రావు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ముద్దం నగేష్, రామిడి రాజిరెడ్డి, సాగి అజయ్ రావు తదితరులున్నారు.





**అభివృద్ధిని చూసి కాంగ్రెస్ పార్టీలో చేరికలు**

తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఇతర పార్టీలకు చెందిన సర్పంచులు, నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. గంగాధర మండలం రంగారావుపల్లి సర్పంచ్ దాసరి శంకరయ్య ఎమ్మెల్యే మేడపల్లి స్యం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సంధర్భంగా గంగాధరలోని ప్రజాకార్యాలయంలో సర్పంచ్ శంకరయ్యకు ఎమ్మెల్యే కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే సత్యం మాట్లాడుతూ ప్రజా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ ముందుంటుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని పేర్కొన్నారు. చొప్పదండి నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని తెలిపారు.

## 13న కరీంనగర్‌కు వెలిచాల

**ప్రజాపక్షం/కరీంనగర్:**కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులైన వెలిచాల రాజేందర్ రావు మొట్ట మొదటిసారిగా ఈ నెల 13న మంగళవారం కరీంనగర్ రానున్నారు. అలుగునూరు చౌరస్తా వద్ద మంగళవారం ఉదయం 11 గంటలకు కాంగ్రెస్ నాయకులు మాజీ కౌన్సిలర్లు, మాజీ కార్పొరేటర్లు, సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ వివిధ సంఘాల నాయకులు ముఖ్యులు, అభిమానులు వెలిచాల రాజేందర్ రావుకు ఘన స్వాగతం పలుకనున్నారు. అనంతరం వారితో కలిసి భారీ ర్యాలీ మధ్య వెలిచాల రాజేందర్ రావు గీత భవన్ చౌరస్తా వద్దకు చేరుకుంటారు. అక్కడ జరిగే సంబురాల్లో పాల్గొంటారు. ఆ తర్వాత మధ్యాహ్నం డిసిసి కార్యాలయంలో రాజేందర్ రావు ప్రెస్ మీట్ నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి డిసిసి అధ్యక్షుడు మేడిపల్లి సత్యం, టిపిసిసి ఎస్‌సి సెల్ చైర్మన్ మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్, ఆర్‌టిఎ మెంబర్ పడాల రాహుల్, నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్, కాంగ్రెస్ నేత ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్ తో పాటు మాజీ ఎమ్మెల్యేలు వివిధ నామినేటెడ్ హోదాల్లోని నాయకులు ముఖ్య నేతలు, బ్లాకు మండల కాంగ్రెస్ అధ్యక్షులు అనుబంధాల సంఘాలు అనుబంధ విభాగాల అధ్యక్షులు నాయకులు, రాష్ట్ర జిల్లా కాంగ్రెస్ ప్రతినిధులు జిల్లా కార్యవర్గ సభ్యులతోపాటు కాంగ్రెస్ నాయకులు, పలువురు నేతలు హాజరుకానున్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు నాయకులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సర్పంచులు, ఉప సర్పంచులు కార్యకర్తలు వెలిచాల అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని వెలిచాల ప్రజా కార్యాలయం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేసింది.

## సమాజ సేవలో ముందుండాలి



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్:** సమాజ సేవలో నేటి యువత ముందు ఉండాలని రంగాపూర్ సర్పంచ్ గంట రమేష్ తెలిపారు. ఆదివారం రోజునగాయత్రి డిగ్రీ అండ్ పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ శీతాకాలపు శిబిరం ముగింపు కార్యక్రమం గాయత్రి డిగ్రీ కళాశాల ద్వారా రంగాపూర్ గ్రామంలో గత వారం రోజులుగా చేపడుతున్న జాతీయ సేవ పథకం ఎన్ ఎస్ ఎస్ శీతాకాల శిబిరంలో భాగంగా చివరి రోజున ముగింపు కారిక్రమం చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ గంట రమేష్ , ఉపసర్పంచ్ కొండా శ్రావణ్,గాయత్రి డిగ్రీ కళాశాల అధినేత అల్లేంకి శ్రీనివాస్ హాజరై అనంతరం మాట్లాడుతూ విద్యతోపాటు సామాజిక సేవ చేయడానికి ఈ జాతీయ సేవ పథకం ఒక వేదిక లాంటిందని, ఇందులో ఉన్న మంచి అలవాట్లు నేర్చుకొని భవిష్యత్తు లో సేవ దృక్పతం తో ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమం లో విద్యార్థులను ప్రోత్సహిస్తూ బహుమతులను అందజేశారు. అందులో భాగంగా సర్పంచ్ గంట రమేష్ మాట్లాడుతూ ఈ గ్రామాన్ని మీరు జాతీయ సేవా పథకం శీతాకాల శిబిరంగా ఎంచుకున్నందుకు చాలా సంతోషిస్తున్నాము అలానే విద్యార్థులు చాలా అద్భుతంగా సేవ చేశారని విద్యార్థులను అభినందించారు. విద్యార్థులకు వారి యొక్క జీవిత అనుభవం చెప్పి మీరందరూ కూడా గొప్ప స్థాయిలో వెళ్లాలని కోరుకుంటున్నాను అని వెల్లడించారు. తర్వాత విద్యార్థులు జాతీయ సేవ పథకం (ఎన్ఎస్ఎస్) గురించి చెపుతు అలానే ఈ వారంలో వారి యొక్క అనుభవాల గురించి చెప్పారు. ఆ తర్వాత విద్యార్థులు వారికి సహకరించినటువంటి గ్రామాధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గాయత్రి విద్యానికేతన్ ప్రిన్సిపాల్ విజేందర్, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎంఎ సమద్ మరియు అధ్యాపకురాలు ఆమని పాల్గొన్నారు.

## ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్ద పీట

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



**ప్రజా పక్షం/ వేములవాడ :** ప్రజా ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వేములవాడ అర్బన్ మండలం పరిధిలో అర్హులైన 25 మంది లబ్ధిదారులకు ఏడు లక్షల తొంబై ఎనిమిది వేలు,వేములవాడ అర్బన్ మండల పరిధిలోని ముప్పై మంది లబ్ధిదారులకు ఎనిమిది లక్షల తొంబై ఒక వేల ముఖ్యమంత్రి సహయ నిది చెక్కులను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడాతు రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. పేదలకు వైద్య పరంగా ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.



## మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

**ప్రజాపక్షం/చొప్పదండి:**రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. పట్టణ అభివృద్ధి పనుల్లో భాగంగా చొప్పదండి పట్టణ కేంద్రంలోని పలు వార్డులలో రూ.2 కోట్ల నిధులతో నూతన సిసి రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి స్థానిక నాయకులతో కలిసి చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శంకుస్థాపన చేశారు. అనంతరం మండల కేంద్రంలోని వరలక్ష్మి ఫంక్షన్ హాలులో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి ఆద్వర్యంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్, ఉపసర్పంచులను సన్మానించారు. మండల పరిధిలోని 38 మంది లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. తదుపరి రాబోయే మున్సిపల ఎన్నికల్లో భాగంగా నిర్వహించిన చొప్పదండి మున్సిపాలిటీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని, పట్టణంలోని అన్ని వార్డులలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఇటీవల వెదురుగట్ట గ్రామానికి చెందిన చిలుక నరేష్ కుమారుడు ప్రణవ్‌రాజ్ అనే బాలుడికి లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ జరగగా ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రెండు లక్షల యాభైవేల రూపాయలు (రూ.2.50 లక్షలు) మంజూరు చేయించారు. ఆదివారం వారి ఇంటికి వెళ్లి బాలుడిని పరామర్శించి కుటుంబ సభ్యులకు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల, ప్రజాప్రతినిధులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# దోపిడీ రహిత సమాజమే సిపిఐ లక్ష్యం

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి గడిపే మల్లేశ్,

**ప్రజాపక్షం /హుస్నాబాద్ :** దేశంలో దోపిడి రహిత సమాజ నిర్మాణంమే భారతీయ కమ్యూనిస్టు పార్టీ లక్ష్యమని సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి గడిపే మల్లేశం అన్నారు. అదివారం హుస్నాబాద్ పట్టణంలో జనసేన దళ్ శిక్షన శిబిరంను ప్రారంబించారు. ఈ సందర్భంగా అరుణ పతాకంను ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ దేశంలో దోపిడి రహిత సమాజం అంతరాలులేని సమాజనిర్మాణం చేయడమే సిపిఐ పార్టీ లక్ష్యమని అన్నారు. భారతగడ్డపై సిపిఐ పార్టీ వంద ఏళ్ల త్యాగాల చరిత్ర శతజయంతి ఉత్సవాల ముగింపు సభ ఈ నెల 18న ఖమ్మం జిల్లా కేంద్రంలో జరగనున్నయని పేర్కొన్నారు. ఈ సభకు 40 దేశాల ప్రతినిధుల 5లక్షల పార్టీ కార్యకర్తలు పాల్గోటారని తెలిపారు. ఈ సభలో దేశ, రాష్ట్ర రాజకీయ భవిశ్యత్తును చర్చించి కార్యచరణం రూపొందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన దళ్ రాష్ట్ర శిక్షకుడు గోపిక మోహన్, రాష్ట్ర సమితి సభ్యులు కనుకుట్ల శంకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు జాగీరు సత్యానారయణ, కె. లక్ష్మన్, అందె కిశోర్, జేరిపోతుల జనార్ధన్, వేల్పుల శ్రీనివాస్, బెజ్జెంకి మండల కార్యదర్శి బొనగిరి రూపేశ్, మహిళ జిల్లా సమాఖ్య అధ్యక్ష/రాలు గూడ పద్మ, విదార్థి సంఘం జిల్లా అధ్యక్షులు జనగాం రాజ్‌కుమార్, నరేశ్, తో పాటు సిపిఐ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## చైనా మాంజా నిషిద్ధం

వాడినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తప్పవు

సిద్దిపేట పోలీస్ కమిషనర్ రశ్మిపెరుమాళ్



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** చైనామాంజాను వినియోగం నిషిద్ధమని..వాడిన, విక్రయించిన వారిపై కఠిన చర్యలు తప్పవని సిద్దిపేట పోలీస్ కమిషనర్ సాధన రశ్మీ పెరుమాళ్ హెచ్చరించారు. ప్రజల ప్రాణ రక్షణ దృష్టిలో ఉంచుకొని ప్రమాదాలకు కారణమవుతున్న చైన మాంజ వినియోగాన్ని ప్రభుత్వం నిషేధించిందని అన్నారు. చైనా మాంజ కారణంగా ద్విచక్ర వాహనదారులు, పాదచారులు పక్షులు తీవ్రంగా గాయపడటంతో పాటు ప్రాణ నష్టం సంబంవించిన సంఘటనలు చోటుచేసుకున్నాయని సిపి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంగించి చైన మాంజాను వాడినా, విక్రయించిన చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. జిల్లా ప్రజల ఈ విషయాన్ని గమనించి తమ పిల్లలను చైనా మాంజా వినియోగానికి దూరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనలు పాటిస్తూ చైన మాంజా వల్ల కలిగే ప్రమాదాల నుండి ప్రాణభద్రతకు సహకరించాలని సూచించారు. జిల్లాలో ఎక్కడైన నిషేధిత చైనా మాంజం వినియోగించినట్లు సమాచారం ఉన్నట్లయితే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు

# పెద్దపల్లిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం

శాసనసభ్యుడు చింతకుంట విజయరమణ రావు



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** పెద్దపల్లి పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని, పట్టణంలోని టీచర్స్ కాలనీకి మూడు కోట్లతో అభివృద్ధి పని చేశామని, పట్టణంలో చేపట్టే అభివృద్ధి పనులను చూసి రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ఆశీర్వదించాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు పిలుపునిచ్చారు. ఆదివారం రోజున స్థానిక టీచర్స్ కాలనీలో కాంగ్రెస్ నాయకులు గుజ్జుల కుమార్ తన సొంత ఖర్చులతో నూతనంగా నిర్మించిన కమాన్ ను కాలని వాసులతో మరియు స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. అనంతరం గుజ్జుల కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూపెద్దపల్లి పట్టణంలోని 5వ వార్డు అయిన టీచర్స్ కాలనీలో రూ. 3 కోట్ల 1 లక్షలతో అభివృద్ధి కార్యక్రమాలు చెప్పడం జరిగిందని వాటికి త్వరలోనే శంకుస్థాపనలు చేయడం జరుగుతుందని అన్నారు. గత సంవత్సరంలో టీచర్స్ కాలనీ అభివృద్ధికి రూ. 53 లక్షలు కేటాయించడం జరిగిందని అలాగే ఈ రోజటి వరకు టీచర్స్ కాలనీ అభివృద్ధికి రూ. 3.54 కోట్ల నిధులను వెచ్చించడం జరిగింది అని అన్నారు. పెద్దపల్లి పట్టణం దశలవారీగా సుందరంగా మారుతోందని గుర్తు చేశారు. పట్టణ ప్రజలు రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను అరిశిర్వదించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షులు రాంపల్లి సర్పంచ్ కనపర్తి సంపత్ రావు, సిటీ కేబుల్ ఎండి కొట్టే సదానందం, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య, కాంగ్రెస్ నాయకులు జడల సురేందర్, రామిడి తిరుపతిరెడ్డి, కాసర్ల రాజు రెడ్డి, కాసనగొట్టు అశోక్, సోమిశెట్టి తిరుపతి, కనుక రాజ్, ఆలయ, లక్ష్మణ్ గౌడ్, మిరియాల శ్రీనివాస రావు, పెద్దపల్లి సత్యం ఆంజనేయరావు, లింగా రావు, పిడుగు సంపత్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ దొంకన రవి, సీనియర్ పాత్రికేయులు కట్టా నరేంద్ర చారి, పిడుగు సంపత్, పెద్దపల్లి సతీష్, ఎండి ఇబ్రహీం, మహమ్మద్ సాదిక్ పాషా టీచర్స్ కాలనీ వాసులు,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
కరీంనగర్
సోమవారం
12-01-2026
www.prajapaksham.in

రీల్

‘ప్రభాస్, మారుతి కాంబినేషన్‌లో ఇటీవల విడుదలైన రాజా సాబ్ సినిమాలో కొన్ని కొత్త సన్నివేశాలు యాడ్ చేశారు. ఈనెల 9వ తేదీన కాపీలో ప్రభాస్ ఓల్డ్ గెటప్‌కు సంబంధించిన సన్నివేశాలను తీసేసి రిలీజ్ చేశారు. సినిమా విడుదల అనంతరం డివైడ్ టాక్ రావడంతో ఇప్పుడు కొత్త సన్నివేశాలు యాడ్ చేశారు. సినిమాపై వచ్చిన టాక్ నేపథ్యంలో కొత్త సన్నివేశాలు యాడ్ చేసినట్టు దర్శకుడు మారుతి, నిర్మాత విశ్వప్రసాద్ తెలిపారు.’

## అఖండ-2 చూసిన చిన జీయర్ స్వామి



బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో విడుదలైన నాల్గవ చిత్రం ‘అఖండ–2’. త్రిదండి చినజీయర్ స్వామి, త్రిదండి అహోబిలం స్వామి వారు 400 మంది వేద పాఠశాల విద్యార్థులతో కలిసి హైదరాబాద్‌లో అఖండ–2 సినిమాని వీక్షించారు. బాల కృష్ణ రుద్రుడిగా చేసిన అఖండ తాండవాన్ని చూసిన తర్వాత దర్శకుడు బోయపాటి శ్రీనుని చిన జీయర్ స్వామి ఆశీర్వదించి సన్మానించారు. ఈ సందర్భంగా త్రిదండి చినజీయర్ స్వామి మాట్లాడుతూ ఎంతో బాధ్యతతో కూడిన చిత్రాన్ని తీశారని మీరు తీసిన ఈ చిత్రం ద్వారా హైందవ ధర్మాన్ని అందరికి అర్థమయ్యేలాగా, బలంగా చెప్పారని దర్శకుడు బోయపాటి శ్రీనుని ప్రశంసించారు.



## ఫుల్ ఫన్ రైడ్‌లా వుంటుంది..

### ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో రవితేజ

రవితేజ హీరోగా కిషోర్ తిరుమల దర్శకత్వంలో, సుధాకర్ చెరుకూరి ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ‘భర్త మహాశయులకు విజ్ఞప్తి’. డింపుల్ హయతి, ఆషిక రంగనాథ్ కథానాయికలుగా నటించిన ఈ చిత్రం, ఇప్పటికే టీజర్, ట్రైలర్, పాటలతో హ్యూజ్ బజ్‌ను సృష్టించింది. ఈ సినిమా జనవరి 13న విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో రవితేజ మాట్లాడుతూ మా ఆర్ట్ డైరెక్టర్ ప్రకాష్, నేను కలిసి 13 సినిమాలు చేశాం. మా సినిమాలన్నీ దాదాపు హిట్ అయ్యాయి. ఈ సినిమాలో మా హీరోయిన్స్ చాలా అందంగా కనిపిస్తారు. నన్ను కూడా చాలా అందంగా చూపించాడు డీవోపీ ప్రసాద్ మూరెళ్ళ. తనతో తొమ్మిది సినిమాలు చేశాను. కొరియోగ్రాఫర్స్ శేఖర్, భాను కంపోజ్ చేసిన పాటలన్నీ కూడా సూపర్ హిట్ అయ్యాయి. ఫైట్ మాస్టర్ పృధ్వి ఇందులో ఎంటర్ టైనింగ్‌గా ఉండే ఫైట్లు కంపోజ్ చేశారు. ఈ సినిమా ఫుల్ ఫన్‌గా ఉంటుంది. జనవరి 13న భర్త మహాశయులకు విజ్ఞప్తి థియేటర్స్‌లో కలుద్దాం అన్నారు. డైరెక్టర్ హరీష్ శంకర్ మాట్లాడుతూ.. ప్రొడ్యూసర్ సుధాకర్ చెరుకూరి బ్యానర్‌లో నా సినిమా ఖచ్చితంగా ఉంటుంది ఆయనతో పని చేయాలని కోరుకుంటున్నాను. మిరపకాయ వచ్చిన మిస్టర్ బచ్చన్ వచ్చిన ఒకేలా ఉండే వ్యక్తి మాస్మహారాజా రవితేజ. స్థితప్రజ్ఞత కలిగిన వ్యక్తి. ఆ క్వాలిటీ పవన్ కళ్యాణ్ లో తర్వాత రవితేజ లో చూశాను చెప్పారు. డింపుల్ హయాతి మాట్లాడుతూ.. డైరెక్టర్ హరీష్ శంకర్‌ని ఇక్కడ చూడడం చాలా ఆనందంగా ఉంది ఈ సినిమా కూడా బొమ్మ బ్లాక్ బస్టర్ అవుతుంది. ఈ సినిమాలో నేను చేసిన బాలమణి క్యారెక్టర్ చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. చాలా కొత్తదనం ఆడియన్స్ ఫీల్ అవుతారు. హీరోయిన్ ఆశిక రంగనాథ్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఇది అద్భుతమైన జర్నీ. మా నిర్మాత సుధాకర్‌కి థాంక్యూ సినిమాని చాలా అద్భుతంగా నిర్మించారు. రవి తేజ తో పనిచేయడం చాలా హ్యాపీగా ఉంది అన్నారు. నిర్మాత సుధాకర్ మాట్లాడుతూ.. ఈ సినిమా ఖచ్చితంగా హిట్ అవుతుందనే నమ్మకం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## మంచి క్యారెక్టర్లు చేస్తున్నా..

### - సంయుక్త



శర్వానంద్ హీరోగా రామ్ అబ్బరాజు దర్శకత్వంలో తెరకెక్కిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ‘నారి నారి నడుమ మురారి’. 14న ఈ చిత్రం థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ సంయుక్త మీడియాతో ‘చిట్ చాట్’ నిర్వహించారు. సంక్రాంతి చాలా పెద్ద పండుగ. సంక్రాంతికి వచ్చే ప్రతి సినిమాకి మంచి ఆదరణ ఉంటుంది. నారి నారి నడుమ మురారి చాలా క్లీన్ కామెడీ ఎంటర్టైనర్. పండుగకి పర్ఫెక్ట్ మూవీ. డైరెక్టర్ ఈ కథ చెప్పినప్పుడు నాకు చాలా నచ్చింది. వెరీ బ్యూటిఫుల్ స్టోరీ. నాకు కామెడీ సినిమా చేయడం చాలా ఇష్టం. ఇందులో నా క్యారెక్టర్‌కి చాలా ఇంపార్టెన్స్ ఉంటుంది. ఇద్దరు హీరోయిన్స్ ఉన్నప్పుడు ఆడియన్స్ సహజంగా ట్రయాంగిల్ లవ్ స్టోరీ అనుకుంటారు. కానీ ఇది అలా కాదు. డైరెక్టర్ చాలా యూనిక్ పాయింట్ తో ఈ కథ రాశారు. అది మీరు స్క్రీన్ మీద చూడాలి. ఈ సినిమాకి నేనే డబ్బింగ్ చెప్పాను. చాలా ఎంజాయ్ చేశాను. శర్వానంద్ చాలా అద్భుతమైన టైమింగ్ ఉన్న హీరో. చాలా సపోర్టివ్, హెల్ప్ ఫుల్‌గా ఉంటారు. ఆయనతో పనిచేయడం చాలా మంచి ఎక్స్పీరియన్స్. ఇందులో నరేష్, సత్య పాత్రలు కూడా అందరినీ అలరి స్తాయి. డైరెక్టర్ చాలా కూల్ గా ఉంటారు. ఇంత కాంపిటీషన్లో సినిమా వస్తున్న ఆయనకు ఎలాంటి ఒత్తిడి ఉండదు. ఎప్పుడు చాలా కాన్ఫిడెంట్‌గా ఉంటారు. ఆయన కోపంలో ఉన్నట్లు ఎప్పుడు చూడలేదు. చాలా క్లారిటీ వున్న డైరెక్టర్. సాక్షి వైద్య , నాకు మధ్య మంచి కాంబినేషన్ సీన్లు ఉన్నాయి. తనంటే నాకు చాలా గౌరవం. తను ప్రతి సీన్ కి ప్రిపేర్ అయ్యే విధానం చాలా బాగుంటుంది. చాలా హార్డ్ వర్క్ చేస్తుంది. ఇప్పుడు వరకు వైవిధ్యమైన పాత్రలు చేశాను. నా ప్రతి సినిమాకి వైవిధ్యం ఉంటుంది. నాకు అన్ని రకాల పాత్రలు చేయాలని ఉంటుంది. బయోపిక్స్ చేయాలని కూడా ఉంది. అలాగే కామెడీ క్యారెక్టర్స్ కూడా చేయాలనే ఉంది. పూరి జగన్నాథ్‌తో వర్క్ చేశాను. అది ఫెంటాస్టిక్ ఫిలిం. ఎంత చెప్పినా తక్కువే. యాక్టింగ్ షూటింగ్ ప్రాసెస్ ని చాలా ఎంజాయ్ చేశాను. ఎక్కడున్నా అక్కడ ప్రతి పండుగ జరుపుకోవడం అనేది నాకు అలవాటు. అందరూ కూడా మంచి పిండి వంటకాలు మా ఇంటికి పంపిస్తారని కోరుకుంటున్నాను. బ్లాక్ గోల్డ్ సినిమా ఫిబ్రవరిలో షూటింగ్ పూర్తి కావచ్చు. సినిమా చాలా బాగా వస్తోంది

## ‘పురుష:’ టీజర్ రిలీజ్



భార్యాభర్తల కథలకు ఎప్పుడూ డిమాండ్ ఉంటూనే ఉంటుంది. ఇక అందులో కాస్త కామెడీ జోడించి, రియాలిటీకి దగ్గరగా చూపిస్తే ఆ సినిమా పక్కా సూపర్ హిట్. అలాంటి ఫ్యామిలీ కథతో వినూత్నంగా ఎంటర్‌టైన్ చేయడానికి ప్రస్తుత తరానికి తగ్గట్టుగా ట్రెండీ మేకింగ్‌తో ‘పురుష:’ సినిమా రాబోతోంది. పెళ్లి తర్వాత పురుషులు పడే అవస్థలు చూపిస్తూనే భార్యల ఇంపార్టెన్స్ ఏంటనేది ఈ సినిమాలో చూపించనున్నారు. బత్తుల సరస్వతి సమర్పణలో కళ్యాణ్ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద బత్తుల కోటేశ్వరరావు ఈ ‘పురుష:’ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రంతో పవన్ కళ్యాణ్ బత్తుల హీరోగా పరిచయం అవుతుండగా.. వీరు వులవల దర్శకత్వం వహిస్తున్నారు. పవన్ కళ్యాణ్‌తో పాటు సప్తగిరి, కసిరెడ్డి రాజకుమార్ ముఖ్య పాత్రలలో కనిపించనున్నారు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన పోస్టర్లు అందరినీ ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. కేవలం పోస్టర్లు, ఫస్ట్ లుక్స్‌తోనే జనాల్లో ఇంట్రెస్ట్‌ను క్రియేట్ చేశారు. ఈ నేపథ్యంలోనే తాజాగా ‘పురుష:’ టీజర్ వదిలారు. ప్రముఖ దర్శకుడు బుచ్చిబాబు సానా చేతుల మీదుగా ఈ టీజర్ రిలీజ్ చేశారు. ఈ వీడియో చూసిన బుచ్చిబాబు సానా చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉందని చెప్పారు. అలాగే చిత్ర యూనిట్ మొత్తానికి ఆల్ ది బెస్ట్ చెప్పారు. టీజర్ విషయానికొస్తే.. ప్రతి సీన్ లో కామెడీ టచ్ ఉండేలా చూసుకున్నారు. ఏ దినము చూసినా షాపింగ్.. షాపింగ్.. షాపింగ్.. అది మా దినముకి వచ్చుచున్నది అంటూ సప్తగిరి చెప్పిన డైలాగ్ నేటితరం భార్యాభర్తల తీరును చెప్పేలా ఉంది. మగజాతి గర్వించదగ్గ ఆణిముత్యాలండీ మీరు.. అని పేర్కొంటూ టీజర్ ముగించారు.

## సరికొత్త వినోదాన్నిచ్చే చిత్రం

### - మీనాక్షి చౌదరి



నవీన్ పొలిశెట్టి హీరోగా నటించారు. ఈ. నేపథ్యంలో తాజాగా కథానాయిక మీనాక్షి చౌదరి, మీడియాతో ‘చిట్ చాట్’ నిర్వహించారు. గుంటూరు కారం, సంక్రాంతికి వస్తున్నాం, అనగనగా ఒక రాజు ఇలా వరుసగా సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రావడం చాలా సంతోషంగా ఉంది. గతేడాది ‘సంక్రాంతికి వస్తున్నాం’తో మరిచిపోలేని సంక్రాంతి విజయాన్ని అందుకున్నాను. ఇప్పుడు ‘అనగనగా ఒక రాజు’తో మరోసారి ప్రేక్షకుల మనసు దోచుకుంటాననే నమ్మకం ఉంది. ఈ సినిమాలో నా పాత్ర పేరు చారులత. సంపన్న కుటుంబంలో పుట్టిన తండ్రి గారాల పట్టి లాంటి పాత్ర. ఇంట్లో యువరాణిలా పెరుగుతుంది. చాలా మంచి అమ్మాయి. అమాయకంగా, సున్నితమైన మనసు కలిగి ఉంటుంది. క్యూట్‌గా బిహేవ్ చేస్తుంది. నన్ను పూర్తి కామెడీ పాత్రలో చూడబోతున్నారు. ఇది చాలా భిన్నమైన పాత్ర. భీమవరం బాల్మా, రాజు గారి పెళ్ళిరో లాంటి క్యూట్ మాస్ డ్యాన్స్ నెంబర్స్ ఈ సినిమాలో ఉన్నాయి. సాధారణంగా నేను డ్యాన్స్ చేయడానికి సిగ్గుపడుతుంటాను. గోదావరి ప్రాంతంలో చిత్రీకరణ చాలా బాగుంది. అక్కడి ప్రజలు బాగా చూసుకున్నారు. ఎన్నో వంటకాలు తిన్నాను. ఆలయాలతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలను సందర్శించాను. అక్కడి ప్రజలు సినిమా అంటే ప్రత్యేక అభిమానం చూపిస్తుంటారు. గోదావరి ప్రాంతంలో షూటింగ్ అనుభూతిని ఎప్పటికీ మరిచిపోలేను. కథల ఎంపిక నా దృష్టిలో కథే హీరో. కథ ఎలా ఉంది?, దర్శకుడు ఆ కథను, అందులోని పాత్రలను ఎలా చూపించబోతున్నారు అనేది ఆలోచిస్తాను. హీరో ఎవరనేది ముఖ్యం కాదు. కథకు, పాత్రకు ప్రాధాన్యం ఇస్తాను. ఈ పాత్ర నా కెరీర్‌కి ఎలా ఉపయోగపడుతుంది అనేది చూస్తాను. సినీ ప్రయాణం నా దృష్టిలో సినీ ప్రయాణం అనేది ముగింపు లేని పరుగు పందెం లాంటిది. కొత్త కొత్త వాళ్ళు వస్తూ ఉంటారు. నాగ చైతన్యతో వృషకర్మ సినిమా చేస్తున్నాను. మరికొన్ని ఆసక్తికర కథలు కూడా ఉన్నాయి. ఆ చిత్రాలకు సంబంధించిన అధికారిక ప్రకటనలు త్వరలో వస్తాయి.

## ‘ఓ..సుకుమారి’ ఫస్ట్ లుక్

యంగ్ హీరో తిరువీర్, ట్యాలెంటెడ్ హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ తమ చిత్రాలు ‘ప్రీ వెడ్డింగ్ షో’, ‘సంక్రాంతికి వస్తున్నాం’తో బ్లాక్‌బస్టర్ విజయాలు అందుకున్నారు. ఇప్పుడు ఈ ఇద్దరూ కలిసి విలేజ్ ఎంటర్టైనర్ ‘ఓ. సుకుమారి’ చేస్తున్నారు. నూతన దర్శకుడు భరత్ దర్శన్ దర్శకత్వంలో గంగా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై మహేశ్వర రెడ్డి మూలి నిర్మిస్తున్నారు. విమర్శకుల ప్రశంసలు పొందిన తొలి సినిమా ‘శివం భజే’ తర్వాత ఈ బ్యానర్‌లో రూపొందుతన్న చిత్రమిది. ఐశ్వర్య రాజేష్‌కు సంబంధించిన ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. దామినిగా ఆమె స్పిరిటెడ్ అవతార్‌లో కనిపిస్తున్నారు. రంగురంగుల హాఫ్‌సారీలో, చేతుల్లో కర్రలు పట్టుకున్న గ్రామస్థుల నుంచి తప్పించుకుంటూ పరుగులు తీస్తూ, ఆమె ధైర్యం, చలాకీతనంతో పల్లెటూరి అమ్మాయిగా అద్భుతంగా కనిపించింది.



## పూల మార్కెట్‌లో వసతులేవీ?

### రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఎం.కోదండరెడ్డి అసంతృప్తి



ప్రజాపక్షం/హైదరాబాద్: గుడి మల్కాపూర్ పూల మార్కెట్‌లో కనీస వసతులు, నిర్వహణ పట్ల రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఎం.కోదండరెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. రైతుల కంటే దళారులే మార్కెట్‌లో ఎక్కువగా వ్యాపారం చేస్తున్నారని, మార్కెట్ అధికారులు అక్రమ లైసెన్స్ జారీ చేయడాన్ని, మార్కెట్‌లో ఖాళీ స్థలం ఉంటే అమ్ముకునేందుకు అనుమతులు ఇవ్వడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గుడిమల్కాపూర్ మార్కెట్‌ను కోదండరెడ్డి ఆదివారం ఆకస్మీకంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మార్కెట్‌ను కోదండరెడ్డి పర్యటించి, స్థానికంగా ఉన్నవారితో మాట్లాడారు. మార్కెట్ చుట్టూ ఉండే ప్రహారీ గోడ కూలిపోవడం, మార్కెట్ అంత మురుగు నీటితో నిండిపోయి ఉండడాన్ని గమనించిన కమిషన్ బృందం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. వర్ష కాలంలో మార్కెట్ పరిస్థితి మరింత దారుణమని అక్కడికి వచ్చిన వారు కమిషన్ దృష్టికి తీసుకొచ్చారు. పూల మార్కెట్ పూర్తిగా వ్యాపారుల చేతుల్లోనే ఉందని కమిషన్ దృష్టికి తీసుకొచ్చారు. కాగా రైతులు రోడ్లపై అమ్ముకుంటే వ్యాపారాలు మాత్రం మార్కెట్ లోపల మడిగెల్లో విక్రయించుకోవడాన్ని చూసి కమిషన్ ఆశ్చర్యం వ్యక్తం చేసింది. తనిఖీ చేసిన సమయంలో మార్కెట్ కార్యదర్శి, అధికారులు, సిబ్బంది అందుబాటులో లేరు. మార్కెట్ నిర్వహణ రికార్డులు బీరువాలో పెట్టుకుని తాళం వేసుకొని వెళ్లారు. మరి కొందరు అధికారులు సెలవులో ఉండడాన్ని కమిషన్ గుర్తించింది. గతంలో బోయిన్ పల్లి మార్కెట్‌లో కూడా ఇదే పరిస్థితి చూసిన కమిషన్, మార్కెట్ కు వచ్చే రైతుల పరిస్థితి బాగాలేదని, కానీ కమీషన్ ఏజెంట్, వ్యాపారి, అధికారులు బాగానే ఉన్నారని అభిప్రాయపడింది. దీంతో గుడిమల్కాపూర్ మార్కెట్ల తీరుపై కోదండరెడ్డి అసహనం వ్యక్తం చేశారు. రైతు ప్రయోజనాల కోసం ఏర్పాటు చేసిన మార్కెట్లు లోపభూయిష్టంగా ఉన్నాయన్నారు. మార్కెట్ కు వచ్చే రైతుకు లాభం జరిగేలా కనిపించడం లేదని ఆయన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

## గ్రామీణ క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట



జాతీయస్థాయి ఖోఖో పోటీలు ప్రారంభించిన రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, వాకిటి శ్రీహరి
29 రాష్ట్రాల నుంచి 79 జట్ల హాజరు

ప్రజాపక్షం/కాజీపేట : రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా జాతీయస్థాయి సీనియర్ మహిళలు, పురుషుల 58వ ఖోఖో పోటీలు ఉమ్మడి వరంగల్ లోని కాజీపేటలో ఆదివారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. ఈ పోటీలను రాష్ట్ర మంత్రులు రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరిలు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం క్రీడలకు పెద్ద పీట వేస్తున్నట్లు చెప్పారు. క్రీడాకారులను ప్రోత్సాహించేందుకు క్రీడా మైదానాలు, మినీ స్టేడియంల నిర్మాణం చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా గ్రామీణ క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని చెప్పారు. గత ప్రభుత్వం క్రీడలను నిర్లక్ష్యము చేసిందని, తమ ప్రభుత్వం క్రీడల బడ్జెట్‌ను పెంచేందుకు ప్రయత్నం చేస్తుందని చెప్పారు. కాగా ఐదు రోజుల పాటు ఈ పోటీలు జరుగుతాయని రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పోరేషన్ చైర్మన్, తెలంగాణ రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ సంఘ అధ్యక్షులు జంగా రాఘవరెడ్డి తెలిపారు. భారత ఖోఖో ఫెడరేషన్ సౌజన్యంతో తెలంగాణ ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో అట్టహాసంగా 58వ జాతీయస్థాయి ఖోఖో పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోనే మొట్ట మొదటిసారిగా నిర్వహిస్తున్న జాతీయస్థాయి సీనియర్స్ మహిళలు పురుషుల ఖోఖో పోటీలలో దేశంలోని 29 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, రైల్వే, ఎయిర్ పోర్టు అథారిటీ, ఆల్ ఇండియా పోలీస్, కేంద్ర బెటాలియన్స్ నుంచి 40 పురుషుల జట్లు, 39 మహిళల జట్లు పాల్గొంటున్నాయని తెలిపారు. ఖోఖో పోటీల ప్రారంభోత్సవాలకు సూచికగా కాజీపేట ఫాతిమా బ్రిడ్జి నుంచి రైల్వేస్టేడియం వరకు 2వేల మంది క్రీడాకారులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణ, దొంతి మాధవ్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అజీజ్ ఖాన్, వివిధ రాష్ట్రాల ఖోఖో అసోసియేషన్‌ల ప్రతినిధులు, రాష్ట్ర జిల్లా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

## మాంజా పంజా

(మొదటి పేజీ తరువాయి)

వాడొద్దని, వాడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ప్రధానంగా చైనా నుండి దిగుమతి అవుతున్న చైనా మాంజా కూడా రహస్య విక్రయాలు సాగుతున్నట్లు తెలుస్తోంది. ఒక్కొక్క గాలిపటం లేటు రూ.20నుండి రూ.200 వరకు పలుకుతోంది.

### మాంజాతో ఇబ్బంది

ప్రస్తుతం మార్కెట్లో చైనా ఉత్పత్తులు రాజ్యమేలుతున్నాయి. ప్రస్తుతం పరిస్థితుల్లో గాలి పటాలతో పాటు వాటిని ఎగుర వేసేందుకు వినియోగించే మంజాలు కూడా చైనావే కావడం విశేషం. ఈ గాలిపటాలను ఎగురవేసేందుకు వాడే మాంజా అత్యంత ప్రమాదకరంగా మారింది. ఈ మాంజాతో ఆకాశంలో ఎగిరే పక్షులతో పాటు మనుష్యులకు కూడా ప్రాణ సంకటంగా మారింది. ఈ మాంజాను నైలాన్ దారంతో తయారు చేస్తారు. దీనిని తయారీకి సీసం, గాజుపొడి, ప్లాస్టిక్ మిశ్రమాన్ని పూస్తారు. దీంతో దారం తెగనంత గట్టిగా మారుతుంది. గాలిపటం ఎగురవేసే క్రమంలో పక్షుల రెక్కలకు తగిలి తెగిపడటంతో ప్రాణాలు కోల్పోతున్నాయి. వాహన దారులు, పాదచారుల మెడలకు తట్టుకుని తెగిపోతున్నాయి. చిన్న పిల్లల మెడలకు పెద్దవిత్తున లోతైనా గాయాలు అవుతున్నాయి. గత మూడేళ్లుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పలువురు మాంజా ప్రమాదాల భారిన పడి ఆస్పత్రుల పాలయ్యారు.

### గాల్లో నిబంధనలు

చైనా మాంజాను ప్రభుత్వం నిషేధించింది. చైనా మాంజా విక్రయించినా, కొనుగోలు చేసినా చట్టరిత్యా చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరిస్తూనే ఉన్నారు. పోలీసులు వ్యాపారులకు పలు సూచనలు, సలహాలు చేసినప్పటికీ గుట్టు చప్పుడు కాకుండా చైనా మాంజాల విక్రయాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే పలు దుకాణాల్లో సోదాలు చేశారు. మరో ప్రక్క విద్యుత్ వైర్లపై గాలిపటాల మాంజాలు చిక్కుకున్నా, వైర్లు తెగి పడినా వాటిని ముట్టుకోకుండా విద్యుత్ శాఖ టోల్ ఫ్రి నెంబర్ 1912కి కాల్ చేసి చెప్పాలని ఆ శాఖ అధికారులు సూచిస్తున్నారు. చైనా మాంజాల వల్ల ప్రణాలకే ముప్పు ఏర్పడే ప్రమాదం ఉండటంతో పిల్లలు చైనా మాంజాలను వినియోగించకుండా తల్లిదండ్రులు అవగాహన కల్పించాలి. వీధుల్లో ఉండే పెద్దలు సైతం పిల్లలకు మంచి చెడులు వివరిస్తూ ఇతరులకు ఇబ్బందులు తలెత్తకుండా నడుచుకోవాలని సూచనలు చేయాలని పలువురు అంటున్నారు.

## హుష్‌కాకి

(మొదటి పేజీ తరువాయి)

ఆదివారం ఢిల్లీలో మరో ఘటన వెలుగు చూసింది. వృద్ధ దంపతులు సైబర్ మాయగాళ్ల వలలో చిక్కారు. 17 రోజులు డిజిటల్ అరెస్టులో ఉండి.. జీవితకాలం దాచుకున్న సుమారు రూ.15 కోట్లను పోగొట్టుకున్నారు. ఈ ఘటన తాజాగా ఢిల్లీలో వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డా. ఓం తనేజా ఆయన భార్య డా. ఇందిరా తనేజాలు 48 ఏళ్లు ఐక్యరాజ్యసమితిలో సేవలందించారు. రిటైర్ మెంట్ అనంతరం 2015లో భారత్‌కు వచ్చారు. గత డిసెంబర్ 24న.. ఆ దంపతులకు పోలీసు అధికారులమంటూ.. సైబర్ నేరగాళ్ల నుంచి ఓ ఫోన్ కాల్ వచ్చింది. వారిపై పలు క్రిమినల్ కేసులు నమోదయ్యాయని, అరెస్టు వారెంట్లతో ఆ దంపతులను బెదిరించారు. డిసెంబర్ 24 నుంచి జనవరి 10 వరకు డిజిటల్ అరెస్టు చేస్తున్నామని వీడియో కాల్‌లో హెచ్చరించారు. ఆ సమయంలో ఆ దంపతుల నుంచి రూ.14.85 కోట్లను కాజేశారు. అనంతరం సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదిస్తే ఆర్‌బిఐ ఆదేశాల మేరకు డబ్బులు తిరిగి వస్తాయని స్కామర్లు వారికి సూచించారు. దీంతో వృద్ధ దంపతులు పోలీసుస్టేషన్‌కు వెళ్లగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. వారిపై ఎలాంటి అరెస్టు వారెంట్లు లేవని.. సైబర్ మాయగాళ్లు మోసం చేశారని ఆ దంపతులు తెలుసుకున్నారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

## 600 ఖాతాలు డిలీట్

(మొదటి పేజీ తరువాయి)

అశ్లీల, అసభ్యకరమైన కంటెంట్‌పై చర్యలు తీసుకుంది. భారత ప్రభుత్వం సీరియస్ వార్నింగ్ ఇచ్చిన వెంటనే రంగంలోకి దిగిన ‘ఎక్స్’ ఏకంగా 3,500 అశ్లీల పోస్టులను బ్లాక్ చేసింది. అంతేకాదు, ఇలాంటి వక్రబుద్ధి కలిగిన పనులు చేసిన 600 మంది యూజర్ల ఖాతాలను శాశ్వతంగా డిలీట్ చేసింది. భారత చట్టాలకు లోబడి పని చేస్తామని, ఇకపై ఇలాంటివి జరగకుండా చూసుకుంటామని కేంద్రానికి లిఖితపూర్వక హామీ ఇచ్చింది. కొద్ది రోజులుగా ‘ఎక్స్’ వేదికగా ఒక ఆందోళనకరమైన ధోరణి మొదలైంది. మస్క్ తీసుకొచ్చిన ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ టూల్ ‘గ్రోక్’ను కొందరు దుర్వినియోగం చేస్తున్నారు. మహిళల సాధారణ ఫొటోలను తీసుకుని, వాటిని అసభ్యకరంగా మార్ఫింగ్ చేస్తున్నారు. గ్రోక్ సాయంతో నగ్న చిత్రాలను సృష్టిస్తున్నారు. ఈ చిత్రాలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యాయి. దీనిపై మహిళా లోకం భగ్గుమంది. ఇది మహిళల ఆత్మ గౌరవానికి సంబంధించిన విషయమని ఆందోళన వ్యక్తమైంది.

### కేంద్రం కొరడా, 72 గంటల గడువు

విషయం గమనించిన కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటి మంత్రిత్వ శాఖ ఆగ్రహం వ్యక్తం చేసింది. గత వారం ‘ఎక్స్’ ఇండియా చీఫ్ కంప్లైయన్స్ ఆఫీసర్‌కు నోటీసులు పంపింది. ‘మీ ప్లాట్‌ఫామ్‌లో అశ్లీలత పెరిగిపోతోంది. ఎఐని వాడి నగ్న చిత్రాలు సృష్టిస్తున్నారు. వెంటనే దీనిని అడ్డుకోవాలి. మీరు తీసుకున్న చర్యలేంటో మాకు నివేదిక ఇవ్వాలి. దీనికి మీకు ఇస్తున్న సమయం కేవలం 72 గంటలు’ అని కేంద్రం డెడ్‌లైన్ విధించింది. చట్టవిరుద్ధమైన కంటెంట్‌ను హోస్ట్ చేసినా, షేర్ చేసినా ఊరుకోబోమని హెచ్చరించింది.

### తప్పు ఒప్పుకున్న ‘ఎక్స్’

ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం, ఎక్స్ యాజమాన్యం తమ తప్పును అంగీకరించింది. కంటెంట్ మోడరేషన్ విషయంలో లోపాలు జరిగాయని ఒప్పుకుంది. భారతీయ చట్టాలను కచ్చితంగా పాటిస్తామని మాటిచ్చింది. వెంటనే స్పెషల్ డ్రైవ్ చేపట్టి 3500 అశ్లీల చిత్రాలను, వీడియోలను తొలగించింది. వాటిని అప్‌లోడ్ చేసిన, షేర్ చేసిన 600 ఖాతాలను తొలగించింది.

## ప్రజలదే పెత్తనం

(మొదటి పేజీ తరువాయి)

భాగస్వామ్యం ద్వారానే ప్రపంచం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతాయని సూచించారు.‘‘భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం’’ (ఇస్కఫ్) తెలంగాణ రాష్ట్ర రెండవ మహాసభ హైదరాబాద్‌లోని టూరిజం ప్లాజాలో ఆదివారం జరిగింది. ఈ సదస్సుకు ఇస్కఫ్ రిసెప్షెన్ కమిటీ అధ్యక్షుడు, హైకోర్ట్ న్యాయవాది కడారు ప్రభాకర్ రావు అధ్యక్షత వహించారు. జస్టిస్ జి.రాధారాణి ముఖ్యఅతిథాగా హాజరవ్వగా, ఇస్కఫ్ నేషనల్ ప్రిసిడియం మెంబర్, మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా సదస్సు ప్రారంభోపన్యాసం చేశారు. ఆర్‌టిఏ మాజీ జాయింట్ కమిషనర్ సి.ఎల్.ఎన్. గాంధీ హాజరయ్యారు.
ఈ సందర్భంగా జస్టిస్ జి.రాధారాణి మాట్లాడుతూ.. శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్‌లో తలెత్తిన సంక్షోభాలను ఉదాహరణగా చూపుతూ ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పుతామని అగ్రరాజ్యాలు తమ ఆర్థిక, రాజకీయ ఆధిపత్యం కోసం ఇతర దేశాల సార్వభౌమత్వాన్ని దెబ్బతీస్తున్నాయని విమర్శించారు. ఒక దేశ అధ్యక్షున్ని ఆ దేశానికి వచ్చి తీసుకుపోవడం ప్రపంచాన్ని షాక్‌కు గురిచేసిందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల్లో జరుగుతున్న అంతర్యుద్ధాలు, రాజకీయ అస్థిరత పట్ల ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ప్రవేశపెట్టిన ‘అలీన విధానం’ వల్ల అనేక ఆసియా, ఆఫ్రికా దేశాలు ఏకమై తమ ఉనికిని చాటుకున్నాయని గుర్తు చేశారు. అలీన విధానాన్ని అనుసరించి ప్రపంచానికే భారతదేశం ఆదర్శంగా నిలిచిందని, మానవళి, ప్రపంచ శాంతి కోసం, అణ్వాయుద అంతం కోసం భారతదేశం కృషి చేసిందని వివరించారు. శాంతి, సహకారం అనే ప్రాతిపదికన ఏర్పడిన భారతదేశం ఒక పుష్పగుచ్ఛం లాంటిదన్నారు. భారతదేశ ప్రజలను సమీకరించి, చైతన్యపర్చడంలో ఆనాడు ఇస్కస్, ప్రస్తుత ఇస్కఫ్ కృషి చేస్తుందని, ప్రపంచంలో నెలకొన్న ఉద్రిక్తతలను తక్షణమే తొలగించి,శాంతియుత వాతారణాన్ని కల్పించేందుకు ఇస్కఫ్ చేసే కృషి అభినందనీయమని జస్టిస్ రాధారాణి అన్నారు.
సయ్యద్ అజీజ్ పాషా మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా అగ్ర రాజ్యాల పెత్తనం, సామ్రాజ్యవాద పోకడలు పెరిగిపోతున్నాయని, వీటిని ఎదుర్కోవడానికి ప్రజలంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. వెనిజులాలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన అధ్యక్షున్ని అరెస్ట్ చేయడం సిగ్గుచేటన్నారు. క్యూబా, గ్రీన్ లాండ్‌ను కూడా అమెరికా బెదిరిస్తున్నదని,భారతదేశంపై కూడా అదనపు పన్నుల రూపంలో ఒత్తిడి తెచ్చే ప్రయత్నం జరుగుతోందని, అయినప్పటికీ భారత్ ఎన్నడూ ఎవరికీ తలవంచలేదని అజీజ్‌పాషా స్పష్టం చేశారు. 1941లో విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ వేసిన పునాదులతో ప్రారంభమైన ఈ సంస్థ, నాటి నుంచి నేటి వరకు అంతర్జాతీయ శాంతి కోసం కృషి చేస్తోందని వివరించారు. సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం తర్వాత 'ఇస్కాఫ్'గా రూపాంతరం చెంది,రష్యాతో పాటు నేపాల్, శ్రీలంక, వియత్నాం వంటి దేశాలతో సాంస్కృతిక సంబంధాలను మెరుగుపరుస్తోందని తెలిపారు.
సి.ఎల్ ఎన్. గాంధీ మాట్లాడుతూ.. ప్రస్తుత ప్రపంచ రాజకీయా పరిణామాలు ప్రమాదకరంగా మారాయని, ప్రజాస్వామ్యం పేరుతో నియంతృత్వంగా వ్యవహారిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సోవియేట్ యూనియన్‌తో భారతదేశం స్నేహ సంబంధాలు కొనసాగించిందని, ఆ సంప్రదాయాన్ని ఇస్కఫ్ కొనసాగించాలని కోరారు.
కడారి ప్రభాకర్ రావు మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో అంతర్జాతీయ శాంతి కోసం,మావవాళి మధ్య సంబంధాలను కొనసాగించేందుకు ఇస్కఫ్ ప్రయత్నిస్తుందన్నారు. భారతదేశంలోని వైవిధ్యంలో ఐక్యతను సాధించేందుకు, భిన్నసంస్కృతి సాంప్రదాయాలను కొనసాగించాలని సూచించారు. వేర్పాటు వాద శక్తులు, టెర్రరిస్టులు, యుద్దోన్మాద శక్తులకు వ్యతిరేకంగా ఇస్కఫ్ కృషి చేస్తుందని ఆయన తెలిపారు. ఈ సదస్సులో ఇస్కఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.గోపాల్, ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్, కార్యదర్శి రాజశేఖర్, న్యాయవాది బొమ్మెర రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com